ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం; తిథి: ద్వాదశి రా.7.08 వరకు; నక్షత్రం: పుబ్బ ఉ.11.01 వరకు; అమృతకాలం: శనివారం ఉ.2.02 నుండి ఉ.3.27 వరకు; వర్జ్యం: సా.5.27 నుండి 6.53 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.33 నుండి 9.19 వరకు, మ.12.23 నుండి 1.09 వరకు; రాహుకాలం: ఉ.10.33 నుండి మ.12.00 వరకు; యమగండం: మ.2.52 నుండి సా.4.18 వరకు;

Estd 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!








సంపుటి:58 • సంచిక: 186 • శుక్రవారం 25 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore




# కారు.. హుజోరు

రికార్డు మెజారిటీ **43,358**

రేపు హుజూర్‌నగర్ వెళ్తున్నా.. ప్రజలను కలిసి కృతజ్ఞతలు చెబుతా. ఏం చేయాలనుకున్నానో అక్కడే అన్నీ చెబుతా.. వారి నమ్మకానికి తగ్గట్టు అన్నీ చేస్తాం -సీఎం కేసీఆర్



హుజూర్‌నగర్‌లో సంబరాలు

తెరాస అభ్యర్థి సైదిరెడ్డికి 1,13,095 ఓట్లు

కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతికి 69,737 ఓట్లు

బీజేపీ, టీడీపీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు

కేసీఆర్ మళ్లీ గెలిచారు. పలు రకాలుగా ఆయన గెలిచారు. హుజూర్‌నగర్లో కాలు పెట్టకుండానే... ప్రచారం చేయకుండానే... ఎలాంటి హామీలివ్వకుండానే తెరాస అభ్యర్థిని గెలిపించి ఆయన గెలిచారు.. ఎలాంటి హామీలతో పనిలేకుండానే హుజూర్‌నగర్ని తన ఖాతాలో వేసుకున్నారు. అదీ రికార్డు మెజారిటీతో! ఒకవైపు విపక్షాల దూకుడు ప్రచారం.. మరోవైపు ఆర్టీసీ కార్మికుల సమ్మె.. అయినా తొణకని బెణకని వైఖరి... ప్రభుత్వ పనితీరు మీద ఆత్మవిశ్వాసం.. ఓటర్ల మీద నమ్మకం.. ఏకంగా హుజూర్‌నగర్ మీదే తిరుగులేని నిశ్చితాభిప్రాయం. ఇవన్నీ కలగలిసి తిరుగులేని మెజారిటీతో తెరాస అభ్యర్థిని గెలిపించాయి. తెరాసకే సొంతమైన ఎన్నికల వ్యూహరచనా నైపుణ్యంతో సొంత కేడర్ ఓటర్లతో మమేకమై సాధించి తెచ్చిన విజయమిది. అందుకే సీఎం కేసీఆర్ శనివారం హుజూర్‌నగర్ ప్రయాణం పెట్టుకున్నారు. వెళ్లి స్వయంగా ఓటర్లను పలకరించి అభినందించి కృతజ్ఞతలు చెప్పి రావాలని నిర్ణయించారు. హుజూర్‌నగర్ కోటలో తెరాస అతి సునాయాసంగా పాగా వేసింది. నిజానికి అది కాంగ్రెస్ పార్టీ సీటు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి కిందటి డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఆతర్వాత ఎంపీగా గెలిచినందున రాజీనామా చేయడంతో అనివార్యమైన ఉప ఎన్నికలో చేజేతులా కాంగ్రెస్ పార్టీ తన సీటుని కోల్పోయింది.

వివరాలు 2లో...

# నీయంతటి వారే లేరు!

- మహాత్ముడి తర్వాత రక్తం చిందకుండా లక్ష్యం సాధించిన జనహృదయాధినేత కేసీఆర్
- వనరుల నిర్వహణలో అసమాన ప్రతిభాశీలి
- క్యాస్ట్రో, జిన్‌పింగ్‌లను మించిన పరిపాలనాదక్షత
- కఠిన నిర్ణయాలూ తమ సంక్షేమం కోసమేనని జనం నమ్మకం
- ప్రతికూలతల మధ్య నిరూపించిన హుజూర్‌నగర్ ఉప ఎన్నిక



## జనం హుజూరు!!

ప్రజాభ్యుదయం కోసం పాలకులు తీసుకుంటున్న కఠిన నిర్ణయాల్ని ప్రజలు ఆమోదిస్తున్నారు. ఇవి తమ సంక్షేమం, దీర్ఘకాల ప్రయోజనాల కోసమేనన్న విశ్వాసమే వారినీ దిశగా పురికొల్పుతోంది. కఠిన నిర్ణయాల్ని విపక్షాలు, వైరిపక్షాలు నియంతృత్వ ధోరణిగా అభివర్ణించినప్పటికీ అవి ప్రజల విశ్వాసాన్ని పొందలేక పోతున్నాయి. నిర్ణయం కఠినమైనదైనా ఆచరణ తమకనుకూలంగా ఉన్నంతవరకు పాలకుల పట్ల ప్రజల సానుకూలత ఏమాత్రం తగ్గదని హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉపఎన్నిక ఫలితం మరోసారి తేల్చిచెప్పింది.

(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

**ముఖ్యమంత్రి** కేసీఆర్‌ది వినూత్నశైలి. ఉద్యమ నిర్వహణలో దేశంలోనే ఆయన సరికొత్త పంథాననుసరించారు. ప్రజల్ని తనవైపు ఆకర్షించడం కోసం ఎన్నికల విధానాన్ని వినియోగించుకున్నారు. దేశంలో మహాత్ముడి తర్వాత రక్తం చిందకుండా తూటా పేలకుండా అహింసాయుతంగా లక్షలాదిమందిని సమీకరించి పాలకులపై ఒత్తిడి పెంచి ఆశించిన లక్ష్యాన్ని సాధించిన వ్యక్తిగా ఆయన ఇప్పటికే గుర్తింపు పొందారు. ప్రత్యేక ఉద్యమ సమయంలో కూడా పదేపదే పదవులకు రాజీనామా చేసి తిరిగి ఎన్నికలకెళ్ళారు. తద్వారా విభజన ఉద్యమాన్ని ప్రజల్లో సజీవంగా ఉంచగలిగారు. ఈ వ్యూహం ఫలించింది. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి కేంద్రం కేసీఆర్‌కు తలొగ్గాల్సి వచ్చింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఆశిస్తున్న ప్రత్యేక రాష్ట్రం ఆయన ఉద్యమంతో సఫలీకృతమైంది. కేవలం రాష్ట్ర సాధనతోనే సరిపెట్టకుండా ఉన్న వనరుల్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు ఆయన తొలి ఐదేళ్ళు చేసిన ప్రయత్నానికి ప్రజలు మద్దతు పలికారు. తిరిగి మరింత మెజారిటీతో రెండోసారి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ ప్రక్రియలో విపక్షాలు ఘోరంగా దెబ్బ తిన్నాయి. ఆత్మస్థైర్యాన్ని కూడా పోగొట్టుకున్నాయి. ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. దీంతో కేసీఆర్ పాలనపై కంటే ఆయన విధాన నిర్ణయాలు తీసుకుంటున్న తీరును ప్రజల్లో విమర్శించడం మొదలెట్టారు. ఎవరి సలహాలు, సంప్రదింపులేకుండా ఆయనొక్కరే ఐదుకోట్ల తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను నిర్దేశిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో నియంతృత్వానికి పునాదులేశారంటూ కేసీఆర్‌ను ఇరుకునపెట్టే ప్రయత్నం చేశారు. ఆయన్ను నేరుగా నియంతంటూ సంబోధించారు. తెలంగాణలో ఏకవ్యక్తి పాలన నడుస్తోందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే విఘాతమన్నారు. కేసీఆర్‌కు తగిన

ఏకవ్యక్తి పాలన కాదు.. జనం మెచ్చిన నాయకుడు.. లక్ష్యాన్ని సాధించిన విజయుడు



3వ పేజీలో...

# ఆర్టీసీ కార్మికులకు ఆఫర్

వాళ్లే స్వచ్ఛందంగా వెళ్లారు.. దరఖాస్తులిచ్చి స్వచ్ఛందంగా చేరొచ్చు

- ఆర్టీసీని ఎవ్వరూ కాపాడలేరు
- వెయ్యి శాతం పాత ఆర్టీసీ ఉండదు
- ఈ సమ్మె అసంబద్ధం.. డిమాండ్‌లు అనైతికం
- ఆర్టీసీ సమ్మెకు ఆర్టీసీ ముగింపే సమాధానం
- ఐదారు రోజుల్లో పూర్తి స్థాయిలో సర్వీసుల పునరుద్ధరణ: సీఎం కేసీఆర్

ఆర్టీసీ కార్మికులది పిచ్చిపంథా. అర్థం పర్థం లేని డిమాండ్‌లు చేస్తున్నారు. వారిది దురహంకారపు వైఖరి. నాలుగేళ్లలో 67 శాతం జీతాలు పెంచా. ఇంకా గొంతెమ్మకోర్కెలా? బుద్ధి, జ్ఞానం ఉండి చేస్తున్న సమ్మెనా ఇది. యూనియన్ ఎన్నికలకు ముందు జరిగే దిక్కుమాలిన, చిల్లరమల్లర సమ్మెలివి.

– సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెపై సీఎం కేసీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆర్టీసీ కార్మికులు ఎత్తుకున్నది అర్థంపర్థంలేని పిచ్చిపంథా అని దురహంకార పద్ధతిని అవలంబించారని మండిపడ్డారు. అమాయక కార్మికుల గొంతులను యూనియన్ నేతలు కోస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమ్మె ఫలితంగా వెయ్యికి వెయ్యి శాతం పూర్వపు ఆర్టీసీ కొనసాగే అవకాశం లేదని కుండబద్ధలు కొట్టారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఘన విజయం సాధించిన సందర్భంగా గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్మికులను ఎవరూ వెళ్ళగొట్టలేదని చట్ట విరుద్ధమైన సమ్మెతో వాళ్ళకు వాళ్ళే వెళ్ళిపోయారని ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ఎవరూ కాపాడలేరని స్పష్టంచేశారు. ఆర్టీసీనే లేకపోతే విలీన ప్రస్తావన ఎక్కడుంటుందని నిలదీశారు. ఆర్టీసీ సమ్మెకి ఆర్టీసీ ముగింపే

3వ పేజీలో...

## మావి గొంతెమ్మ కోర్కెలు కావు



సమ్మెను ఆపం

కార్మికులెవరూ భయపడొద్దు

న్యాయస్థానాలున్నాయ్

ఆర్టీసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

వివరాలు 5లో...




# కమలమే అతిపెద్ద!

## మహారాష్ట్ర, హర్యానాల్లో భాజపా హవా

- శివసేనతో కలిసి మరాఠీ సీమలో మళ్లీ గద్దె పైకి
- చెరోసగం రెండున్నరేళ్ల సీఎం పోస్టుకు శివసేన ప్రతిపాదన
- హర్యానాలో అతి పెద్ద పార్టీగా అవతరణ
- స్వతంత్రులతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు యత్నాలు
- కింగ్ మేకర్‌గా జేజేపీ చీఫ్ దుష్యంత్ చౌతాలా



## ఓట్లు, సీట్లు తగ్గాయ్

మిత్రుల సహకారం తప్పనిసరి

కమలనాథుల ధాటికి మరోసారి విపక్షాలు నిలువలేకపోయాయి. మహారాష్ట్ర హర్యానా అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో భాజపా తన సత్తా మరోసారి చాటింది. మహారాష్ట్రలో శివసేనతో కలిసి కూటమిగా ఏర్పడి అధికార పీఠాన్ని మరోసారి సొంతం చేసుకుంది. హర్యానాలో అధికారానికి అతి దగ్గరగా వచ్చి ఆగిపోయింది. అయితే, స్వతంత్రులతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు భాజపా పావులు కదుపుతోంది. మహారాష్ట్రలో ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ కాంగ్రెస్‌తో కలిసి ఎదురొడ్డి నిలిచినా ఫలితం లేకపోయింది. హర్యానాలో దుశ్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతాపార్టీకి జాట్‌లు పట్టం కట్టడంతో ఆయన కింగ్ మేకర్‌గా మారాడు.

వివరాలు 8, 9పేజీల్లో

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర, హర్యానాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు తిరుగులేకుండా పోయింది. రెండు రాష్ట్రాల్లోనూ అతిపెద్ద పార్టీగా అవతరించింది. మహా రాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ-శివసేన కూటమి 161 నియోజకవర్గాలను దక్కించుకుంది. బీజేపీ 105 స్థానాల్లో, శివసేన 56 స్థానాల్లో విజయం సాధించింది. ఎన్‌డీఏ కూటమితో మహారాష్ట్రలో మళ్లీ బీజేపీ-సేన ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇక హర్యానాలో బీజేపీకి స్పష్టమైన ఆధిక్యత రాకపోవడంతో హంగ్ అనివార్య మైంది. 90 స్థానాల్లో బీజేపీ 40 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. మ్యాజిక్ ఫిగర్ 46కు అధికార పార్టీ 6 స్థానాలు దూరంగా ఉండటంతో దుశ్యంత్ చౌతాలా పార్టీ జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) కింగ్ మేకర్‌గా నిలిచింది. హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటుకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో జేజేపీ ఎవరికి మద్దతు ఇస్తుందన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. కార్యకర్తలు, నేతలతో చర్చించాక దుశ్యంత్ చౌతాలా బీజేపీ వైపు మొగ్గుచూపే అవకాశం ఉంది. అయితే రెండు రాష్ట్రాల్లోని ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు ఏమాత్రం అందలేదు. ఓటర్ నాడిని పసికట్టడంలో మరోసారి విఫలమయ్యాయి. మహారాష్ట్రలో భారతీయ జనతా పార్టీనే స్వయంగా అధికారంలోకి రావచ్చునని, శివసేనతో కలిసి మూడింట రెండొంతుల మెజార్టీ సాధిస్తుందని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించగా, కేవలం సాధారణ మెజార్టీతోనే సరిపెట్టుకుంది. అదేవిధంగా హర్యానాలోనూ భాజపా తిరిగి అధికారం లోకి వస్తుందని ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేయగా మెజార్టీ ముంగిట కమలం నిలిచిపోయింది. అయితే స్వతంత్రులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమాగా ఉంది.

# హుజూర్‌నగర్ వస్తున్నా..



## అక్కడే థ్యాంక్స్ చెబుతా..

● 50వేల ఓట్ల మెజారిటీ ఆషామాషీకాదు ● విజయానికి గర్వపడం.. మరింత బాధ్యతగా పనిచేస్తాం ● ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా ఉండాలి ● బీజేపీ పెడబొబ్బలకు.. వచ్చిన ఓట్లకు సంబంధమే లేదు ● మీడియా సమావేశంలో సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి అత్యధిక మెజారిటీతో బ్రహ్మాండమైన విజయాన్ని అందించారు. హుజూర్‌నగర్ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతికూల వాతావరణంలో నా సభ జరగకపోయినా ఇంత అద్భుతమైన మెజారిటీ ఇచ్చారంటే ఆషామాషీగా వేసిన ఓటు కాదు. అందుకే హుజూర్‌నగర్ ప్రజలకు కృతజ్ఞతలు అక్కడికే పోయి చెబుతా. 26వ తేదీ సాయంత్రం హుజూర్‌నగర్‌లో కేసీఆర్ సభ ఉంటది. హుజూర్‌నగర్‌లో సభ జరిగితే చానా చేద్దామని చెబుదామనుకున్నా. అనుకోకుండా జరగలే. ఇపుడు గెలిచినం. కృతజ్ఞత సభలో అక్కడి ప్రజలకు ఏం చేస్తమో అన్నీ చెబుత. చెప్పినయన్నీ చేస్తం అని ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు ప్రకటించారు. తెలంగాణభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తర్వాత జరిగిన ఎన్నికలో అనేక అపోహలు, నీలాపనిందలు ప్రచారం చేశారు. అయినా ప్రజలు మావైపే నిలిచారు. ఈ ఎన్నికతో ప్రభుత్వం మారేదిలేదు. పనిచేస్తూ వెళ్ళే ప్రభుత్వం మాది. ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేసినా, దుర్మార్గంగా వ్యక్తిగత విమర్శలు చేసినా, 43వేల మెజారిటీ ఇవ్వడం.. గత ఎన్నికతో పోలిస్తే 50వేల ఓటింగ్ పెరగడం ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని చెబుతోంది. హుజూర్‌నగర్ ప్రజలు ఏఏ ఆశలు, నమ్మకాలు పెట్టుకుని గెలిపించిండ్రో అయన్నీ చేస్తం. నాతో మంత్రి జగదీష్‌రెడ్డి, ఉప ఎన్నికల ఇన్‌ఛార్జిగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డిలు మాట్లాడారు. ఇంత అద్భుతమైన మెజారిటీ ఇచ్చినందున హుజూర్‌నగర్ రావాలి సర్ అన్నారు.. అందుకే నేనే వస్తున్నా.

ప్రతిపక్షాలకు ఒకటే సలహా. ఎదుటివారిని నిందించడమే రాజకీయవిధానం అనేది మార్చుకోవాలి. మనది కొత్త రాష్ట్రం. పాత్రలు మారొచ్చు. ఎవరూ శాశ్వతం కారు. నెగిటివ్ దృక్కోణం ఏర్పరుచుకోవడం మంచిదికాదు అని హితవు పలికారు. ఏ అంశాన్ని ఎతుక్కోవాలె అనేది కూడా తెలియక బూమరాంగ్ అయితుండ్రు. ఏది పడితే అది మాట్లాడితే ఫలితాలు ఇట్లనే ఉంటయ్ అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

### ప్రతిపక్షం ఉండాలి

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఉంటేనే మంచిది. అయితే నిర్మాణాత్మక ప్రతిపక్షం ఉండాలి. కొన్నిపార్టీలు వ్యక్తిగత విమర్శలు చేస్తుంటాయ్. బీజేపీ ఏడాదికాలంగా పెడబొ బ్బలు పెడుతంది. వాళ్ళు పెట్టిన బొబ్బలకు వచ్చిన ఓట్లకు ఏమన్నా సంబంధం ఉందా? మంచి చెడు ఆలోచించి మాట్లాడాలి. ప్రెస్ కాన్ఫరెన్స్ అంటే తిట్టుడే. ఇది పద్ధతికాదు. ప్రజాస్వామ్యంలో విజ యాలు వస్తుంటయ్. పోతుంటయ్. విజయం రాంగనే గర్వపడొద్దు. మా వాళ్ళకు చెబుతున్నా. ఇంత విజయం సాధించినంక కూడా ఇది విజయం కాదు బాధ్యత అని చెబుతున్న. తెలంగాణ రాష్ట్రాన్ని మేం సాధించినం. కరెంట్ సమస్య లేకుండా చేసినం. తాగునీటి సమస్య లేకుండా చేసినం.

కొన్ని రోజులైతే సిటీల కూడా తాగునీటి సమస్య ఉండదు. ఇరిగేషన్ కూడా కాళేశ్వరం పూర్తయింది. పాలమూరు, సీతారామ, దేవాదుల ఈ ఏడు, వచ్చేఏడాదికి అన్నీ పూర్తవుతయ్. సంక్షేమరంగంలో తెలంగాణకు తిరుగేలేదు. మేం చాలా సాదాసీదాగా పనిచేసినా ప్రజలు ఇంత అద్భుత విజయాన్ని ఇచ్చిండ్రు అని కేసీఆర్ అన్నారు.

### నా హెలికాప్టర్ చెక్ చేయాలన్నారు

మా మంత్రులను అడుగడుగునా చెక్ చేసిండ్రు. కేసీఆర్ హెలికాప్టర్ చెక్ చేయాలని కంప్లయింట్ చేసిండ్రు. కేసీఆర్ హెలికాప్టర్‌లో డబ్బులు తీస్కపోతడా. చీప్ ప్రచారం చేయాలని చూశారు. మంచి పద్ధతిలో ముందువెళ్ళండి. ఎందుకిలాంటి పనులు. మీరు కూడా అధికారంలోకి రావొచ్చు కదా. ఆ మిడిసిపాటు మంచిది కాదు అని హితవు పలికారు. మిడియా సమావేశంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# కారు.. హుజోరు..!

● కాంగ్రెస్ కంచుకోటలో గులాబీ విజయ పతాక రెపరెపలు

## 43,358 ఓట్ల మెజార్టీతో తెరాస ఘన విజయం

● పద్మావతిపై గెలుపొందిన సైదిరెడ్డి
● ప్రతిరౌండ్‌లోనూ గులాబీదే ఆధిపత్యం
● టీడీపీ, బీజేపీ డిపాజిట్లు గల్లంతు
● ఉత్తమ్ కోటను కూల్చిన కారు

**నల్గొండ, ప్రభన్యూస్‌బ్యూరో :** ఉత్కంఠను రేకెత్తించిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో తెరాస ప్రభంజనం సృష్టించింది. హోరాహోరీ పోరు చివరకు ఏకపక్షమని తేలింది. టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డిపై 43,358 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ కంచు కోటపై గులాబీ జెండా ఎగురవేశారు. సైదిరెడ్డికి 1,13,095 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డికి 69,737 ఓట్లు మాత్రమే వచ్చాయి. గురువారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత, ప్రతి దశలోనూ కారు దూసుకెళ్లింది. ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం కనబరిచింది. ఉప పోరులో కారు జోరు స్పష్టంగా కొనసాగింది. తెరాస ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం ప్రకటించారు. మునుపెన్నడూ లేనంత భారీ మెజార్టీతో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికి పట్టంగట్టారు. గట్టిపోటీ ఇస్తుందనుకున్న కాంగ్రెస్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. కౌంటింగ్ కేంద్రంలో ప్రతీ రౌండ్‌కు 14 టేబు ళ్లు ఏర్పాటు చేసి 22 రౌండ్లుగా విభజించి లెక్కింపు చేపట్టారు. మొదటి రౌండ్ మొదలుకొని 22వ రౌండ్ వరకు టీఆర్ఎస్ సంపూర్ణ ఆధిక్యం ప్రదర్శించింది. ప్రతీ రౌండ్, ప్రతీ బూత్ లోను టీఆర్ఎస్‌కే మెజార్టీ ఓట్లు వచ్చాయి. ఒకటి రెండు బూత్‌లో మాత్రం కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యత కనిపించింది. కాగా తెలుగుదేశం, బీజేపీ పార్టీలు డిపాజిట్లు కోల్పోయాయి. బీజేపీకి కేవలం 2621 ఓట్లు రాగా, టీడీపీకి 1827 ఓట్లు మాత్ర మే వచ్చాయి. వీరి కంటే స్వతంత్ర అభ్యర్థిగా చపాతి రోలర్ గుర్తుపై పోటీ చేసిన సపావత్ సుమన్ 2693 ఓట్లతో మూడవ స్థానంలో నిలవడం విశేషం. హుజూర్‌నగర్ నియోజకవర్గం లోని ఏడు మండలాల్లోనూ తెరాసదే ఆధిక్యత. 2009 నుంచి మూడు సార్లు ఎన్నికలు జరగ్గా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్య ర్థులపై విజయం సాధిస్తూ వచ్చారు. ఉప ఎన్నికల్లో మాత్రం ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిం చారు. కాంగ్రెస్ బలంగా ఉన్న మండలాల్లోనూ టీఆర్ఎస్ పార్టీ పాగా వేసింది. నేరేడుచర్ల, పాలకీడు, మఠంపల్లి, చింతలపాలేం, మేళ్ళచెరువు, హుజూర్‌నగర్, గరిడేపల్లి అన్ని మండలాల్లోను గులాబీ పార్టీకే మెజార్టీ వచ్చింది.



## రికార్డు మెజారిటీ..

**నల్గొండ, ప్రభన్యూస్‌బ్యూరో :** హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెరాస చరిత్ర సృష్టించింది. మెజారిటీ రికార్డులను తిరగ రాసింది. తెరాస అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 43, 358 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2009లో కొత్తగా నియోజకవర్గం ఏర్పడిన తర్వత, ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఎవరికీ సాధ్యంకాని ఘన విజయాన్ని ఓటర్లు సైదిరెడ్డికి కట్టబెట్టారు. గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రమే అత్యధిక మెజారిటీ పొందిన ఎమ్మెల్యేగా హుజూర్‌నగర్ రికార్డుల్లో ఉన్నారు. ఇప్పుడు ఆ రికార్డును తెరాస చెరిపేసింది. గతంలో ఉత్తమ్ సాధించిన 29,372 ఓట్ల ఆధిక్యత రికార్డును సైదిరెడ్డి 15వ రౌండ్‌లోనే అందుకున్నారు. కాంగ్రెస్ కంచుకోటలో కారు జోష్ అందరినీ షాక్‌కు గురిచేసింది. తెరాస విమర్శకుల నోళ్లు మూయించింది. పునర్వి భజనకు ముందునుంచి లెక్కిస్తే ఇప్పటి వరకు ఇక్కడ మొత్తంగా 9 సార్లు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో స్వల్ప మెజారిటీతోనే విజేతలు ఎమ్మెల్యేలయ్యారు. కనీవినీ ఎరుగని రీతిలో మొదటిసారి సైదిరెడ్డి ప్రభంజనం సృష్టించారు.

- 2009 ఎన్నికలో గుంటకండ్ల జగదీష్‌రెడ్డి , ఉత్తమ్‌కుమార్ రెడ్డి తలపడ్డారు. నాటి ఎన్నికలో ఉత్తమ్ 29,372 ఓట్ల మెజార్టీ సాధించారు.
-2014లో ఉత్తమ్‌పై టీఆర్ఎస్ అభ్యర్థిగా శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ బరిలో దిగింది. అప్పుడు కూడా ఉత్తమ్ 24,630 ఓట్ల ఆధిక్యంతోగెలుపొందారు.
- 2018లో మరోసారి ఉత్తమ్ బరిలోకి దిగగా, తెరాస అభ్యర్థిగా శానంపూడిసైదిరెడ్డి పోటీకినిలబడ్డారు. 7300 ఓట్ల స్వల్ప తేడాతో సైదిరెడ్డి ఓడిపోయారు.
-1952, 1957 ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు ఇక్కడ విజయం సాధించారు. 1962, 1967లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా, 1972లో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

# జగదీషుడి వ్యూహం సూపర్ సక్సెస్

**నల్గొండ, ప్రభన్యూస్ బ్యూరో:** ప్రతిష్టాత్మక ఉప ఎన్నికలో కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టాలన్న తెరాస సంకల్పాన్ని మంత్రి జగదీష్ రెడ్డి సాకారం చేశారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి సొంత నియోజకవర్గంలోనే చుక్కలు చూపించారు. హుజూనగర్‌లో గులాబీ జెండా ఎగురవేశారు. ఐదునెలలపాటు శ్రమించి గులాబీ దళపతికి అరుదైన కానుక ఇచ్చారు. జిల్లామంత్రిగా అన్నీ తానై ఎన్నిక వ్యూహాన్ని పకడ్బందీగా అమలుచేశారు. రికార్డు మెజార్టీతో సైదిరెడ్డిని గెలిపించుకుని ఉత్తమ్‌కు దిమ్మతిరిగే షాకిచ్చారు. పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడం, ఇతర పార్టీల నేతలను పార్టీలోకి ఆహ్వానించడం వంటి వ్యూహాలతో ఎన్నికల క్షేత్రంలో తెరాసను ముందుకు నడిపారు. ముఖ్యమంత్రి సూచనలతో సామాజిక అస్త్రం ప్రయోగించారు. కులాల వారీగా ప్రత్యేక ప్రణాళికలను అమలుచేసి, అన్నివర్గాలను తెరాసవైపు తిప్పగలిగారు. అధినేత కేసీఆర్



ఆలోచనలు ఎప్పటికప్పుడు అమలు చేస్తూ కేడర్‌కు దిశానిర్ధేశం చేయడంలో పూర్తిగా విజయం సాధించారు. భారీ విజయంతో మంత్రి జగదీష్‌రెడ్డి గ్రాఫ్ అమాంతం పైకి ఎగబాకింది. ఆయనపై ముఖ్యమంత్రి, మంత్రులు ప్రశంసలు కురిపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాలపై తన పట్టును మరోసారి చాటుకున్నారు.

### అభివృద్ధి పథకాలతో జనంలోకి...

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా ఎన్నికైన నటి నుండే హుజూర్‌నగర్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టిన జగదీష్‌రెడ్డి తరచూ ఆ నియోజకవర్గంలో పర్యటిస్తూ, విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అధికారపార్టీతో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్న నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. ఎస్‌డీఎఫ్ నిధులతో పాటు మినరల్ ఫండ్ నిధులను ఆ ప్రాంతానికి కేటాయించారు. పురపాలక మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి నేరేడుచర్ల మున్సిపాలిటికి ప్రత్యేకంగా రూ. 10కోట్లు మంజూరు చేయించారు. 30 రోజుల గ్రామ ప్రణాళికలో భాగంగా హుజూర్ నగర్ అభివృద్ధికి భరోసా ఇచ్చారు. ఓవైపు అభివృద్ధి జరుగుతుండగానే ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఆలస్యం లేకుండా వెంటనే శానంపూడి సైదిరెడ్డిని అభ్యర్థిగా ఖరారుచేయించారు. కేడర్‌ను, నాయకులను పరుగెత్తించారు. మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించి యువతతో పాటు కేడర్‌లో ఉత్తేజాన్ని నింపడం కూడా సంచలన విజయానికి కారణ మైంది. పార్టీ ఇన్‌ఛార్జి పల్లా రాజేశ్వరరెడ్డిని, ఇతర జిల్లాల నుండి వచ్చిన నేతలను సమ న్వయం చేసుకుంటూ తెరవెనుక మంత్రాం గం నడిపారు. ప్రత్యర్థుల ఎత్తులను చిత్తుచేసే లా పైఎతులతో ముందుకు సాగిపోయారు. పెన్‌పహాడ్ మండలం లింగాల కేంద్రంగా ఆపరేషన్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ కీలక నేతలను తమ వైపునకు తిప్పుకోవడంలో లింగాల ఆపరేషన్ ఎంత గానో ఉపయో గపడింది. హుజూర్ నగర్ కాంగ్రెస్ ఎంపీపీ శ్రీనివాస్, పాలకీడు జడ్పీటీ సీ సభ్యులు భూక్య బుజ్జిలను పార్టీలో చేర్చుకోవడంలో కీలక పాత్ర పోషించారు. ఉత్తమ్ హ్యాట్రిక్ నియోజ కవర్గంలో సొంత పార్టీనేతలే ఆశ్చర్యపోయే స్థాయిలో బంపర్ విక్టరీ సాధనకు కారకుడయ్యారు.



## ప్రతి రౌండ్‌లోనూ కారు దౌడ్..

| రౌండ్ | తెరాస | కాంగ్రెస్ | భాజపా | తెదేపా |
|---|---|---|---|---|
| 1. | 5,583 | 3,107 | 128 | 113 |
| 2. | 4,723 | 2,851 | 170 | 69 |
| 3. | 5,089 | 2,540 | 114 | 86 |
| 4. | 5,144 | 3,961 | 102 | 127 |
| 5. | 5,041 | 3,032 | 105 | 57 |
| 6. | 5,308 | 3,478 | 72 | 49 |
| 7. | 4,900 | 3,796 | 45 | 46 |
| 8. | 5,624 | 4,055 | 57 | 46 |
| 9. | 5,039 | 3,186 | 111 | 69 |
| 10. | 4,328 | 2,190 | 122 | 69 |
| 11. | 5,877 | 3,169 | 77 | 196 |
| 12. | 4,789 | 2,586 | 103 | 70 |
| 13. | 5,116 | 3,578 | 84 | 51 |
| 14. | 5,224 | 3,237 | 98 | 94 |
| 15. | 6,118 | 3,504 | 135 | 128 |
| 16. | 6,100 | 2,751 | 163 | 101 |
| 17. | 5,456 | 3,206 | 93 | 69 |
| 18. | 4,643 | 2,972 | 127 | 73 |
| 19. | 5,443 | 3,044 | 341 | 82 |
| 20. | 5,109 | 2,964 | 199 | 77 |
| 21 | 5,118 | 3080 | 119 | 87 |

# తెరాస సంబురం

● తెలంగాణ భవన్‌లో మిన్నంటిన సంబురాలు ● కేటీఆర్, కవిత, సంతోష్‌ల హర్షం ● కాంగ్రెస్‌కు సీటుపోయింది.. బీజేపీకి డిపాజిట్ పోయింది: కేటీఆర్ ● కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష: పల్లా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్‌లో గులాబీ గుబాళింపు.. టీఆర్ఎస్ శ్రేణులను ఆనంద డోలికల్లో ముంచెత్తింది. కౌంటింగ్‌లో తొలిరౌండ్‌లో టీఆర్ఎస్‌కు ఆధిక్యం రాగానే.. తెలంగాణభవన్‌లో సంబురాలు మొదలుకాగా, ముఖ్యనేతలు కార్యాలయానికి పోటెత్తారు. బాణాసంచా కాల్చి, స్వీట్లుపంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు. హుజూర్‌నగర్ గడ్డపై గులాబీజెండా అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కేసీఆర్‌పై అచంచల విశ్వాసం ప్రదర్శించిన ప్రజలకు కృతజ్ఞతలు అంటూ ట్వీట్ చేశారు. రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ సైదిరెడ్డి సంచలన విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ వద్ద జరిగిన సంబరాల్లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, శంభీపూర్ రాజు, మేయర్ బొంతు రామ్మోహన్, టిఆర్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పల్లాకు సీఎం అభినందనలు

హుజూర్‌నగర్ విజయంలో పార్టీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వరరెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు ఏ బాధ్యత అప్పగించినా దానిని పూర్తిగా నెరవేర్చడంలో పల్లా మొదటి నుండీ సఫలమవుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన పల్లా రాజేశ్వరరెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలను, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు సూచ నలను క్షేత్రస్థాయిలో నూరుశాతం అమలుచేసి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారు. అంతకు ముందు శాసనసభ ఎన్నికల్లోనూ మహబూ బాబాద్, నర్సంపేట అసెంబ్లీస్థా నాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిం చిన పల్లా రాజేశ్వ రరెడ్డి పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్నడూ గులాబీ జెండా ఎగరని నర్సం పేటలో పార్టీ విజయంలో కీలకభూమిక పోషించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ చారిత్రక విజయాన్ని సాధించి పెట్టారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితులను సవాల్‌గా తీసుకుని విజయాన్ని అందించిన రికార్డు ఉంది.

### జాతీయ పార్టీలకు తిరస్కారం: కేటీఆర్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచారానికి రాకుం డానే టీఆర్ఎస్ అద్భుత విజయాన్ని సాధించిందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన సైదిరెడ్డికి కేటీఆర్ అభినందనలు తెలిపారు. హుజూర్‌నగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పబ్లిసిటీ జిమ్మిక్కులు, తప్పుడు ప్రచారాలు చేసినా కాంగ్రెస్‌కు సిట్టింగ్ సీటు, బీజేపీకి డిపాజిట్ దక్కకుండా హుజూర్ నగర్ ప్రజలు పోగొట్టారని కేటీఆర్ అన్నారు. జాతీయ పార్టీలను తిరస్కరించి చెంపదెబ్బ లాంటి తీర్పునిచ్చారన్నారు.






# ఉప ఎన్నికల ఛాంపియన్ టీఆర్ఎస్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గులాబీ ప్రభంజనం.. అధినేతే ఆశ్చర్యపోయేలా బంపర్ మెజారిటీ. ప్రచారానికి వెళ్ళకపోయినా నీరాజనాలు పలికిన ప్రజాభిమానానికి సీఎం కేసీఆర్ తన్మయత్వం చెందారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ ప్రజల ఆదరణకు పొంగిపోయారు. ఉప ఎన్నికల ఛాంపియన్‌గా టీఆర్ఎస్ తన ప్రతిష్టను మరింత పటిష్టం చేసుకుంది. 43వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యంతో చరిత్ర సృష్టించింది. టీఆర్ఎస్ అంటేనే ఉప ఎన్నికల స్పెషలి స్టు. తెలంగాణ ఉద్యమసమయంలో పదవులకు రాజీనామాలు చేసి ఒకేటర్మ్‌లో మూడు ఉప ఎన్నికలను ఎదుర్కొన్న చరిత్ర టీఆర్ఎస్‌కు ఉంది. 2001ఏప్రిల్ 27న జలదృశ్యంలో టీఆర్ఎస్ ఆవిర్భావానికి ముందు డిప్యూటీస్పీకర్ పదవికి, సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయడం, ఉప ఎన్నికల్లో విజయం సాధించడంతో టీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలైంది. అప్ప టినుండి ఉప ఎన్నికలను సృష్టించి, గెలిచి, తెలం గాణ ఉద్యమ ఉనికిని చాటింది.

### ఐదు ఉ న్ని కల్లోనూ జైత్రయాత్రే

- స్వరాష్ట్రంలోనూ టీఆర్ఎస్ ఉప ఎన్నికల్లో అప్రతిహత విజయాలు సాధించింది. మెదక్ లోక్‌సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామాతో తెలంగాణలో తొలి ఉప ఎన్నికరాగా, టీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించారు.
- తర్వాత జరిగిన వరంగల్ ఉప ఎన్నికలో ఎంపీగా పసునూరి దయాకర్ ఎన్నికకాగా, జాతీయ స్థాయి రికార్డు మెజారిటీ సాధించారు.
- తర్వాత సిట్టింగ్ ఎమ్మెల్యే మృతితో నారాయ ణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరిగింది. ఇక్కడ తొలిసారి టీఆర్ఎస్ విజయం సాధించింది.
- ఖమ్మం జిల్లా పాలేరులో రామిరెడ్డి వెంకటరెడ్డి మృతితో అనివార్యమైన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు భారీ మెజారిటీతో గెలిచారు. పాలేరు నియోజకవర్గంలో టీఆర్ఎస్‌కు అదే తొలివిజయం.
- ఇపుడు జరిగిన ఐదో ఉప ఎన్నికలోనూ టీఆర్ఎస్ సంచలన విజయం సాధించింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 25 అక్టోబర్ 2019

## ఆ రెండూ కమలానివే!

మహారాష్ట్ర, హర్యానాల అసెంబ్లీలకు జరిగినఎన్నికలు ఎగ్జిట్ పోల్స్ కు కొంచెం అటూ ఇటూగా వచ్చాయి. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన కూటమి అత్యధిక స్థానాలు సాధించి ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాల్లో తలమునకలై ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ విస్తృతంగా పర్యటించి కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణం రద్దు గురించి విస్తృతంగా ప్రచారం చేసినా దాని ప్రభావం పెద్దగా కనిపించలేదు. అలాగే, మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలను గురించి కాంగ్రెస్, ఎన్సీపీ, ఇతర ప్రతిపక్షాలు ప్రతి సభలోనూ ప్రధానంగా ప్రస్తావించినప్పటికీ అది కూడా పనిచేయలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో స్థానిక రాజకీయాలే ప్రధానపాత్ర వహించాయి. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన ఒక కూటమిగా పోటీ చేసినా, వాటి మధ్య అంతర్గతంగా ఉన్న కలహాలు, హెచ్చుతగ్గులు తమకు ఉపయోగపడ తాయేమోనని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ ఆశించారు. అది అడియాశ కాకపోయినా, ఆయన ఆశించిన స్థాయిలో కాంగ్రెస్, ఎన్సీపీ కూటమికి స్థానాలు రాలేదు. గతంలో కన్నా ఈ కూటమికి స్థానాలు మెరుగైనప్పటికీ బీజేపీ, శివసేన కూటమిదే పైచేయి అయింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రధానమంత్రి మోడీ శిష్యుడు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మోడీ దాదాపు ప్రతిసభలోనూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఫడ్నవీస్ ఐదేళ్ళ పాలనలో రైతుల ఆత్మహత్యలు 13 వేలకు పైగా చోటు చేసుకున్నాయి. రైతులకు రుణమాఫీ పథకాన్ని ఆయన అమలు జేసినప్పటికీ, ఆత్మార్పణ చేసుకున్న రైతుల కుటుంబాలల్లో చాలా మందికి సాయం అందలేదన్న ఫిర్యాదులు వచ్చాయి. అంతేకాక, పూర్వపు కాంగ్రెస్, ఎన్సీపీ ప్రభుత్వం మరాఠా లకు పది శాతం రిజర్వేషన్లు అమలుజేయలేదన్న అసంతృప్తి ఫడ్నవీస్‌పై ఉంది. అయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటుకు బీజేపీకే అవకాశాలు ఏర్పడటానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ విస్తృతంగా చేసిన ప్రచారమే కారణం. ఈ ఎన్నికల్లో కొత్త తరం బరిలోకి వచ్చింది. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే కుమారుడు ఆదిత్య థాకరేని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆ పార్టీ ప్రచారం చేసింది. ఆయన ముంబైలోని వోర్లీ నుంచి భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఆయనను ముఖ్యమంత్రిని చేసేందుకు శివసేన పావులు కదుపుతోంది. ఈసారి శివసేన పరిస్థితి కాస్తంత మెరుగు కావడంతో ముఖ్యమంత్రి పదవిని చెరి రెండున్నర సంవత్సరాలు పంచుకుందామంటూ ప్రతిపాదనలు చేస్తోంది. అయితే, మహారాష్ట్రలో అధికారాన్ని నిలబెట్టు కోవడం అనేది బీజేపీకి ప్రతిష్ఠాత్మకం, కనుక ఆ ప్రతిపాదనను కమలనాథులు అంగీకరిం చకపోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జోక్యంతో చివరిక్షణంలో బీజేపీ, శివసేనల మధ్య లుకలుకలు సర్దుబాటుకావచ్చు. కిందటిసారి శివసేనకు తక్కువ సీట్లు రావడంతో బీజేపీ లెక్క చేయలేదు. మొదట మొరాయించిన శివసేన తిరిగి అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ సంకీర్ణ ప్రభుత్వాల్లో చేరింది. మహారాష్ట్ర ఎన్నికల్లో బారామతి నుంచి పవార్ అన్న కుమారుడు అజిత్ పవార్ అతిభారీ మెజారిటీతో గెలుపొందడం. దశాబ్దాల పాటు ఈ నియోజకవర్గానికి శరద్ పవార్ ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్, ఎన్సీపీ సంకీర్ణ ప్రభుత్వంలో చోటు చేసుకున్న ఇరిగేషన్ కుంభకోణం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. ఈ కుంభకోణంలో అజిత్ పవార్‌దే ప్రధాన పాత్ర అన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కుంభకోణం గురించి ప్రధానమంత్రి మోడీ ఇటీవల ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించారు. శరద్ పవార్‌పై కూడా పరోక్షంగా ఆరోపణలు చేశారు. చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యాలు గతంలో ప్రభుత్వాలను ఎలా ప్రభావితం చేశాయో వివరించారు. తనపై వచ్చిన ఆరోపణలకూ, ఈడీ కేసులకూ శరద్ పవార్ మనస్తాపం చెందారు. ఆయన ఈ అంశాన్ని ప్రతిసభలోనూ ప్రస్తావించారు. ఆవిధంగా ఆయన పట్ల ఓటర్లు ప్రదర్శించిన సానుభూతి ఈసారి ఎన్సీపీకి కలిసొచ్చింది.

ఆర్ ఎస్ ఎస్ ప్రధాన కార్యాలయం మహారాష్ట్రలోనే ఉంది. ఆ సంస్థ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్ నుంచే ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. మహారాష్ట్ర రాజకీయాల్లో మొదటి నుంచి మరాఠాల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. శరద్ పవార్‌కు అదే పెట్టని కోటగా నిలిచింది. మహారాష్ట్ర, హర్యానాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడనున్నాయనీ, దీపావళికి ముందే తమ పార్టీ దీపావళి జరుపుకుంటోందని ప్రధానమంత్రి మోడీ గురువారం సాయంత్రం బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ప్రకటించారు. అంటే మహారాష్ట్రలో శివసేనను ఒప్పించగల మన్నధీమా, హర్యానాలో జేజేపీ ఇండిపెండెంట్ల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయన్నది ఆయన మాటల్లో ధ్వనిస్తోంది. హర్యానాలో జాట్ల ప్రాబల్యాన్ని తగ్గించడం కోసమే గత ఎన్నికల అనంతరం పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా వెనకబడిన తరగతులకు చెందిన మనోహర్ లాల్ కట్టార్‌ను ఎంపిక చేశారు. ఈసారి కూడా ఆయననే కొనసాగించేందుకు మోడీ నిశ్చయించుకున్నట్టు కనిపిస్తోంది. జేజేపీ వ్యవస్థాపకుడు దుష్యంత్ చౌతాలతో కమలనాథులు తెరవెనుక సంప్రదింపులు జరుపుతున్నట్టు వార్తలు వచ్చాయి. దుష్యంత్ ముత్తాత దేవీలాల్ కాంగ్రెస్ వ్యతిరేకి కనుక ఆయన కుటుంబం నుంచి వచ్చిన దుష్యంత్ కాంగ్రెస్ వలలో పడకుండా కమలనాథులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హర్యానాలో ఏ పార్టీకీ మెజారిటీ రానప్పటికీ (హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పటికీ) గతంలో గోవాలో, మణిపూర్‌లో బలాబలాలను తారుమారు చేసే చాతుర్యం కమలనాథులకు ఉంది. పార్టీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోక్యంతో హర్యానాలో కూడా తారుమారు కావచ్చు. బీజేపీకి ఈసారి 40 సీట్లు వచ్చాయి. కనుక ప్రభుత్వం ఏర్పాటులో తొలి ప్రాధాన్యాన్ని కట్టార్‌కే గవర్నర్ ఇవ్వొచ్చు. ఇతరులు 9 మందిలో ఇండిపెండెంట్లు సహజంగా అధికార పార్టీలోకే దూకుతారు. ఇవన్నీ లెక్కలు వేసుకునే రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోతున్నామని మోడీ ప్రకటించారు. అయితే, జేజేపీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా ఓ పట్టాన కమలనాథుల ప్రతిపాదనలకు అంగీకరిస్తారా అనేది సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. 2016లో జాట్‌లకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల కోసం సాగిన ఆందోళన హింసాత్మకంగా పరిణమించి 39 మంది మరణించారు. వారి గాయాలను మాన్పేందుకు కట్టార్ తగిన చర్యలు తీసుకోలేదన్న అసంతృప్తి జాట్ సామాజికవర్గంలో ఉంది. దుష్యంత్‌కు పది సీట్లు తెచ్చి పెట్టింది జాట్ రిజర్వేషన్ల అంశమే. కనుక ఈ విషయమై ఆయన బీజేపీ రాష్ట్ర నాయకుల నుంచి కన్నా ప్రధానమంత్రి నుంచే గట్టి హామీ కోరే అవకాశం ఉంది. మొత్తం మీద ఆయన కింగ్ మేకర్ కానున్నారు. ఆయన మద్దతుకోసం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ హోడా కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. హర్యానాలో తిరిగి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ పరంగా సోనియాగాంధీ సర్వాధికారాలు ఇచ్చారు. భూపీందర్ కూడా జాట్‌లలో పేరున్న నాయకుడే. అయితే, యూపీఏ పదేళ్ళ పాలన సాగినప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించిన భూపీందర్ జాట్ల రిజర్వేషన్ల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోలేదన్న అసంతృప్తి ఆ సామాజికవర్గంలో ఉంది. అంతేకాక, సోనియా అల్లుడు రాబర్ట్ వాద్రాకు భూములు ఇప్పించడంలో అక్రమాలకు పాల్పడినట్టు నమోదు అయిన కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. దుష్యంత్ తాత, ఐఎన్ఎల్‌డి అధ్యక్షుడు ఓం ప్రకాష్ చౌతాలా ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ కేసులో జైలు జీవితం గడుపుతున్నారు. కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డి నాయకుల కేసులను ఆసరాగా తీసుకుని బీజేపీ పైచేయి సాధించవచ్చు.

# బ్యాంకుల ధోరణి మారాలి



కుదిరినకాడికి రాబట్టడం.. పిండడం.. ఇదీ ప్రస్తుతం భారత ఫైనాన్స్ రంగంలో వ్యవస్థలో ఆందోళన కలిగిస్తున్న అంశం. భారత ఆర్థిక వ్యవస్థ గాడి తప్పడానికి కారణమైన 200 బిలియన్ డాలర్ల మొండి బకాయిల వెను క అవకాశవాద ధోరణి ఉంది. అయితే ఇది మొండి బకాయిలకు మాత్రమే పరిమితం కాలేదు. ఈ సంక్షోభానికి ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కోర్టులు ఇస్తున్న ఆంక్షలు కూడా కారణమవుతున్నాయి. ఫలితంగా రుణదాతలు రికవరీ లపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా డిపాజిటర్లను తీవ్ర ఆందోళనలకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు బ్యాంకులు సెక్యూ రిటైజేషన్ విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా చిన్న చిన్న మొత్తాల్లో రుణాలు జారీ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ విధానం భారత ఆర్థిక వ్యవస్థకు అంత ఆచరణీయమైనది కాదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ వారంలోనే ముంబై లో జరిగిన బ్లూంబర్గ్ ఈక్వాలిటీ సమ్మిట్‌లో పాల్గొన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ రజ్నీష్ కుమార్ ఒక ప్రతినిధితో మాట్లాడారు. ప్రాపర్టీ బిల్డర్లకు రుణాలిచ్చే బ్యాంకింగేతర ఆల్టికో క్యాపిటల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డిఫాల్ట్‌కు గురవ్వడానికి ఒక బ్యాంక్ స్వార్థమే కారణమని ఆయన నిందించారు. అయితే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఆల్టికో పట్ల ఎందుకు సానుకూలత ప్రదర్శించలేదని హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్యపురిని ప్రశ్నించగా ఆయన సమాధానం విరుద్ధంగా ఉంది. సమయం మించిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది నా సెక్యూరిటీకి సంబంధించిన విషయం. ఉపయోగించుకుంటాను అని ఆయన వివరించారు. అయితే ఎస్‌బీఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్‌ది ఆగ్రహమా లేదా ఆదిత్య పురి నియంత్రణ పరిధి దాటారా అనే విషయాలను తేల్చాల్సింది మాత్రం రెగ్యులేటర్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే.

**రిల్ పేరును ప్రస్తావించలేదు:** ఎస్‌బీఐ నుంచి రుణాలు తీసుకుని చెల్లించని సంస్థలో ఆల్టిక్ ఒకటి మాత్రమే. ఈ సంస్థ పేరును మాత్రం ప్రస్తావించిన రజ్నీష్ కుమార్.. కోర్టులో దివాలా ప్రక్రియ కొనసాగుతున్న కుబేరుడు అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్ లిమిటెడ్ పేరును పేర్కొనలేదు. ఈ విషయంలో అవకాశవాద ధోరణి కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. కోర్టు పరిధిలో లేని ఆస్తులను ముకేష్ అంబానీకి అనిల్ అంబానీ అమ్ముతారని ఎస్‌బీఐ భావిస్తుండడమే దీనికి కారణం.

**కోర్టుల బ్రేక్‌లు.. నిరీక్షణలు..:** భూషన్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్‌కు రుణాలు ఇచ్చిన ఎస్‌బీఐ షాక్‌కి గురైంది. కంపెనీ అపరిష్కృత ఆస్తులను ఈడీ అటాచ్ చేయడంతో ఎస్‌బీఐ ఛైర్మన్ రజ్నీష్ ఆశ్చర్యపోయారు. భూషన్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ గత మేనేజ్‌మెంట్ మనీలాండరింగ్ అవకతవలకు పాల్పడిందని ఈడీ పేర్కొంది. ఈ మేరకు రజ్నీష్ కుమార్‌కు తెలియజేయడంతో ఆయన షాకయ్యారు. అయితే దివాళా ప్రక్రియపై భూషన్ పవర్స్‌పై నియంత్రణ కలిగిన కొత్త యజమాని, రజ్నీష్ కుమార్ అసహనంగా ఉన్నారు. అయితే 2.8 బిలియన్ డాలర్లకు సంబంధించిన ఆస్తుల అమ్మకాన్ని కోర్ట్ నిలుపుదల చేయడమే దీనికి కారణం. మరోవైపు ఎస్సార్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు సంబంధించిన 6 బిలియన్ డాలర్ల విలువ చేసే ఆస్తుల కొనుగోలు ప్రక్రియ ముగింపు కోసం ఆర్సెలార్‌మిట్టల్ సుదీర్ఘకాలంగా వేచిచూస్తున్నారు. ఎస్సార్ స్టీల్ ఇండియా లిమిటెడ్ దివాళాను భారత్‌లో ప్రధానాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఎస్‌బీఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్, ఇతర రుణదాతలు చట్టబద్ధంగా ఆస్తులను లాక్కోవాలని చూస్తున్నారనే ఆరోపణలను ఎదుర్కొంటు న్నారు. అయితే కంపెనీలు, అమ్మకందార్ల కంటే ఎస్‌బీఐ లాంటి రుణదాతలకు ఎక్కువ హక్కులు ఉండబోవంటూ అప్పిలేట్ అథారిటీ వెల్లడించింది.

**కోర్ట్ ఆజ్ఞలతో దివాన్ హౌజింగ్‌కు కష్టాలు:** ఇంటి యజమానుల నుంచి నగదు తీసుకుని కంపెనీ పునరుజ్జీవానికి వినియోగించవద్దంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కోర్ట్ ఆదేశాలు అవరోధాలుగా మారాయి. దీంతో కంపెనీకి చెందిన ఆరు బాండ్ల రేటింగ్‌ను మూడీస్ తగ్గించింది. అందులో మూడింటిని డీఫాల్ట్‌గా పేర్కొంది. ఫలితంగా కోలుకునేందుకు కంపెనీ చేయదగిన ప్రయత్నాలకు బ్రేక్ పడింది. కంపెనీ దివాళా ప్రమాదమున్నా పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నసమయంలో జరిగిన పరిణామం ఇది. సెక్యూరిటైజేషన్ విధానం భారత ఆర్థిక వ్యవస్థకు అంత క్షేమమైనది కాదు. ఈ విధానాన్ని మన ఆర్థిక వ్యవస్థ దాదాపుగా తిరస్కరించినట్టుగానే కనిపిస్తోంది.

విధానాలు మారాయి: దేశంలో ఫైనాన్స్ సూత్రాలు తల్లకిందులుగా మారాయి. సెక్యూరిటీకి బ్యాంకులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. 2008లో ఆర్థిక మాంద్యం నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోంది. సెక్యూరిటీస్ కోసం చిన్న చిన్న మొత్తాలను రుణాలుగా జనానికి ఇస్తున్న వైనం కనబడుతోంది. డిపాజిట్ల ద్వారా వచ్చిన ఈ మొత్తాలను రుణాలుగా ఇస్తూ స్థిరత్వాన్ని పొందేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తున్నాయి. 2008 నుంచే ఈ పరిస్థితి ఏర్పడినప్పటికీ వాస్తవానికి నగదు కొరత కారణంగానే ఎన్‌బీఎఫ్‌సీల మనుగడ క్లిష్టంగా తయారైంది.

**చిన్న పొదుపుదార్లకు అర్థం కాదు:** పెద్ద పెద్ద ఫైనాన్స్ సంస్థల గందరగోళాలను చిన్న చిన్న పొదుపుదార్లు అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. అయితే బ్యాంకుల్లో ఇబ్బందులు, నగదు ఉపసంహరణపై ఆంక్షలు విధించినప్పుడు కష్టాలను ఎదుర్కొనేది ప్రధానంగా చిన్న పొదుపుదారులే. పంజాబ్-మహారాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ లో 1 బిలియన్ డాలర్ల మోసం జరిగినప్పుడు జరిగింది ఇదే. ఆర్బీఐ విధానాలు అంత యోగ్యంగా లేవని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఎస్‌బీఐ లేదా హెచ్‌డీఎఫ్‌సీ వంటి బ్యాంకుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా చిన్న సంస్థల్లోని పెట్టుబడులను పెద్ద పెద్ద కంపెనీల్లో పెట్టుబడులుగా మళ్లిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ఒక్కసారి ఆలోచించాలని సూచిస్తున్నారు. చిన్నచిన్న డిపాజిట్లతో ఉద్దీపన పొందేందుకు కంపెనీలు ప్రయత్నిస్తే భారతీయ పన్ను చెల్లింపుదార్లకు ఇబ్బందికరమైన పరిస్థితులు తప్పకపోవచ్చనే హెచ్చరిస్తున్నారు. మూలధన ఆధారి తమైన భారత్ లాంటి ఆర్థిక వ్యవస్థల్లో ఫైనాన్స్ ప్రధానంగా పరిగణించడం కష్టం. కేవలం నిబంధనల ద్వారా మాత్రమే శక్తివంతమైన మధ్యవర్తులు, ప్రభుత్వా ధికారులు భారీగా నగదు పొందడాన్ని అరికట్టవచ్చునని సూచిస్తున్నారు.

**- పి. సుదర్శన్‌రావు**

# సమర యోధుల కార్ఖానా కె.సి. గుప్తా

(నేడు వర్ధంతి)



భారత స్వరాజ్య సాధన, హైదరాబాద్ విమోచనలకై తను పోరాటమే గాకుండా సాధారణ పౌరులకు ప్రేరణగా నిలిచిన సమర యోధుడు కె.సి.గుప్తా. స్వాతంత్ర్య కాంక్షనూ, విమోచన లక్ష్యాన్ని నింపుతూ సమరా నికి సిద్ధం చేసే స్ఫూర్తిదాయక రచనలను ముద్రించి పుటల సంఖ్యతో నిమిత్తం లేకుండా పుస్తకాన్ని కేవలం ''అణా''కు విక్రయించిన దార్శ నికుడు. స్వాతంత్ర్య సమర యోధునిగా, హైదరాబాద్ విమోచనా సైనికునిగా అనేక పర్యా యాలు జైలు జీవితం గడిపి కెసి గుప్తాగా పేరొం దిన కల్వకుంట్ల చంద్రసేన గుప్తా పౌరులయందు ఉద్యమ ఆశయాన్ని ప్రోది చేస్తూ వైతాళికుల జీవితగాథల రచనలను నక్షాలకోర్చి సమాజానికి అందుబాటులోకి తెచ్చిన మార్గదర్శి. ఈ రచనలు అనేకమందిని స్వేచ్ఛా సమరం దిశగా మళ్ళించాయనడంలో రెండో వ్యాఖ్య అవసరమే లేదు. ఆయన ముద్రించిన అనేక గ్రంథాలు నాటి ప్రభుత్వ నిషేధానికి గురికావడమే ఇందుకు తార్కాణం. ఈ పుస్తకాల విక్రయ వేదిక ''అణా గ్రంథమాల'' సంస్థగా విఖ్యాతినొందింది.

సంపన్న కుటుంబంలో జన్మించిన కె.సి.గుప్తా విలాస జీవితానికి దూరంగా జరుగుతూ సామాజిక బాధ్యతను గుర్తెరిగి వెతల వెంట నడిచారు. నాటి ప్రభుత్వాల ప్రజా అణిచివేతపట్ల ఆయన కన్నెర్ర జేశారు. పిడికిలి బిగించారు. నడిచేది ముళ్ళబాటని తెలిసినా ఎన్నడూ వెనుకంజ వేయనేలేదు. ఈ నేపథ్యమే ఆయనను పలు దఫాలు జైలు జీవితానికి దగ్గర జేసింది. స్వరాజ్య సంగ్రామంలో పాల్గొని 1942 లోనూ, హైదరాబాద్ విమోచన పోరాటంలో 1946లోనూ ఆయన కారాగారానికి వెళ్ళారు. 1942 జైలు జీవితం అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం తిరిగి ఆయనను మూడేళ్ళపాటు డిటెన్యూగా ప్రకటించి నిర్బంధించింది. హైదరా బాద్, వరంగల్, గుల్బర్గా, సంగారెడ్డి జైళ్ళలో ఆయన ఖైదు జీవితం అనుభవించారు. డిటె న్యూగా విడుదలైన పిదప నిషేధిత సుభాష్ చంద్ర బోస్ పోరాట గాథను రచించి, ముద్రిం చినం దున మరోమారు జైలుకు తరలిన అసహాయు డు కె.సి.గుప్త. నిజామాబాద్ జిల్లా కామారెడ్డి తాలూకా రాజాంపేట గ్రామంలో కల్వకుంట్ల లక్ష్మమ్మ, రామన్న గుప్త దంపతులకు 1919 సెప్టెంబర్ 1వ తేదీన జన్మించిన కె.సి.గుప్తా ప్రాథమిక విద్యను కామారెడ్డి, మాధ్యమిక విద్యనుండి మెట్రిక్యు లేషన్ వరకు హైదరాబాద్‌లో పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి బి.ఎ. పట్టాను పుచ్చుకున్నారు. న్యాయశాస్త్రంపై గల మక్కువతో లా కళాశాలలో ప్రవేశించిన గుప్తా, గాంధీజీ ఆశయాలపట్ల ఆకర్షితుడై చదువుకు మధ్యలోనే స్వస్తి పలికి స్వాతంత్ర్య సమర నినాదాన్ని అందుకున్నారు. 1938 విద్యార్థి దశలోనే ఆయన జాతీయ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతూ ఆ సంస్థలో చేరారు. అనంతరం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు చేరువై 10 ఏళ్ళపాటు ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ క్రమంలోనే ఆయన రచనా వ్యాసాంగానికి శ్రీకారం చుట్టారు. ఉద్రేకాన్ని ఉరకలెత్తించే విధంగా రచన చేసే శైలి ఆయన పుణికి పుచ్చుకున్నారు. తన రచనలనే కాకుండా, ఇతరుల రచనలనూ ప్రజా బాహుళ్యం లోకి విస్తృతంగా తీసుకెళ్ళి పోరాట విస్ఫోటనానికి హేతువుగా మారారు. ప్రభుత్వాలకు కంటగింపయ్యారు. ఆయన ముద్రించిన నేతాజీ, అల్లూరి సీతారామరాజు, ఆంధ్రుల చరిత్ర వంటి వీర గాథలు నాటి సమాజంలో ప్రకంపనలు సృష్టించి ప్రజలను ఉద్యమబాట నడిపించాయి. స్వరాజ్య స్థాపన, హైదరాబాద్ విమోచనల అనంతరం ఆయన ప్రజాసేవకు అంకితమ య్యారు. తుది శ్వాస విడిచే వరకూ సేవలను కొన సాగించారు. అనేక స్వచ్ఛంధ సేవా సంస్థల ను స్థాపించి పలు విధాలుగా సామాజిక సేవలను అందించారు. సేవలకు గుర్తింపుగా ఆయన దావ ఇగిరిలో 'సంఘశ్రీ' బిరుదును అందుకు న్నారు. కె.సి. గుప్తాను గౌరవిస్తూ నీలాజంగయ్య 'మధు వనం', బిజినేపల్లి లక్ష్మీకాంతం 'చంద్రు నికో నూలుపోగు' రచనలను అంకితమిచ్చారు. మహాత్ముని జాడలలో అడుగులు వేసిన గుప్తా నీతి నిజాయితీలకు నిలువురూపం. అధికారపీఠాలకు ఆమడదూరంగా నిలిచిన నిస్వార్థ నాయకుడు. ఆయన జీవితం సమ కాలీన, సార్వ కాలలకు బ్రహ్మీపథం, 2001 అక్టోబర్ 25న మనని విడిచి వెళ్ళిన కె.సి. గుప్తా భౌతికంగా తనువు చాలించినా కీర్తిదాయకమైన ఆయన ప్రస్థానం ప్రజల మనోఫలకాలపై జాజ్వల్యమై ప్రకాశి స్తూనే ఉంటుంది.

**-వై.హెచ్.కె. మోహన్‌రావు**
**9440154114**

# కెనడాలో కింగ్‌మేకర్

జగ్‌మీత్ సింగ్



కెనాడా ప్రధాని జస్టిన్ ట్రూడోకి ఈసారి ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాలేదు. ఆయన నేతృత్వంలోని లిబరల్ పార్టీ 333 సీట్లు గల హౌస్ ఆఫ్ కామన్స్‌లో సాధారణ మెజారిటీ కన్నా 20 సీట్లు తక్కువ వచ్చాయి. 170 సీట్లు రావల్సి ఉండగా, 157 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఆయన బయటి నుంచి మిత్ర పక్షాల మద్దతు తీసుకోవల్సిన అవసరం ఏర్పడింది. భారత సంతతికి చెందిన సిక్కు న్యాయవాది, హక్కుల ఉద్యమకారుడు జగ్‌మీత్ సింగ్ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డిపి) మద్దతు ఆయన తీసుకోనున్నారు. లిబరల్స్‌కు ఎన్‌డిపి గతంలో మిత్రపక్షమే. ఈ ఎన్నికల్లో ఎన్‌డిపికి 24 సీట్లు వచ్చాయి. గతంలో కన్నా ఈ పార్టీ బలం తగ్గింది. రద్దయిన పార్లమెం టులో ఆ పార్టీకి 40 మంది సభ్యులు ఉన్నారు. ఈసారి 24 సీట్లు సాధించినప్పటికీ ప్రభుత్వానికి మెజారిటీని అందించేందుకు ట్రూడోకు బయటి నుంచి మద్దతు ఇచ్చేందుకు అంగీకరించింది.

కెనడాలో ఖలిస్తాన్ తీవ్రవాదులు ఎక్కువ మంది ఉండటం వల్ల వారి ప్రభావంతో జగ్‌మీత్ సింగ్ తీవ్రవాదుల సానుభూతి పరునిగా మారాడు. హక్కుల ఉద్యమకారునిగా ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించారు. గతంలో పంజాబ్‌లో ఉధృత స్థాయిలో ఆందోళనలు జరిగినప్పుడు ఖలిస్తాన్ ఉద్యమకారులు కెనడాకు చేరుకుని అక్కడ రక్షణ పొందారు. సిక్కులకు ఖలిస్తాన్ పేరిట ప్రత్యేక దేశం కోసం ఖలిస్తాన్ ఉద్యమాన్ని అప్పట్లో ఉధృత స్థాయిలో నడిపారు. జగ్‌మీత్ సింగ్ పూర్వీకులు పంజాబ్‌లోని బర్నాలా జిల్లాలో టికిర్‌వాల్ గ్రామానికి చెందిన వారు. కెనడా ఎన్నికల్లో జగ్‌మీత్‌సింగ్ నేతృత్వంలోని ఎన్‌డిపి స్థానాలు తగ్గినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా మారడంతో పంజాబ్‌లో ఆయన బంధుమిత్రులు సంబరాలు జరుపుకుంటున్నారు. జగ్‌మీత్ సింగ్ ప్రధాని కావాలన్నది తమ ఆకాంక్ష అని వారు పేర్కొంటున్నారు. కెనడాలోని బ్రాంప్టన్ ప్రాంతంలో సిక్కుల జనాభా అధికం. అధికారంలో ఉన్న లిబరల్ పార్టీలో కూడా పంజా బీలు ఐదారుగురు చట్టసభ సభ్యులు ఉన్నారు. కెనడాలో ఉన్నత విద్య నభ్యసించే వారికి తగిన సదుపాయాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల విషయంలో తమ పార్టీ కృషి చేస్తుందని జగ్‌మీత్ సింగ్ చెప్పారు. సిక్కులు కష్టపడి పని చేస్తారనీ, వారు ఎక్కడున్నా తమ ప్రతిభనూ, సామర్థ్యాన్నీ నిరూపించుకుంటారని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కెనడాలో వ్యాపారాలు చేస్తున్న సిక్కులు దేశ ఆర్థికాభివృద్ధికి తమవంతు సాయాన్ని అందిస్తున్నారని చెప్పారు.

మరోవంక ట్రూడో మాట్లాడుతూ జగ్‌మీత్ సింగ్ సమర్థుడైన లాయర్‌గా, ఎంపీగా ఇప్పటికే తన ప్రతిభను నిరూపించుకున్నారనీ సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి ప్రజాస్వామ్య భావస్ఫూర్తిని నిలబెడతారని ఆశిస్తున్నానని అన్నారు. ట్రూడో పట్ల దేశంలోని పలు ప్రాంతాల్లో అసమ్మతి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకుని ప్రచారం చేశారు. 2.74 కోట్ల జనాభా గల కెనడాలో ఈసారి 65 శాతం పోలింగ్ జరిగింది. 97 మంది మహిళలు గెలిచారు. బ్లాక్ క్యూబెకాయిస్ పార్టీకి 32 సీట్లు, గ్రీన్ పీస్ పార్టీకి 3 సీట్లు వచ్చాయి. కెనడా ప్రజలు ప్రగతిశీల అజెండాకు ఓటు వేశారని ట్రూడో అన్నారు. జగ్‌మీత్ సింగ్ ఖలిస్తాన్ సానుభూతి పరుడైనప్పటికీ, ప్రభుత్వానికి మద్దతును అందించడంలో అరమరికలు లేకుండా వ్యవహరించగలరన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. జగ్‌మిత్ సింగ్ కూడా కెనడాలో చాలాకాలంగా తాను పౌర, మానవ హక్కుల కోసం పోరాడుతున్నాననీ, ఇకపైన కూడా అన్నివర్గాల పౌరుల హక్కుల రక్షణ కోసం పాటుపడగలననీ, సిక్కుల కోసం నిరంతరం శ్రమిస్తానని వాగ్దానం చేశారు.

**- స్వామి**

## పర్యావరణహిత దీపావళి

ఒకప్పుడు దీపావళి పండగని మట్టి ప్రమిదలతో ఒత్తులని వెలిగించి జరుపుకునేవారు. ఈ పండుగ అంటే చిన్న పిల్లలకి కూడా చాలా సరదా. అయితే ప్రతి సంవత్సరం మార్కెట్లోకి కొత్త కొత్త టపాసులు వస్తున్నాయి బాణా సంచా తయారీలో సల్ఫర్, బ్లాక్ కోల్ పౌడర్, సాల్ట్ పీటర్ వంటి రసాయనిక పదార్థాలని వినియోగిస్తున్నారు. వాటిని మోతాదుకు మించి వాడటం వల్ల వాటితో తయారు చేసే బాణా సంచాని పేలిస్తే మనకు కలిగే ఆనందం కంటే నష్టం ఎక్కువగా ఉంటుంది. మనం చేసే పొరపాట్ల వల్ల ఇప్పటికే కాలుష్యం పెరిగింది సుప్రీం కోర్టు కూడా పండుగని పర్యావరణహితంగా జరుపుకోమని సూచించింది. ఇప్పుడు మార్కెట్లోకి గ్రీన్ టపాసులొచ్చాయి, కాకార పువ్వొత్తులు, మతాబులు, భూ చక్రాలు, అగ్గిపెట్టెల వల్ల పర్యావరణానికి హాని జరుగదు ధ్వని కాలుష్యం ఏర్పడదు. గ్రీన్ టపాసులు (ఈ టపాసులు) విద్యుత్ ఆధారంగా వెలుగుతాయి. వాటిని వినియోగించడం వల్ల ధ్వని కాలుష్యం పెద్దగా ఏర్పడదు పెద్ద శబ్దాల వల్ల పిల్లలు, వృద్ధులు హడలిపోతారు. కాబట్టి దీపావళిని పర్యావరణహితంగా జరుపుకుందాం, పర్యావరణాన్ని రక్షిద్దాం!

**-ఎం. రాంప్రదీప్**
**తిరువూరు, 9492712836**

# ధిక్కార పతాక కలేకూరి ప్రసాద్



నేడు జయంతి

నేను అమరుణ్ణి ఎగిరే ధిక్కార పతాకాన్ని అంటూ 'కలేకూరి ప్రసాద్'.. కులమతోన్మాద రాజ్యాన్ని ధిక్కరించిన /ధిక్కార స్వరం. కూలిబతుకల్లో పొద్దుపొడిసేలా పల్లెపల్లెనా దళితకోయిలా పాడేలా జాతర జాతరగా దళిత సమూహాలు/ గడ్డ గుండె ల మీద ఊరేగింపై నడిచిపోతు న్నట్లుగా/ రాయాలి ఏదిరాసినా మన ప్రమాణంలోనే రాయాలి./ మూడు వేల సంవత్సరాల అణి చివేతను,/ అవమానా లను, హింసను భరి స్తూ ఉన్న జాతి../ మొత్తం ప్రపంచానికి మనుషులుగా బతికే పాఠాలు నేర్పాలి అని చెప్పిన 'మహాకవి' కలేకూరి ప్రసాద్'/ జీవితం మొత్తం బహుజనుల బతుకుల వెలుగుల రాజ్యాధికారం కోసం బతికాడు. నిరంతరం బహుజనుల కోసమే రాసాడు, కవితైనా, పాటైనా, వ్యాసమైనా, అను వాదమైనా, విమర్శయినా తన శైలిలో పాఠకుల బుర్రల్లో ఆలోచనల సెగలుపుట్టిస్తు, కన్నీటి చుక్కల్లో నుండి చురకత్తుల వీరులు కావాలనీ దళిత తల్లుల గుండెకోతల మంటలుమండే ఆవేదనలే రాసాడు /పోరులో, హోరులో, బరిలో చెలరేగిపోయాడు/ పిడికెడు ఆత్మగౌరవం కోసం అం టూ దళిత మ్యానిఫెస్టో కవిత రాసీ దేశదళితుల గాయాల చరిత్రను, ధిక్కార తిరుగుబాటు కవిత్వంలో రికార్డ్ చేసాడు 'నేను ఎప్పుడు పుట్టానో తెలియదు గానీ/ వేల ఏళ్ళక్రితం ఈ గడ్డమీదనే చంపబడ్డాను/... / ఇరవై రెండేళ్ళ క్రితం నాపేరు కంచికచర్ల కోటేశు/నా జన్మస్థలం కీలవేణ్ణణి, కారంచేడు, నీరుకొండ/ ఇప్పుడు కరుడుకట్టిన భూస్వామ్య క్రౌర్యం... నేను బాధితుణ్ణి కాదు అమరుణ్ణి/ ఎగిరే ధిక్కార పతాకాన్ని /నాకోసం కన్నీరు కార్చకండి/ మీకు చేతనైతే /నన్ను నగరం నడిబొడ్డున ఖననం చేయండి/ జీవన రవళిని వినిపించే వెదురువనాన్నై వికసిస్తాను/...

ఒకపెనుమంటల పెనుగులాటనై/మళ్ళీ మళ్ళీ ఈ దేశంలోనే ప్రభవిస్తాను అంటూ దళితుల చరిత్ర మొత్తం ఈ కవితలో పొందుపర్చారు కలేకూరి,... కంచికచర్ల కోటేశు ఘటన, కీలవేణ్ణణి, కారంచేడు, నీరుకొండ, చుండూరు దళితులపై దాడులను మొత్తం ఈ కవితలో రాసారు ఈ కవిత చదివితే ఈ దేశ దళితుల చరిత్ర తెలిసేలా కలేకూరి అక్షరాల తూటాలను పేల్చాడు, ఇక కలేకూరి పేరు కన్నా పాట చెబితేనే ఈ పాట యితను రాసింది అనేవాళ్లు ఇప్పటికీ చాలామంది ఉన్నారు కానీ ఇలాంటి పాటలు రాసేవాళ్లు సినిమా రంగంలో లేరు, ఈపాట దేశం మొత్తం మార్మోగింది, ఈపాట తెలియనివారు వుండారు ఈపాట నేను ఎక్కువగా పాడాను అని స్వయంగా ప్రజా యుద్ధ నౌక, గాయకుడు గద్దరే ఒక దాంట్లో చెప్పారు అదే పాట ఈ పాట 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా /విరిసీ విరియని ఓ చిరునవ్వా/ కన్నుల ఆశల నీరై కారగ/కట్నపు జ్వాలలో సమిధై పోయావా.../ పాట తెలియని వారు ఉండారు కలేకూరి మాత్రమే ఇట్లాంటి పాటలు రాస్తారు అని ఇట్లాంటి మొత్తం 50 వరకు రాసాడు అనీ దళిత కవి, రచయిత నాగప్పగారి సుందరాజు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు తనకు ఇష్టమైన కవులలో, రచయితలలో 'కలేకూరి ప్రసాద్' అంటే ఇష్టమని పేర్కొన్నారు, చాలామంది కవులపై, రచయితలపై, కలేకూరి ప్రసాద్' (యువక) ప్రభావం వుందని కొన్ని ఇంటర్వ్యూలో మనం చూసాం, మరల 'భూమికి పచ్చని రంగేసినట్టో /పంట చేలు పెరగాలి ఓ యమ్మలాలో /ఆలి పుస్తెలమ్ముకొని అప్పు దీర్చుకొంటివో../వలవలవల ఏడ్చుకొంటు వలసెల్లి పోతివో/ పురుగుల మందే నీకు పెరుగన్నంమాయరో/.../చెమట జల్లు చిలకరిస్తే నేల పులకరించరో /... ఎగువ పెన్నమ్మతల్లి ఎగిరెగిరి దుంకితే /తుంగభద్రమ్మ పొంగి పరవళ్లు తొక్కితే /... నేలతల్లి నీళ్ళాడి పసిడి పంటలిచ్చునో/నా సీమ కన్నుల్లో వెలుగులు నిండెనురో అంటూ ఈ పాట కూడా ఒక పూవు పూపింది కలేకూరి కలంలో సీమ ఔన్నత్యంతో ఈపాట తొణికిసలాడుతు భూమికి పచ్చని పంటలే మనకు కావాలి అని శ్రమవీరుల రైతుల కండ్లలో వెలుగునిండాలని కూలిబతుకులో పొద్దుపొడవాలని ఈ పాటలో కలేకూరి ప్రసాద్ చెబుతారు. ముసుగుతొడుక్కుని 'కలేకూరి ప్రసాద్' పేరు చెప్పనివాళ్లు వున్నారు, ఉన్నది ఉన్నట్లు మాట్లాడే మనిషి 'అందుకే అతని సూటితనం చాలామందికి ఇష్టం, కలేకూరి ప్రసాద్ '5వ సంత్సరం అప్పుడు' కంచికచర్ల కోటేశు ఘటన (ఆరుకుట్ల కోటేశు) 1969, ఫిబ్రవరిలో 18న జరిగితే, కోటేశు ఘటన కలేకూరిని ఆలోచించేలా, రాయించేలా, తిరగబడేలా, ఉద్యమకారుడిగా చేసింది ఆ కోటేశు ఘటనకు కలేకూరి ప్రసాద్ ఒక అద్భుతమైన దళిత ప్రేమ కవిత రాసి సంచలనం సృష్టించాడు ఆ కవితే 'అంటరాని ప్రేమ' 'గాయాలు సలుపుతున్నా/ గుండెలమీద నీ పాదముద్రల్నే కదా మోశాను /చావు ముంచుకొస్తున్నా /నీతో బతుకునే కదా కోరుకున్నాను/.../ చచ్చిన శవాలను తగలబెట్టడం తెలుసు నాకు/ కానీ బతుకుండగానే /మీ వాళ్లు నాకు నిప్పు పెట్టారు/.../ ప్రియా! /ఈ మంటలు నన్ను అలుముకుంటుంటే/ నువ్వు నన్ను వాటేసుకున్నట్టే వుంది ....అంటూ కంచికచర్ల కోటేశు ఘటనకు అంకితం ఇస్తూ ఒక దళితప్రేమ హృదయంలో నుండే పరిచ్చే కవిత రాసారు కలేకూరి, కలేకూరి ప్రసాద్ ''దళిత సాహిత్యం విమర్శ గ్రంథం'' మొట్టమొదటిసారిగా కలేకూరి ప్రసాద్ మాత్రమే రాసాడు అని చాలామంది చెబుతుంటారు. ఇక అనువాదాలు 70 చేసాడు, కలేకూరి 'ఆంధ్రప్రదేశ్ దళితుల చరిత్ర' అంటూ ఒక పుస్తకం రాసారు. దళితులపై దాడులను రికార్డు చేస్తూ ప్రభుత్వాలు దళితులపై దాడులు జరిగితే ఎలా స్పందిస్తాయీ అని ఆ సెక్షన్లు పెట్టేటప్పుడు ఎలా పెడ్తారని సూక్ష్మంగా పరిశీలించి రాసారు కలేకూరి. ఎంతో పోరాట ఫలితంగా ఎస్‌సి/ ఎస్‌టి అట్రాసిటీ చట్టం తెచ్చుకుంటే దానిని కూడా కేసులప్పుడు ఎలా ఈ అగ్రకులవాదులు మార్చడానికి ప్రయ త్నం చేస్తారో వివరించారు.

**-తంగిరాల సోని**
**9676609234**

epaper.prabhanews.com



# డిపోల ఎదుట మహిళా కండక్టర్ల దీక్షలు

• ఖమ్మంలో దీక్షా శిబిరంపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు • ఇందిరా పార్కు వద్ద మహిళా కండక్టర్ల ధర్నా • నేటి రాస్తారోకోను వాయిదా వేసిన జేఏసీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మిక జేఏసీ పిలుపు మేరకు కార్మికులు చేస్తున్న సమ్మె 20వ రోజుకు చేరుకుంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా డిపోల ముందు ఆర్టీసీ మహిళా కార్మికులు దీక్షలకు దిగారు. కార్మికులు వినూత్న నిరసనలు తెలిపారు. కొన్ని చోట్ల గాడిదకు వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలిపారు. ఖమ్మం బస్‌డిపో ఎదుట నిరసన దీక్షలు చేస్తున్న మహిళా కండక్టర్లపై ఆర్టీసీ బస్సు అదుపు తప్పి దూసుకు పోయింది. 20వ రోజు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు, నిరసనలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు.

రాజధానిలోని ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద మహిళా కండక్టర్లు ధర్నా నిర్వహించారు. 300 మందికిపైగా ప్రజాసంఘాల మహిళా నేతలు, ఆర్టీసీ మహిళా కార్మికులు పాల్గొన్నారు. పోలీసుల బందోబస్తు నడుమ ఈ ధర్నా కొనసాగింది. ధర్నాకు మద్దతుగా టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం సతీమణి సుశీల పాల్గొన్నారు. విమలక్కతోపాటు కళాకారులు పాటలతో ఆకట్టుకున్నారు. ఈ నెల 30లోపు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే 30న ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రజల వ్యతిరేకతను చూపిస్తామని ప్రభుత్వాన్ని పీడబ్ల్యుడీ నేత సంధ్య హెచ్చరించారు.

**ఈడీల కమిటీపై నమ్మకం లేదు: అశ్వత్థామ**

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ... ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులను వాడుకున్న సీఎం కేసీఆర్ ఇప్పుడు వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూటకోమాట మారుస్తున్నారని ధ్వజమెత్తారు. సెల్ఫ్ డిస్మిస్ అనే కొత్తపదాన్ని కనిపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఈడీల కమిటీపై తమకు నమ్మకం లేదన్నారు. కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి వెంటనే మాట్లాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 26 డిమాండ్లలో ఏఒక్క దానిపై వెనక్కు తగ్గేది లేదన్నారు. అనివార్యకారణాలతో 25న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన రాస్తారోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు అశ్వత్థామ ప్రకటించారు. రాస్తారోకోకు బదులు అన్ని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు ఆర్టీసీ కార్మికుల సమస్యలను విన్నవించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. 30 తేదీన సరూర్‌నగర్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్మికులు, ప్రజలకు పిలుపునిచ్చారు.

ఉప ఎన్నికలో టీఆర్ఎస్ విజయానికి ఆర్టీసీ సమ్మెకు సంబంధం లేదని కాంగ్రెస్ నేత వీ హనుమంతరావు అన్నారు. కార్మిక సంఘాల్లో చీలికలు తీసుకురావాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆర్టీసీ కార్మిక జేఏసీ కో.కన్వీనర్ థామస్‌రెడ్డి ఆరోపించారు. ఈడీలు పనికిమాలినోళ్లని, వారితో కమిటీ కాలయాపనకేనని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ఈ ధర్నాను ప్రొ. రమామేల్కోటే ప్రారంభించగా మోత్కుపల్లి నర్సింహులు, ఆర్టీసీ కార్మిక జేఏసీ నేత రాజిరెడ్డి, పలు ప్రజా సంఘాల, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

**ఇకనైనా చర్చలు జరపాలి: వివేక్**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మికుల నిరసనల్లో బీజేపీ నేత వివేక్ పాల్గొన్నారు. ఇప్పటికైనా కార్మికులతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెల్ఫ్ డిస్మిస్ పదం ఏచట్టంలో ఉందో చెప్పాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఆర్టీసీని లాభాల సంస్థగా చూడకుండా సబ్సీడీలు ఇచ్చి ఆదుకోవాలని సూచించారు.

**ఆర్టీసీ ఆస్తులను కాజేసే కుట్ర: కోదండరాం**

నిర్మల్ జిల్లా కేంద్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆర్టీసీ కార్మికులు చేస్తున్న నిరసన దీక్షలకు టీజేఎస్ అధినేత కోదండరాం మద్దతు తెలిపారు. ఆర్టీసీ ఆస్తులను కాజేసే కుట్ర పన్నినందునే కార్మికులతో చర్చలు జరపటం లేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆర్టీసీ కార్మికులు విధుల్లో ఉన్నపుడు రోడ్డు ప్రమాదాలు తక్కువగా జరిగేవని, ఇప్పుడు సమ్మెలో బస్సు ప్రమాదాలు ఎక్కువయ్యాయని గుర్తు చేశారు.



హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ కార్మికులు నిరసనలను ఉధృతం చేశారు. ఖమ్మం బస్‌డిపో ఎదుట నిరసన దీక్ష చేస్తున్న మహిళా కార్మికులపైకి తాత్కాలిక డ్రైవర్ నడుపుతున్న బస్సు దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో మహిళా కండక్టర్ అనిత తలకు గాయాలయ్యాయి. దీంతో కార్మికులు బస్సు డిపో ముట్టడికి ప్రయత్నించటంతో తోపులాట జరిగింది. ఏపీలో 21 రోజులు ఆర్టీసీ కార్మికులు సమ్మె చేశారని, ఇప్పుడు స్వరాష్ట్రంలోనూ అదే పరిస్థితి రావటం సిగ్గుచేటన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి, ప్రొ. జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం బస్ డిపో ఎదుట కార్మికులు దీక్షలు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మద్దతు తెలిపారు. విలీన డిమాండ్‌ను కార్మికులే వదులుకున్నారని సీఎం అనటం అసంబద్ధం అన్నారు. చర్చలకు పిలిస్తే ఆ డిమాండ్‌ను వదులుకోవాలో, లేదో తేలేదన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 8 డిపోల ఎదుట మహిళా కార్మికులు నిరసనలు వ్యక్తం చేశారు. జహీరాబాద్ డిపో ముందు కార్మికుల దీక్షలకు సీపీఎం, సీఐటీయూ సంఘీభావం ప్రకటించాయి. సిద్ధిపేట జిల్లాలో ఆర్టీసీ కార్మికుల దీక్షకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ సంఘీభావం ప్రకటించారు. మంత్రి హరీశ్‌రావు ఇకనైనా మౌనం వీడాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ధర్నాచౌక్ వద్ద మహిళా కార్మికులు రిలే నిరాహార దీక్షలకు దిగారు. విలీనం అంశంతో చర్చలు జరిపితేనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. బస్‌స్టాండ్ ముందు నిరసనలు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన దీక్షలకు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి హాజరయ్యారు. ఆర్టీసీని కాపాడాలనే ప్రభుత్వాన్ని కోరుతున్నాం కాని, మరే డిమాండ్ లేదన్నారు. తెలంగాణ వస్తే కొత్త ఉద్యోగాలు వస్తాయనుకుంటే ఉన్న ఉద్యోగాలే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ, మెట్‌పల్లి డిపోల ఎదుట కార్మికులు నిరసనలు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్మికుల నిరసనలకు బీజేపీ నేత జితేందర్‌రెడ్డి మద్దతు తెలిపారు. వనపర్తి ధర్నాచౌక్‌లో మహిళా కార్మికులు నిరాహార దీక్ష చేశారు. నాగర్‌కర్నూల్‌లో కార్మికులు వినూత్నంగా గాడిదకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కొల్లాపూర్‌లో తాత్కాలిక బస్సు డ్రైవర్ సిబ్బందిపై కార్మికులు దాడికి యత్నించారు.

# ఈడీల నివేదిక సిద్ధం

• నేడు ముఖ్యమంత్రికి అందజేత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీపై అధ్యయనం చేసిన ఈడీ కమిటీ నివేదికను రూపొందించారు. బుధ, గురువారాలు వరుస భేటీలు జరిపిన కమిటీ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్లపై కూలంకషంగా పరిశీలించి చర్చించారు. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసులో 26 డిమాండ్లను ఉంచగా, ఈడీల కమిటీ 21 డిమాండ్లపై అధ్యయనం చేసింది. బస్‌భవన్‌లో గురువారం కూడా భేటీ అయిన ఈడీలు ఆర్థిక పరమైన అంశాలను కాకుండా సంస్థపరంగా ఉన్న డిమాండ్లపై దృష్టి పెట్టి పరిశీలించింది. కార్మికుల డిమాండ్లలోని చాలా వాటికి ఈడీల కమిటీ సానుకూలంగానే నివేదికను రూపొందించినట్లు సమాచారం. వీటిల్లో చాలా వరకు ఈడీ, ఎండీ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపైనే ఆధారపడి ఉండటంతో ఇవన్నీ చిన్న చిన్నవేనని పేర్కొన్నట్లు తెలిసింది. సంస్థకు కావాల్సిన విడిభాగాలు, ఓవర్ టైం, గ్యారేజ్‌లలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు, బస్సుల నిర్వహణ తదితరాలన్నీ చిన్నవేనని పేర్కొన్నారు. 21 డిమాండ్లలో చాలా వరకు అధికారుల స్థాయిలోనే పరిష్కారమయ్యేవని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

జేఏసీ సమ్మె నోటీసులో ఇచ్చిన డిమాండ్లపై జరిపిన అధ్యయనంపై ఈడీల కమిటీ శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందించనున్నారు. వాస్తవానికి నివేదికను గురువారం సమర్పించాలని అనుకున్నప్పటికీ హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితం వెలువడటం, తర్వాత సీఎం మీడియా సమావేశం నిర్వహించడం తదితర కారణాలతో అపాయింట్‌మెంట్ లభించలేదు. శుక్రవారం ఎండీ సునిల్‌శర్మతో కలిసి ఈడీల బృందం సీఎంకు తమ నివేదికను అందించనున్నారు.

**ప్రధాన డిమాండ్లపై సస్పెన్స్....**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణ, కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్త బస్సులను కొనుగోలు చేయడం, కార్మికులకు చెందిన పీఎఫ్, వివిధ పొదుపు సంఘాల నుంచి నిర్వహణ కోసం ఆర్టీసీ యాజమాన్యం వాడుకున్న డబ్బులను వడ్డీతో సహా జమ చేయడం, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్న ప్రధాన డిమాండ్లపై సస్పెన్స్ కొనసాగుతోంది. చిన్న చిన్న డిమాండ్ల పరిష్కారం ఏమంత ఇబ్బందులు లేవని, కీలకమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని కార్మిక సంఘాలు అంటున్నాయి. మరో పక్క ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలంటే ముందు సంస్థ అనేది ఉంటేనే కదా అని సీఎం వ్యాఖ్యానించడంతో సమ్మె ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వెళ్తుందన్నది సస్పెన్స్‌గా మారింది.

## 'ధనస్వామ్యం గెలిచింది'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్‌లో ప్రజాస్వామ్యం ఓడింది. ధనస్వామ్యం గెలిచింది. టీఆర్ఎస్ వరసగా ఓటమి చెందడం వారికి సానుభూతిగా మారింది. దానికితోడు విచ్చల విడిగా డబ్బులు పంచారు. అయితే, ఈ ఎన్నికతో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ అని తేలింది. బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. గ్రామీణ ఓటర్లను మభ్యపెట్టినట్లుగా పట్టణ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయలేరు. మున్సిపాల్టీలో కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుంది అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తంచేశారు.

## ఓటమిపై విశ్లేషించుకుంటాం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ ఓటమికి కారణాలను పార్టీలో అంతర్గతంగా విశ్లేషించుకుంటామని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. గురువారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర, హర్యానాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఎక్కువగా ప్రచారం చేసినా బీజేపీకి తక్కువ సీట్లు వచ్చాయన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో ఏం సాధించారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి గెలుపోటములు సహజమని, అయినప్పటికి ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

## రేపటినుంచి కూనంనేని నిరవధిక దీక్ష

• సీఎం వ్యాఖ్యలు సరైనవి కావు: చాడ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ సమ్మె పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని కొనసాగిస్తే 26 నుంచి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నిరవధిక దీక్షకు పూనుకుంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఇందిరాపార్క్ వద్ద దీక్ష మొదలవుతుందని, సంఘీభావంగా ప్రజా సంఘాలు రిలే దీక్షలు, జిల్లాల్లో కూడా ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. హుజూర్‌నగర్‌లో విజయంతో సీఎం కేసీఆర్‌కు ఊపు, ఉత్సాహం వచ్చి ఉండవచ్చని, ఆర్టీసీ అయిపోయిందని మాట్లాడటం దుర్మార్గమన్నారు. సంస్థ నష్టాలకు కార్మికులు కారణమని సీఎం నిందించడం దారుణమన్నారు.

**సీఎం కేసీఆర్ తండ్రి పాత్ర పోషించాలి: కూనంనేని**

ఆర్టీసీ కార్మికుల సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని, తండ్రి పాత్ర పోషించాలే తప్ప నిర్ధాక్షిణ్యంగా ఉండకూడదని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. దాదాపు రెండు లక్షల మంది జీవితాలను సర్వనాశనం చేస్తామనే బెదరించే ధోరణిలో సీఎం మాట్లాడటం మంచిది కాదని ఆయన అన్నారు.

## మావి గొంతెమ్మ కోర్కెలు కావు

• కేసీఆర్ వ్యాఖ్యలపై ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ ఉద్యోగులను తొలగించే అధికారం ఎవరికీ లేదని కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ మాటలకు కార్మికులెవరూ భయపడొద్దన్నారు. ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే న్యాయస్థానాలు ఊరుకుంటాయా అని ప్రశ్నించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కరీంనగర్ సభలో కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేసారు. ఆర్టీసీ కార్మికులను అవమానపరిచేలా కేసీఆర్ మాట్లాడారని మండిపడ్డారు. కార్మికుల మనోభావాలు దెబ్బతినకుండా మాట్లాడాలన్నారు. మావి గొంతెమ్మ కోరికలు కావని, ఆర్థిక మాంద్యం ఒక్క తెలంగాణలోనే కాదు ప్రపంచం అంతా ఉందన్నారు. యూనియన్లు ఉన్నాయి కాబట్టే ఆర్టీసీ ఆస్తులు కాపాడుకోగలిగామన్నారు. ఆర్టీసీని కన్నతల్లిలా భావించి పని చేస్తున్నామని, కేసీఆర్‌కు కావాల్సినపుడు సమ్మెకు దిగి ఆర్టీసీని స్థంభింప చేస్తే ఇబ్బందులుండవు, ఇప్పుడు ఇబ్బందులున్నాయా అని నిలదీశారు. మేమెప్పుడూ గొంతెమ్మ కోర్కెలు కోరలేదని, కేసీఆర్ చెప్పిందే చేయమని అడుగుతున్నామన్నారు. ఉద్యోగాలు తీసేసేందుకు ఫాంహౌజ్‌లో పాలేర్లం కాదని వ్యాఖ్యానించారు. ధనిక రాష్ట్రం అని చెప్పిన తెలంగాణ మూడేళ్ళలోనే నష్టాల్లోకి వచ్చిందా అని నిలదీశారు. కేసీఆర్‌కు ఎప్పుడూ ఎన్నికల ధ్యాసే తప్ప ప్రజల కష్టాలు పట్టవన్నారు. ఇలాంటి సీఎంలను చాలా మందిని చూసామని, బెదరింపులకు లొంగేది లేదన్నారు. కేసీఆర్ దురహంకారానికి ఇది పరాకాష్ట అని వ్యాఖ్యానించారు.

**సమరభేరీని విజయవంతం చేయాలి**

ఆర్టీసీ సమ్మెలో భాగంగా 30 వ తేదీన సరూర్‌నగర్‌లో నిర్వహించేసకలజనుల సమరభేరిని విజయవంతం చేయాలని అశ్వత్థామరెడ్డి పిలుపునిచ్చారు. సమరభేరికి అన్ని వర్గాలుతరలి వచ్చేలా చూడాలని కార్మికులకు కోరారు. కేసీఆర్ మాటలతో ఎవరూ అధైర్యపడొద్దని అంతిమ విజయం మనదేనని కార్మికులకు సూచించారు.

# సమ్మెను ఉధృతం చేస్తాం

• జేఏసీ నేతలు రాజిరెడ్డి, థామస్‌రెడ్డి, వీఎస్ రావు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మెనుద్దేశించి తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలు ఖండించారు. హైదరాబాద్‌లోని టీఎంయూ యూనియన్ ఆఫీసులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మిక జేఏసీ కో.కన్వీనర్ రాజిరెడ్డి మాట్లాడుతూ... అద్దె బస్సులకు కిలోమీటరుకు రూ.75 పైసలు లాభం వస్తే...గత ఏడాది రూ.149కోట్ల నష్టం ఎందుకు వచ్చిందని నిలదీశారు. పండుగ పూట సీఎం చెప్పినంత ఆదాయం ఎప్పుడూ ఆర్టీసీకి రాలేదన్నారు. ప్రయివేటు బస్సులకు లాభాలు ఎలా వస్తాయి..? అని సీఎంను ప్రశ్నించారు. లాంగ్‌రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సులు కూడా లాభాల్లోనే ఉన్నయన్నారు. కాలం చెల్లిన బస్సులు2600 ఉన్నాయని స్వయంగా సీఎంకేసీఆరే చెప్పారని, మరి వాటితో లాభాలు ఎలా వస్తాయి..? అని ప్రశ్నించారు. యూనియన్ నేతల మీద అభాండాలు వేయటం మానుకోవాలని, మా ఆస్తులను జప్తు చేయండి, అదే సమయంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆస్తులనూ జప్తు చేయండి? ఎవరి ఆస్తులు ఎక్కవో తేలుతుంది..? అని సవాల్ విసిరారు. కార్మికుల జీతాలు 67శాతానికి పెంచామని సీఎం అనటం అబద్ధమన్నారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదన్నారు.

మరో నేత వీఎస్.రావు మాట్లాడుతూ... కార్మిక సంఘాలను చీల్చే కుట్రకు ప్రభుత్వం పాల్పడుతోందని మండిపడ్డారు. మేం సమ్మె చేస్తున్నాం... దొంగలం కాదు. కార్మికులం అని ప్రభుత్వానికి గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి కార్మికులను చైతన్యం చేస్తామన్నారు.

కార్మిక జేఏసీ మరో నేత థామస్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్టీసీకి నష్టాలు రావడానికి ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు. సీఎం మాట్లాడిన దాంట్లో ఏ మాత్రం వాస్తవాలు లేవన్నారు. కార్మికులకు ఆర్టీసీ కన్నతల్లిలాంటిందన్నారు. 26 డిమాండ్లలో యూనియన్ నేతలకు లబ్ధి చేకూర్చే అంశం ఒక్కటైనా ఉందా? అని ప్రశ్నించారు. ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ప్రెస్‌మీట్‌లో ఎందుకు చెప్పలేదు? అని సీఎంను నిలదీశారు. జీహెచ్ఎంసీ నుంచి రావాల్సిన బకాయిలను ఎందుకు ఇవ్వటం లేదు..? ప్రభుత్వానికి ఆర్టీసీ ఏటా వెయ్యికోట్ల పన్ను చెల్లిస్తుంటే ఇక లాభాలు ఎక్కడ నుంచి వస్తాయి..? అని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. చర్చలకు పిలవమని అడిగామని, మీడియా సాక్షిగా చర్చిస్తే ఎవరిది తప్పో తేలుతుందన్నారు. దాటవేసే దోరణిని వీడనాడి, రేపే చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. కార్మిక నేతలు రెండు బృందాలుగా విడిపోయి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి కార్మికులను, ప్రజలను చైతన్యం చేస్తామని ప్రకటించారు. సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఎవరూ అధైర్యపడొద్దని కార్మికులకు పిలుపునిచ్చారు.

## సకల జనుల సమ్మెలో ఆర్టీసీదే కీలకపాత్ర



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

**నిర్మల్, ప్రభ న్యూస్ :** ఆర్టీసీ కార్మికులు లేని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించలేమని, సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులదే కీలక పాత్ర అని టీజేఎస్ అధినేత, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద తలపెట్టిన ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఆయన సంఘీబావాన్ని తెలిపారు. కోదండరామ్ కార్మికులనుద్దేశించి దీక్ష శిబిరంలో మాట్లాడుతూ, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల బతుకు చిన్నాభిన్నమైందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులకు ముళ్లు కుచ్చితే తన నోటితో తీస్తానన్న వ్యక్తి ఈరోజు ఆర్టీసీ కార్మికుల పొట్టను కొట్టెందుకు ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసేందుకు తెర వెనుక పెద్ద కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. వేల కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులను అమ్మేందుకు ప్రభుత్వం పన్నాగం పన్నిందని ఆరోపించారు.

## బీజేపీకి హుజూర్‌నగర్ 'షాక్'!

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** టీఆర్ఎస్‌కు తామే రాష్ట్రంలో ప్రత్యామ్నాయమని ఇంత కాలం ఉపన్యాసాలతో ఊదరగొట్టిన బీజేపీ నేతలకు హుజూర్‌నగర్ ఉప ఎన్నిక షాకిచ్చింది. గత ఎన్నికల్లో కంటే ఉప ఎన్నికలో సత్తా చాటుతామని, బీజేపీ అంటే ఏమిటో చూపిస్తామన్న నేతలు ఫలితం వెలువడిన అనంతరం పార్టీ కార్యాలయానికి రావడానికి కూడా ఇష్టపడలేదు. 2018 లో జరిగిన ఎన్నికలో హుజూర్‌నగర్‌లో బీజేపీకి నోటాకు పడ్డ ఓట్ల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని భావించిన నేతలు సామాజిక అంశాలను బేరీజు వేసుకుని బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని బరిలో దింపారు.

**ప్రచారానికి అందరూ దూరం....**

ఉప ఎన్నిక ప్రచారాన్ని పార్టీ ఏ మాత్రం పట్టించుకోలేదు. ఒకరిద్దరు నేతలకు బాధ్యతలను అప్పగించినా వారు కూడా తూ.తూ. మంత్రంగా వ్యవహరించారు. హుజూర్‌నగర్ ఎన్నికల ప్రచారానికి లక్ష్మణ్ ఒక రోజు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒక రోజు వెళ్ళి వచ్చారు. వాస్తవానికి గెలుపు బాధ్యతను రాష్ట్ర స్థాయి నేతలెవరూ భుజాన వేసుకోకపోవడం కూడా ఘోరపరాభవానికి మరో కారణమైంది. లోక్‌సభ ఎన్నికల అనంతరం టీఆర్ఎస్ కొంత దూకుడు పెంచిన బీజేపీ అందివచ్చిన ఉప ఎన్నికను అస్త్రంగా మలచుకుంటుందని అందరూ భావించినప్పటికీ ఎవరి ఊహకు అందని విధంగా ఏ మాత్రం పట్టించుకోకపోవడం కూడా ఓటమికి మరో కారణమని అంటున్నారు. లోక్‌సభ ఫలితాల అనంతరం బీజేపీకి రాష్ట్రంలో కొంత మేర ఆధరణ పెరిగింది. టీడీపీ, కాంగ్రెస్‌ల నుంచి వలసల జోరూ పెరిగింది. హుజూర్‌నగర్‌లో చెప్పుకోతగ్గ ఓట్లను సాధించడం ద్వారా ప్రజల్లో ఉన్న ప్రత్యామ్నాయ పార్టీ అభిప్రాయాన్ని మరింత పదిలపరచుకునేందుకు కూడా నాయకత్వం ప్రయత్నించక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉప ఎన్నికను ఎంతో కొంత ప్రతిష్టాత్మకంగా తీసుకోకపోవడం వల్లే ఘోర పరాజయమని స్వంత పార్టీ నేతలు అంటున్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటా



**అమరావతి. ఆంధ్రప్రభ:** తెలంగాణలో 48 వేల మంది ఆర్టీసీ కార్మికులను అక్కడి ప్రభుత్వం ఒక్క మాటతో తీసేస్తే అన్ని రాజకీయ పార్టీలు కలసి వచ్చాయని, ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ని లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడితే ఇక్కడ రాజకీయ పార్టీలు కలిసి రాకపోగా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ అన్నారు. ఇక్కడి వ్యవస్థ గ్రూపులుగా, వర్గాలుగా విడిపోయి ఉండడమే అందుకు కారణమన్నారు. జనసేన పార్టీ మాత్రం ఎవరికి సమస్య వచ్చినా త్రికరణశుద్ధిగా అండగా నిలబడుతుందన్నారు. గురువారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో జనసేనాని సమావేశమయ్యారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు పడుతున్న కష్టాలను తెలుసుకున్నారు.

అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుడికి రక్షణ కల్పించేపరిస్థితులు లేకపోవడం విచారకరమన్నారు. విదేశాల్లో కార్మికుల రక్షణకు ఎన్నో బలమైన చట్టాలు ఉన్నాయని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను ఉంటానన్నారు. కార్మికులకు పెద్దన్నయ్యగా అండగా నిలుస్తానని, నవంబర్ 3వ తేదీన విశాఖలో జరిగే నిరసన యాత్ర ద్వారా అంతా కలసి ప్రభుత్వం మీద బలమైన ఒత్తిడి తీసుకువద్దామని పిలుపునిచ్చారు. విశాఖ మార్చ్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిపారు.

## పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



**నిజామాబాద్ రూరల్, ప్రభన్యూస్:** డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇష్టమచ్చినట్లు బస్సులు నడపడంతో అమాయకులు బలవుతున్నారు. గురువారం నిజామాబాద్ మండలంలోని మల్లారంగండి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను మరో బస్సును అదుపు తప్పించడంతో నిజామాబాద్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆర్టీసి బస్సు గండి పొదల్లోకి దూసుకెళ్ళింది. దీంతో డ్రైవర్, కండక్టర్ తప్పించుకొని పరారయ్యారని రూరల్ ఎస్‌హెచ్‌వో ప్రభాకర్ తెలిపారు. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికుల్లో ఆర్మూర్‌కు చెందిన బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయని, నసుర్లాబాద్‌కు చెందిన పోచమ్మకు కుడి చేతి వేళ్ళు విరిగాయని తెలిపారు. వీరు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సును రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఏపీ పారిశ్రామికాభివృద్ధికి సహకరిస్తాం

• కేంద్ర మంత్రి సదానందగౌడ

**విజయవాడ సిటీబ్యూరో / ప్రభ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని కేంద్ర పెట్రోలియం, రసాయన, ఎరువుల శాఖ మంత్రి డీవీ సందానందగౌడ్ స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) నూతన భవన సమూదాయ శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి సదానందగౌడ్ ప్రారంభించారు. అనంతరం రూ. 50 కోట్లతో నిర్మించిన సిపెట్ నూతన భవనాన్ని సీఎం, కేంద్ర మంత్రి సంయుక్తంగా ప్రారంచారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సదానందగౌడ్ మాట్లాడుతూ విశాలమైన కోస్తా తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయన్నారు.

అందుకే కేంద్రం పూర్తిగా సహకరిస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో పాటు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ పునర్ వినియోగం తప్పనిసరన్నారు. ప్లాస్టిక్ పరిశోధనలపై కేంద్రం దృష్టిపెట్టిందన్నారు. విన్నూత్న ఆలోచనలతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిరోధించేందుకు పరిశోధనా కేంద్రాలు ఏర్పాటుచేయబోతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సిపెట్ ఆధ్వర్యంలో 37 కేంద్రాలు స్థాపించబడ్డాయన్నారు. త్వరలో మరో 5 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభ్యర్ధన మేరకు నెల్లూరు జిల్లా నాయుడుపేటలో కూడా మరో సిపెట్ కేంద్రాన్ని నెలకొల్పుతామని కేంద్ర మంత్రి చెప్పారు.

# భారత ప్రగతిలో 4 'డీ'ల భాగస్వామ్యం

• అజర్‌బైజాన్‌లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** దేశ ప్రగతిలో ప్రవాస భారతీయుల పాత్ర ఎంతో కీలకమని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. దేశ సమగ్రత, సమాన, సుస్థిరాభివృద్ధిలో ప్రవాస భారతీయులు పోషించాల్సిన పాత్ర గురించి ఆయన మాట్లాడారు. 18వ అలీనోద్యమ సదస్సు కోసం అజర్‌బైజాన్ దేశ రాజధాని బాకు నగరానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి, గురువారం సాయంత్రం అక్కడి ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. దేశంలో ఆర్థిక, సామాజిక మార్పులు తీసుకొచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. భారత ప్రగతిలో త్రీ'డీ' (డెమొక్రసి, డిమాండ్, డెమొగ్రాఫిక్ డివిడెండ్) పాత్రతోపాటు.. నాలుగో 'డీ' డయాస్పొరా (ప్రవాస భారతీయులు) భాగస్వామ్యం కూడా కీలకమని ఆయన స్పష్టం చేశారు. అజర్‌బైజాన్ ప్రజలతో మమేమకవుతూనే.. ఇరుదేశాల మధ్య ఆర్థికాంశాలతోపాటు సంస్కృతి, సాంప్రదాయాల వారధులుగా నిలవాలని ప్రవాసీయులకు పిలుపునిచ్చారు. ఇరుదేశాల మధ్య శతాబ్దాలుగా సత్సంబంధాలున్నాయని.. దీన్ని మరింత బలోపేతం చేసేదిశగా క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. అజర్ బైజాన్‌లో భారత కంపెనీలు.. సమాచార, సాంకేతిక రంగం, ఫార్మా, పునరుత్పాదక విద్యుత్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు.

ప్రవాస భారతీయుల విషయంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. 'విదేశాల్లో మీ నేస్తం, భారతీయ దౌత్య కార్యాలయం' అన్న విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. ''విదేశీ గడ్డపై ఉన్న మనవారికి ఏ అవసరమొచ్చినా, నైతిక సాయం కావాలన్నా దౌత్య కార్యాలయాల తలుపులు మీ కోసమే తెరిచి ఉంటాయి. ఎలాంటి మార్గదర్శనం కావాలన్నా మీరు నిస్సందేహంగా మన అధికారులను సంప్రదించవచ్చు'' అని ఆయన అన్నారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా.. ఆ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్నందున భారత సంతతి ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మహాత్ముని 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసిన అజర్‌బైజాన్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు.

## ఇసుక దోపిడీపై కార్యాచరణ: చంద్రబాబు

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక కృత్రిక కొరతపై ఉద్యమ కార్యాచరణతో పనిచేసి, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు తెలియజేయాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఆయన పార్టీ ముఖ్యనేతలు, మాజీ మంత్రులు, జిల్లా, నియోజకవర్గ బాధ్యులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా నేతలు పాల్పడుతున్న ఇసుక దోపిడిపై పోరాటం చేయాలని, అన్ని ప్రాంతాల్లో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు. ఇసుక కొరతతో ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది కార్మికులకు పార్టీ నేతలు అండగా ఉండాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించి వైకాపా ప్రభుత్వం కార్మికుల పొట్ట కొట్టిందని, భవన నిర్మాణ రంగానికి సంబంధించి అనేక మంది వృత్తిదారులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా ప్రభుత్వం సృష్టించిన సమస్య అని లక్షలాది మంది కూలీలను పస్తులు పడుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. నష్టపోయిన కార్మికులందరికి పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఒకవైపు అమరావతి, మరోవైపు పోలవరం పనులు నిలిపివేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలను కుంటుపరిచారని దుయ్యబట్టారు. అనేక మంది ఇళ్ళ నిర్మాణాలను ఇసుక కొరతతో వాయిదా వేస్తున్నారని దీనికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు.

● టెలికం సంస్థలకు సుప్రీం షాక్

# రూ.92 వేల కోట్లు చెల్లించాల్సిందే

**న్యూఢిల్లీ:** టెలికం సంస్థలకు సుప్రీంకోర్టు షాకి చ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ టెలికాం సంస్థలు చెల్లించాల్సిన రూ. 92 వేల కోట్లను వసూలు చేసేందుకు కేంద్రానికి అనుమతినిస్తూ ఆదే శాలు జారీ చేసింది. టెలికం శాఖ రూపొందించిన సవరిం చిన వార్షిక స్థూల ఆదాయం(ఏజీఆర్) ను సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ప్రభుత్వానికి డబ్బు చెల్లించాల్సిన టెలికం కంపెనీల్లో భారతీ ఎయిర్ టెల్, వొడాఫోన్, రిలయన్స్ జియో, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఉన్నాయి. 92 కోట్లు లైసెన్స్ ఫీజు కాగా.. స్పెక్ట్రమ్ యూసేజ్ చార్జి, పెనాల్టీ, వడ్డీ వంటివన్నీ కలుపుకుని రూ.1.4 లక్షల కోట్లుగా టెలికం శాఖ తెలిపింది. భారతీ ఎయిర్ టెల్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తం రూ. 21, 682.13 కోట్లు కాగా.. వొడాఫోన్ రూ.19, 823.71 కోట్లు, రిలయన్స్ జియో రూ. 16,456.47 కోట్లు, బీఎస్ఎన్ఎల్ రూ. 2,098.72 కోట్లు, ఎంటీఎన్ఎల్ రూ.2,537.48 కోట్లు. వీరంతా ప్రభుత్వానికి చెల్లించా ల్సిన అప్పులపై వీరందరికీ 10 రోజుల్లో డిమాండ్ నోటీసులు వెళ్లనున్నాయి. నోటీసులు అందుకున్న 15 రోజుల్లో టెలికాం ఆపరేటర్లు డబ్బు చెల్లించాల్సి ఉం టుంది. రిలయన్స్



జియో ఎంట్రీతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన టెలికం సంస్థలు.. ప్రభుత్వానికి చెల్లించా ల్సిన డబ్బును ఎలా కడతాయనేది ప్రశ్నార్థ కంగా మారింది. నూతన టెలి కాం విధానాన్ని సవాల్ చేస్తూ టెలికం సంస్థలు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో.. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలిం చిన జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది.

Andhraprabha business 2019 బిజినెస్ BUSINESS

## పన్ను ప్రోత్సాహకాలతో వృద్ధికి ఊతం

# పన్నుల్లో కోత

### ఆదాయపు పన్ను పరిమితి పెంపు దిశగా కేంద్రం యోచన

● 30శాతం పన్ను చెల్లిస్తున్న వారికి ఉపశమనం కల్పించేలా కసరత్తు ● వినియోగశక్తిని పెంపొందించుకునేలా వ్యూహాలు ● తద్వారా మందగమనానికి చెక్ పెట్టొచ్చనే భావన ● వచ్చే బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసే అవకాశం




**న్యూఢిల్లీ :** ఆర్థిక మందగమనానికి చెక్ పెట్టేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కార్పొరేషన్ పన్ను తగ్గింపు, బ్యాంకులకు ఊతమిచ్చేలా మూలధనం కేటాయింపు వంటి చర్యలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు ఊపందుకోకపోవడంతో మార్కెట్‌లో కొనుగోలు శక్తిని ప్రోత్సహించేందుకు మరో మార్గాన్ని అన్వేషిస్తోంది. వినియోగం పెరిగితే మార్కెట్‌లో పేరుకుపోయిన వివిధ రకాల ప్రాడక్ట్స్ అమ్ముడుపోయి.. నగదు కొరతకు చెక్ పడుతుందని భావిస్తోంది. వృద్ధి రేటును పెంచుకోవాలంటే ఆదాయపు పన్ను శ్లాబుల్లోనూ మార్పులు తప్పవని యోచిస్తోంది. ప్రస్తుతం ఏడాదికి రూ.10 లక్షలు, ఆపైన ఆదాయం కలిగిన వ్యక్తుల నుంచి ప్రభుత్వం 30 శాతం పన్ను వసూలు చేస్తోంది. రూ.10 లక్షల పరిమితిని మరికొంత పెంచడం ద్వారా పన్ను చెల్లింపుదారులకు ప్రోత్సాహం కల్పించి.. వినియోగ శక్తిని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. రూ.10 లక్షలపై విధిస్తున్న 30 శాతం పన్ను పరిమితిని కనీసం రెండు నుంచి నాలుగు లక్షలకు పెంచితే ప్రజలకు కొంత మేర ఉపశమనం కలిగి వారి అవసరాలను తీర్చుకునేందుకు కొనుగోళ్లు చేస్తారని.. తద్వారా ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణి పెరిగి ఆర్థిక మందగమనం ప్రభావం తగ్గుతుందని నిపుణులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై లోతుగా చర్చిస్తున్న మోడీ ప్రభుత్వం... అన్ని రకాల ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పెట్టే బడ్జెట్‌లో ప్రస్తావించే అవకాశం ఉందన్నారు.

### ద్రవ్యలోటు 3.3శాతానికి తగ్గించేదిశగా కసరత్తు




కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సవాళ్లపై స్వారీ చేస్తున్నారు. ఓవైపు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం తాండవిస్తుండటం.. ఆ ప్రభావం భారత్‌పై పడటంతో తయారీ రంగం తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నిర్మలా సీతారామన్ పలు దఫాలుగా వివిధ కంపెనీల సీఈవోలతో భేటీ అయి కొనుగోళ్ల పెంపునకు అనుసరించాల్సిన తీరుపై చర్చలు జరిపారు. రోజురోజుకూ పెరిగిపోతున్న ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు ఆమె తనదైన శైలిలో కసరత్తును చేస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 3.3 శాతానికి తగ్గించాలని ఆర్థిక మంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. జీడీపీ ద్రవ్యలోటును కట్టడి చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలని యోచిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. కార్పొరేట్ పన్నును 10 శాతం తగ్గించడం కోసం 20 బిలియన్ డాలర్ల ఉద్దీపనలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం...తద్వారా రెవెన్యూ వసూళ్లు పెరిగి.. వినియోగానికి ఊతమిచ్చినట్లవుతుందని భావిస్తోంది.

### పెట్రోల్ రిటైలింగ్‌లోకి ప్రైవేట్ సంస్థలు



ఆర్థిక మందనానికి చెక్ పెట్టి.. మార్కెట్‌లో విస్తృతంగా నగదు చలామణి కోసం మోడీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ రిటైలింగ్‌లోకి ప్రైవేట్ సంస్థలను సైతం ఆహ్వానిచేందుకు ఆమోదం తెలిపింది.250 కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థలు ఫ్యూయల్ రిటైలింగ్‌లో అడుగుపెట్టేందుకు అనుమతినిచ్చింది. తద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయమని ప్రభుత్వం భావిస్తోంది. 17 ఏళ్లుగా అమలులో ఉన్న చమురు రిటైలింగ్ నిబంధనలను సడలిస్తూ.. చమురు రిటైలింగ్‌లో ప్రైవేట్ సంస్థలు ప్రవేశించేలా నిర్ణయం తీసుకుంది. నూతన నిబంధనల ప్రకారం చమురుయేతర సంస్థలు కూడా ఎక్కువ సంఖ్యలో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ పెట్రోల్ బంకుల మధ్య పోటీ పెరుగుతుంది. ప్రస్తుతం దేశంలో ఏదైనా కంపెనీ, సంస్థ చమురు రిటైలింగ్ లైసెన్స్ పొందాలంటే రూ. 2వేల కోట్లు సమకూర్చుకోవడంతో పాటు హైడ్రోకార్బన్ అన్వేషణలో పాలుపంచుకోవడం, ఉత్పత్తి, రిఫైనింగ్,పైప్ లైన్స్ లేదా ఎల్పీజీకి పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.

### విదేశీ పెట్టుబడులపై దృష్టి

విదేశీ పెట్టుబడులు అత్యధికంగా రాబట్టడం ద్వారా ఆర్థిక మందగమనానికి మందు వేయాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల అమెరికా పర్యటనలో సైతం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. పెట్టుబడులను భారత్ స్వర్గధామమని వివరించిన ఆమె.. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం, ఇక్కడి చట్టాలు కల్పిస్తున్న ఆర్థిక భరోసా వంటివి వివరించారు. ఆర్థిక మంత్రి కృషి తో విదేశాల నుంచి పెట్టుబడులు భారీ వచ్చే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గతంలోని బొగ్గు, తయారీ వంటి రంగాల్లో భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్రం అనుమతిని వ్వగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలోని సారాంశాన్ని ఆర్థిక మంత్రి ఐఎంఎఫ్ వేదికగా జరిగిన వివిధ కంపెనీల ప్రతినిధుల భేటీలో వివరించారు.




### పన్ను తగ్గింపుతో వినియోగానికి ఊతం

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యక్తులు తమకు అత్యవసరమైన వస్తువులు తప్ప.. భవిష్యత్ ప్రణాళికల కోసం ఖర్చులు చేసేందుకు ఏ మాత్రం సాహసించడం లేదు. రూ.10 లక్షలు, ఆపై ఆదాయం కలిగిన వారు సైతం కొత్త కొనుగోళ్లు తగ్గించుకుని.. ఉన్నవాటితోనే సర్దుకోవాల్సిన వస్తోంది. ఇటీవల ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు కార్పొరేట్ పన్నును 10 శాతం తగ్గించడంతో వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారుల్లో కాస్త అసంతృప్తి ఉంది. ఏ ఏడాదికాఏడాది లెక్క తప్పకుండా పన్ను చెల్లింపులు చేస్తున్నా.. తమకు నామమాత్రమే వరాలు ఇస్తూ.. కార్పొరేట్లకు ఒక్కసారిగా 10 శాతం పన్ను తగ్గించారన్న ఆవేదనతో కొంత మంది పన్ను చెల్లిం పుదారులు.. తమతమ కార్యకలాపాలను సైతం తగ్గించుకుని.. ఆదాయ పరిమితిని కూడా కుదించుకుంటున్నారు. ప్రభుత్వానికి ఆదాయపు పన్ను కింద సంపాదనలో 30 శాతం చెల్లిస్తున్నా.. తమను పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు శుభవార్త నందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇప్పటికే ఆర్థిక రంగ నిపుణులను సైతం సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆదాయ వర్గాలను పన్ను చెల్లింపునకు ప్రోత్సహించేందుకు ఆదాయ పరిమితి పెంపు కూడా కలిసివచ్చే అంశమేనని పలువురు సూచించడంతో సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం.



## సులభతర వాణిజ్యంలో

# భారత్ దూకుడు

● వరల్డ్ బ్యాంక్ 2020 నివేదికలో భారత్‌కు 63వ ర్యాంకు ● ఐదేళ్లలో 79 స్థానాలు ఎగబాకిన ఇండియా ● ప్రభుత్వ ప్రోత్సాహకమే కారణమంటున్న పారిశ్రామిక వేత్తలు



**న్యూఢిల్లీ:** సులభతర వాణిజ్యంలో భారత్ మరోసారి సత్తా చాటింది. అంతర్జాతీయంగా వ్యాపార నిర్వహణలోనూ గణనీయమైన ప్రగతిని సాధించింది. ఏడాదిలో 14 స్థానాలకు ఎగబాకి సులభ వ్యాపారంలో దూసుకెళ్తోంది. గత ఐదేళ్లుగా భారత్ దూసుకెళ్తోంది. 2020 సంవత్సరానికిగానూ ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకుల్లో భారత్ 63వ ర్యాంక్‌కు చేరడం విశేషం.2014 లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ ర్యాంక్ 142 ఉండగా.. ఈ ఐదేళ్లలో ఏకంగా 79 స్థానాలు ఎగబాకడం గమనార్హం.. గతేడాది 77 వ స్థానంలో ఉన్న భారత్ ఈ ఏడాది 14 స్థానాలు ఎగబాకడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేశారు. 190 దేశాల్లో సులభ వ్యాపార విధానంపై నిర్వహించిన పరిశోధన ద్వారా ప్రపంచ బ్యాంక్ ఈ నివేదికను రూపొందించింది.

### లక్ష్యం 50 లోపు ర్యాంక్

సులభతర వాణిజ్యంలో భారత్ ఊహించని రీతిలో ప్రగతిని సాధిస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భారత్ ర్యాంక్ మరింత మెరుగయ్యేందుకు జీఎస్టీ సరళీ కరణ తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఏడాదిలోనూ భారత్ 14 స్థానాలు ఎగబాగడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యాపార రంగాన్ని ప్రోత్సహిస్తూ అవసమైన సంస్కరణలు చేపట్టడం వల్లే భారత్ ర్యాంక్ 63 కు చేరిందన్నారు. మొత్తం 190 దేశాల్లో భారత్ ర్యాంక్ గత ఐదేళ్లుగా గణనీయంగా మార్పు చెందుతూ వస్తోందని.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ ర్యాంక్ 50 లోపు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. జీఎస్టీ చెల్లింపుల్లో ఎదురౌతున్న అవాంతాలను తొలగించేప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ఆన్‌లైన్ ఫైలింగ్ లో ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించేం దుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. వచ్చే జీఎస్టీ మండలి సమావేశం నాటికి నూతనంగా వ్యాపా రం ప్రారంభించ డానికి పాటించాల్సిన పారామీటర్స్ వంటి వాటిపై కస రత్తు చేస్తున్నామన్నారు. ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులపై విలేఖరులు ప్రశ్నించగా.. ప్రస్తుతం స్పందిం చబోమన్నారు. వచ్చే రెండేళ్లలో కోల్‌కతా, బెంగళూరు కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాం కింగ్ ఇండెక్స్‌లో చేరేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తు తం ఢిల్లీ, ముంబై నగరాలే ర్యాంకింగ్ ఇండెక్స్‌లో ఉన్నా యని.. భారత్ లాంటి పెద్ద దేశాల్లో అనేక నగరాలు ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో దూసు కుపోతున్న నేపథ్యంలో ఆయా నగరాలను ర్యాం కింగ్ ఇండెక్స్‌లో చేర్చాల్సిన అవసముందన్నారు.

### టాప్ 10 దేశాలతో పోటీగా వృద్ధి



టాప్ 10 దేశాలతో పోటీగా భారత్ సులభతర వాణిజ్యంలో దూసుకుపోతోంది. సులభ వ్యాపార విధానానికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలే సత్ఫలితాలిసున్నాయి. వ్యాపార విస్తరణకు ఉన్న బంధనాలను తొలగించడమే ర్యాంకింగ్ వృద్ధికి కారణం.

**- ఆది గోద్రేజ్, గోద్రేజ్ గ్రూప్ ఛైర్మన్**



### మరో మైలురాయిని అధిగమించాం..

ప్రధాని మోడీ సంస్కరణలు మరో మైలురాయిని అధికమించేలా చేశా యి. 142 నుంచి 63కు భారత్ ర్యాంక్ పెరగడం ఆర్థిక వృద్ధిలో గొప్ప విజయం. వరల్డ్ బ్యాంక్ ప్రకటనతో భారత్‌లో విదేశీ వ్యాపారానికి ఊతమిచ్చింది.

**- బాలకృష్ణన్ గొయెంకా, అసోచామ్ అధ్యక్షుడు**

## హైదరాబాద్‌లో ఆంధ్రాబ్యాంక్ కాయిన్ మేళా



**హైదరాబాద్ :** వ్యాపారుల, పౌరులకు చిల్లర కష్టాలు తీర్చేందుకు ఆంధ్రాబ్యాంక్ హైదరాబాద్ లోని ఎర్రగడ్డ రైతుబజార్‌లో గురువారం కాయిన్ మేళా నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఆర్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.ఎస్ చక్రవర్తి ప్రారంభించారు. వ్యాపారులు, స్థానిక పౌరులకు రూ.8 లక్షల వరకు చిల్లర నాణేలు, కొత్త నోట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్బీఐ డీజీఎం చక్రవర్తి మాట్లాడుతూ తరుచూ చిల్లర కష్టాలు ఎదుర్కొంటున్న వారికి..స్థానికంగా సమస్యలు పరిష్కరించే దిశగా కాయిన్ మేళాను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.10 నాణేలు చలామణిలోనే ఉన్నాయని.. ఆ నాణెల విషయంలో వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు.. ఆంధ్రాబ్యాంక్ జీఎం శ్రీనివాస శాస్త్రి, ఏజీఎం సత్యానారాయణ మూర్తి, జోనల్ మేనేజర్ రాజేంద్ర కుమార్, బ్రాంచీ మేనేజర్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### 39 శాతం తగ్గిన మారుతి లాభం

**న్యూఢిల్లీ:** దేశీయ కార్ల దిగ్గజం మారుతీ సుజుకీం లాభం గతేడాదితో పోలిస్తే 39 శాతం తగ్గింది. సెప్టెంబర్ 30 తో ముగిసిన రెండ్రో త్రైమాసికానికి కంపెనీ రూ. 1,391 కోట్ల లాభాన్ని ఆర్జించినా.. గతేడాది రెండో త్రైమాసికంతో పోలిస్తే ప్రస్తుత లాభం రూ. 889 కోట్లు తక్కువ. రెవెన్యూ వసూళ్లు కూడా గతే డాదితో పోలిస్తే 25.19 శాతం తగ్గాయి. గతేడాది రెండో త్రైమా సి కంలో రూ. 21,553.7 కోట్లు వసూ లు కాగా.. ఈ ఏడాది రూ. 16,123.2 కోట్లు వసూలు కావడం గమనార్హం. రెండో త్రైమాసికంలో మారుతీ కార్ల అమ్మకాలు 30.2 శాతం తగ్గిపోయి 3,38,317 మాత్రమే అమ్ముడ య్యాయి. రెండో త్రైమాసిక ఫలితా లపై మారుతీ సుజుకీ ఛైర్మన్ ఆర్‌సి బార్గవ్ స్పందిస్తూ.. ప్రస్తుత ఫలి తాలు నిరాశజనకంగా ఉన్నాయని.. క్యూ2లో అమ్మకాలు 22 శాతం మేర పడిపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్ప డిందని చెప్పారు. గత మూడు నెల లుగా ఆటో పరిశ్రమ ఘోరంగా దెబ్బతిన్నదని.. అమ్మకాలు గణనీ యంగా పడిపోవడం వల్లే క్యూ2లో లాభం తగ్గిందని తెలిపారు. మార్కె ట్‌లో నగదు కొరత, కార్ల కొను గోళ్లకు లోన్లు అందకపోవడం, డౌన్ పేమెంట్లు తగ్గడం వంటివి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

## భారత్, అమెరికా ద్వైపాక్షిక

# ఇంధన వాణిజ్యం పైపైకి!

### ఈ ఏడాది 42 శాతానికి పెరిగే ఛాన్స్



● 10 బి.డాలర్ల వ్యాపారం ● ఒపెక్ దేశాలకు ప్రత్యామ్నాయమే భారత వ్యూహం ● పశ్చిమాసియా రాజకీయ అస్థిరతలకు చెక్ ● 2016లో భారత్, అమెరికా వ్యూహాత్మక ఒప్పందం

**న్యూఢిల్లీ :** అగ్రరాజ్యం అమెరికాతో భారత ఇంధన వాణిజ్యం ఈ ఆర్థిక సంవత్సరంలో 42 శాతానికి పైగా పెరిగే అంచనాలున్నాయి. ఈ ఏడాది మొత్తం 10 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగే అవకాశాలున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. పశ్చిమాసియా దేశాల్లో రాజకీయ అనిశ్చితి పరిస్థితులల్లో తలెత్తే ఇబ్బందులను అధిగమించడమే భారత్ ప్రధాన వ్యూహంగా ఉంది. ఇందుకు ఒపెక్ యేతర దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకోవాలనే లక్ష్యంతో భారత్ అడుగులు వేస్తోంది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఇంధన వినియోగదారుగా భారత్ కొనసాగుతోంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో అమెరికా నుంచి క్రూడ్ ఆయిల్, ఎల్ఎన్‌జీ( లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్), కుకింగ్ కోల్‌ల రూపంలో మొత్తం వాణిజ్యం విలువ 7.2 బిలియన్ డాలర్లుగా నమోదయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విలువ 10 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది. ఇదే అంశంపై కేంద్ర ఇంధనశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. అంతర్జాతీయంగా రాజకీయ అస్థిరతలు, అమెరికాలో ఇంధన ఉత్పత్తులు పెరగడం, భారత్‌కు తగిన మోతాదులో ఇంధన అవసరం ఏర్పడడం ఇరుదేశాలు తమ శక్తిరంగం ద్వైపాక్షిక బంధాలను నూతన ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం వార్షిక లీడర్‌షిప్ సమ్మిట్ ఆయనీ వ్యాఖ్యలు చేశారు.

### శక్తిరంగానికి ఊతం

ఇరుదేశాల శక్తిరంగానికి ఊతమివ్వడమే లక్ష్యంగా 2016లో అమెరికా, భారత్‌లు వ్యూహాత్మక ఇంధన భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇరుదేశాల ఇంధనరంగాన్ని బలోపేతం చేయడం, అమెరికా ఎల్ఎన్‌జీకి భారత మార్కెట్లో ప్రాధాన్యత ఇవ్వడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశాలు. అయితే ఒపెక్ గ్రూప్‌లోని పశ్చిమాసియా దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలనే ప్రత్యేక వ్యూహంలో భాగంగా అమెరికాతో భాగస్వామ్యాన్ని భారత్ పెంచుకుంది. భారత్ దిగుమతి చేసుకుంటున్న ఇంధనంలో ఒపెక్ దేశాల వాటా 65 శాతం వాటాను క్రమంగా తగ్గిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సౌదీఅరేబియా ఆయిల్ పరిశ్రమకు అత్యంత కీలకమైన ఆరంకో యూనిట్లపై హౌతీతిరుగుబాటుదారుల దాడులు ప్రకంపనలు సృష్టించాయి. ఈ యూనిట్లపై దాడితో ఒపెక్ దేశాల ఆయిల్ ఉత్పత్తి దాదాపు సగానికి సగం క్షీణించింది. ఫలితంగా ఆయిల్ రేట్లు చరిత్రాత్మక రీతిలో పెరుగుదలకు ఈ పరిస్థితులు కారణమయ్యాయి. దీంతో ఇతర దేశాల వనరుల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చేందుకు భారత్ వ్యూహాన్ని మార్చింది.



### గెయిల్‌తో దిగుమతి మొదలు..

అమెరికాతో సమర్థ వంతమైన ఇంధన వాణిజ్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్(నేచురల్ గ్యాస్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ) తొలిసారి 2013లోనే ప్రారంభించింది. 20 ఏళ్ల దిగుమతి ఒప్పందంతో నౌకల ద్వారా షెల్ గ్యాస్ దిగుమతికి ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికా నుంచి మొత్తం 5.8 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ దిగుమతికి కంపెనీ ఒప్పందం ఖరారైంది. ఒప్పందంలో భాగంగా తొలిసారిగా 2017లో తొలి సారి షెల్ గ్యాస్ భారత తీరం చేరింది. ఈ ఒప్పందానికి ముందు అమెరికా ఇంధ నాన్ని షెల్ ఇంధనంగా మాత్రమే భారత్ కం పెనీలు పరిగణించేవి. కానీ ప్రస్తుతం పరి స్థితులు మారాయి. అమెరికా ఆయిల్ మార్కెట్ భారత్‌కు ప్రధానమైనదిగా క్రమం గా మారుతోంది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు విధించిన తర్వాత అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు గణనీయంగా పెరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

GAIL (India) Limited

# డెంగీపై హైకోర్టు స్వీయ పర్యవేక్షణ!

- సీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయండి
- ప్రతి గురువారం కోర్టుకు ప్రగతి నివేదిక సమర్పించండి
- తెలంగాణ సర్కార్‌కు హైకోర్టు ఆదేశం
- ఐఏఎస్ అధికారులపై ఆగ్రహం
- డెంగీతో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ. 50లక్షలు చెల్లించాలి




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణలో విజృంభిస్తున్న డెంగీ మహమ్మారి నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో డెంగీ నివారణ చర్యలను ఇకపై తామే స్వయంగా పర్యవేక్షిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఈ వ్యవహారంపై ప్రతి శుక్రవారం పర్యవేక్షిస్తామని హైకోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశిం చింది. అలాగే రాష్ట్రంలో డెంగీ జ్వరం పరిస్థితులపై ప్రతి గురు వారం తమకు ప్రగతి నివేదికసమర్పించాలనిసదరు కమిటీనిహైకోర్టు ఆదేశించింది. డెంగీని నివారించలేకపోతే మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారంగా చెల్లించాలని వ్యాఖ్యానించింది. అధికారుల (బ్యూరోక్రాట్ల) జీతాల నుంచి రూ..5లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. ఒక వేళ రాష్ట్రంలో భూకంపం సంభవిస్తే పరిస్థితి ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. డెంగీ వ్యాధి నుంచి తన ప్రజలను కాపాడే ప్రాథమిక బాధ్యతను నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడింది. ప్రపంచంలోనే అతి చిన్నదైన శ్రీలంక దేశంలో మలేరియా సంబంధిత వ్యాధులను శాశ్వతంగా అరికట్టిన విషయాన్ని హైకోర్టు గుర్తు చేసింది. అయితే తెలంగాణ ప్రభుత్వం ఆ పని చేయలేదా అని హైకోర్టు ప్రశ్నించింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 500 ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసే ఆలోచన ఎందుకు చేయలేదని హైకోర్టు అధికారులను ప్రశ్నించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఏ అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 1కి వాయిదా వేసింది.

కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే.జోషి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ రమేష్ రెడ్డి,ఫీవర్ ఆసుపత్రిసూపరింటెండెంట్ శంకర్ హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా డెంగీ జ్వరం నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తీవ్ర అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసింది. అధికారులు తీసుకుంటున్న చర్యలు కంటితుడుపుగా ఉన్నాయని, కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షేత్ర స్థాయిలో పరిస్థితి బాగాలేదని వ్యాఖ్యానించింది. ఒక వేళ మూసీ నది ఒడ్డును ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని హైకోర్టు అభిప్రాయపడిందిప్రజలు మరియు వైద్య సిబ్బందిలో డెంగీ పై అవసరమైన అవగాహన లేకనే వ్యాధి ప్రబలుతోందని, డెంగీ జ్వరం నివారణకు తీసుకున్న చర్యలేమిటో తెలియజేయాలని అభ్యర్థిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా , కొంపల్లికి చెందిన డాక్టర్ ఎం.కరుణ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### ఐఏఎస్‌లపై హైకోర్టు ఆగ్రహం..

డెంగీ నివారణకు అధికారులు దీర్ఘకాలిక నివారణ చర్యలు తీసుకోలేదనికేవలం కంటితుడుపు చర్యలు చేపట్టారని సీనియర్ అధికారులపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను తేలికగా తీసుకుంటున్న ఐఏఎస్ అధికారుల జీతాల నుంచి డెంగీ జ్వరం వల్ల మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశిస్తామని హైకోర్టు తెల్చి చెప్పింది. మీరు దేశ పౌరులు కాదని భావిస్తున్నారా అని హైకోర్టు ఐఏఎస్ అధికారులను ప్రశ్నించింది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి శిక్షణ ఇప్పించి మిమ్మల్ని ఐఏఎస్‌లుగా తీర్చదిద్దితే మీరు ప్రజలకు ఏం సేవ చేస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

### పటిష్ఠ చర్యలు తీసుకున్నాం

డెంగీ నివారణ కోసం ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకుందని తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ విన్నవించారు. జిల్లాల్లో ఎల్ఆర్ఎస్ పథకం కింద 4600 స్వచ్ఛ ఆటోలను కొనుగోలుచేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం జిల్లా కలెక్టర్లకు అధికారాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ ఆటోలు చెత్త, వ్యర్థ పదార్థాలను తరలిస్తాయని పేర్కొన్నారు. జంటనగరాల్లో చెత్త 3500 టన్నుల నుంచి 4000 టన్నులకు పెరిగిందని, త్వరలో అది 7000 టన్నులకు చేరే అవకాశముందన్నారు. అలాగే ఈ చెత్త వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు ఓ ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

## సహకార సంఘాల రైతులకు ఊరట

- ఫలించిన వినోద్‌కుమార్ ప్రయత్నం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** కమర్షియల్ బ్యాంకుల నుంచి ప్రాథమిక సహకార సంఘాలు తీసుకున్న రుణాల వడ్డీ రేటుపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ పెంపు నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ కేంద్ర ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా ప్రాథమిక సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులపై వడ్డీభారం తగ్గి లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రిజర్వు బ్యాంకు జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా ప్రాథమిక సహకార సంఘాలపై వడ్డీ భారం పడుతుందని గ్రహించిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్, గత నెలలో కేంద్ర వ్యవసాయశాఖ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయశాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్‌ను కలిసి సమస్య గురించి వివరించారు. కమర్షియల్ బ్యాంకులు ఇచ్చే రుణాల వడ్డీ పెంపుతో రైతులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే వడ్డీ రాయితీ వర్తించదని, తద్వారా రైతులపై అధిక వడ్డీభారం పడి మరింత ఇబ్బందులకు గురవుతారని స్పష్టం చేశారు. సానుకూలంగా స్పందించిన ఆర్థిక శాఖ ఆ మేరకు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంపై బి. వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## టీఎస్ ఈఆర్సీ ఛైర్మన్ తన్నీర్ శ్రీరంగారావు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ ఛైర్మన్‌గా తన్నీరు శ్రీరంగారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రముఖ న్యాయవాది శ్రీరంగారావు తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర అడ్వకేట్స్ జేఏసీ కన్వనీర్‌గా పనిచేశారు. ఈఆర్సీలో మరో ఇద్దరు సభ్యులను కూడా ప్రభుత్వం నియమించింది. టెక్నికల్ మెంబర్‌గా ఎండి మనోహర్ రాజు,ఫైనాన్స్ మెంబర్‌గా బండారు కృష్ణయ్య నియమితులయ్యారు.రాష్ట్ర విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ మిశ్రా గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈఆర్సీ ఛైర్మన్‌గా నియమితులైన శ్రీరంగారావును గురువారం పలువురు న్యాయవాదులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## రబీకి ఎరువులను సిద్ధం చేయండి

- అధికారులకు పార్థసారధి ఆదేశం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రానున్న రబీ సీజన్‌లో రైతాంగానికి తగినంతగా ఎరువులను సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, గంగవరం నౌకాశ్రయాల నుంచి దిగుమతి చేసుకున్న ఎరువులను సకాలంలో జిల్లాల్లోని స్టాక్ పాయింట్లకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై గురువారం వివిధ ఎరువుల కంపెనీల ప్రతినిధులు, రైల్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రబీలోనూ ఎరువుల అవసరం పెరుగుతుందని, ఆ ప్రకారం అంచనాలు రూపొందించాలన్నారు. నవంబర్ నెలకు సంబంధించిన బఫర్‌స్టాక్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాల సంఖ్య పెరిగినందున ఆ ప్రకారం రైల్వే ర్యాక్ పాయింట్లను 33కు పెంచాలన్నారు. ఎరువుల పంపిణీని సులభతరం చేసేందుకు జమ్మికుంట, మహబూబాబాద్, జహీరాబాద్, చిట్యాల, వంగపల్లి తాండూరు ర్యాక్ పాయింట్లను దిగుమతి కొరకు వినియోగంలోకి తీసుకురావాలని రైల్వే అధికారులను కోరారు.

# పెండింగ్ పాస్‌పుస్తకాలు పంపిణీ

- రైతాంగానికి చేరుతున్న కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు
- పెండింగ్ లేకుండా ఆదేశాలు జారీ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పంపిణీ చేయని తప్పులున్న పాస్‌పుస్తకాల పునః ముద్రణ జరిపి రైతాంగానికి చేరవేసేలా సర్కార్ చర్యలు ఆరంభించింది. రైతులకు అందించేందుకు 3,07,640 పాస్ పుస్తకాలు తప్పులు సరిదిద్దుకుని వివిధ జిల్లాల్లో పంపిణీ పూర్తయినట్లు తెలిసింది. ప్రధానంగా ఆధార్ తప్పులు 18,206 పాస్ పుస్తకాల్లో దొర్లగా, ఫోటోల తప్పులు 37,133 పాస్ పుస్తకాల్లో బైటపడ్డాయి. డబుల్ ఖాతాలు 34,815 వెల్లడికాగా, అధిక విస్తీర్ణం పడిన ఖాతాలు 37,998, తగ్గినవి 45,803, సర్వే నెంబర్ల తప్పు పడినవి 12,682, పట్టాదారుల పేర్లు తప్పుగా వచ్చిన 17,069, తండ్రిపేరు తప్పుగా నమోదైన 11,306 పాస్ పుస్తకాలను తిరిగి ముద్రించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇబ్బందులెదురయ్యాయి. అన్ని రికార్డులు సవ్యంగా ఉన్నా పట్టాదార్ పాస్ పుస్తకాల్లో తప్పుల కారణంగా రాష్ట్రంలో నిల్చిపోయిన దాదాపు 3 లక్షల మంది రైతులు కొత్త పాస్ పుస్తకాలు పొందేందుకు సర్వం సిద్దమవుతోంది. విస్తీర్ణం, పేర్లలో అచ్చు తప్పులు, వయసు, లింగ భేదాల, ఫోటోల తప్పులు వంటివాటిలో తప్పులను సవరిస్తున్నారు.

రాష్ట్రంలోని 72 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలకుగానూ 57లక్షలే ప్రింట్ చేయాలని ఆర్డర్ ఇచ్చారు. వీటిలో దాదాపు 3లక్షల మందికి చెందిన పాస్ పుస్తకాలు తిరిగి సీసీఎల్ఏకు చేరగా, వాటిలోని తప్పులను సరిదిద్ది తిరిగి రీ ప్రింట్ చేయించారు. ఇక వీటి పంపిణీతో రాష్ట్రంలో 57,33,025 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందే అవకాశం కల్గనుంది. అయితే ఇందులో ఆధార్ సీడింగ్, ఫోటో, వేలిముద్రలు వంటి అనేక కారణాలతో 49,93,619 పాస్ పుస్తకాలను మాత్రమే ముద్రిస్తున్నారు. ఆధార్ నెంబర్ ఇవ్వని వారికి పాస్ పుస్తకాలను ఇవ్వవద్దని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడంతో వాటిని పంపిణీ చేయడంలేదు. అవి కాకుండా మరో 7,39,406 పాస్ పుస్తకాలను ముద్రించాల్సి ఉంది. వివాదాలులేని 67,87,228 ఖాతాలకు చెందిన 2,21, 65,130 ఎకరాల భూమికి చెందిన పాస్ ఇప్పటివరకు 51.50 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ కాగా, మిగతావాటికి ఎన్నికల కోడ్, గతేడాది అక్టోబర్‌నుంచి ముందస్తు ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియ నిల్చి పోగా, అంతకు నెలముందే తహశీల్దార్ల బదలీలతో డిజిటల్ సంతకాలు నిలిపివేశారు. పంపిణీ చేసిన పాస్ పుస్తకాల్లోని 9లక్షల పుస్తకాల్లో తప్పులు దొర్లాయి. వాటిని కూడా ఇంకా సరిచేయలేదు.

రైతుబంధు పథకం ప్రయోజనం పొందేందుకు పాస్ పుస్తకం తప్పనిసరి చేయడంతో పట్టాదార్ పాస్ పుస్తకం అందని రైతులు ఈ ప్రయోజనం పొందడం లేదు. మొదటి విడత రైతుబంధు పథకంలో రైతు వివరాలు వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో ఉంటే పాస్ పుస్తకం లేకున్నా చెక్కులిచ్చారు. కానీ ఇప్పుడు ఈ వెసులుబాటును ఎత్తివేయడంతో పాస్ పుస్తకాలు లేని రైతాంగానికి ప్రభుత్వ సాయం నిల్చిపోయింది.

## దుబ్బాకలో కేంద్రమంత్రి రూపాల పర్యటన



**దుబ్బాక, ప్రభన్యూస్:** దుబ్బాకలో గురువారం నాడు కేంద్ర వ్యవసాయ శాఖా సహాయ మంత్రి పురుషోత్తం రూపాల పర్యటించారు. బీజేపీ నేత రఘునందన్ రావు చేపట్టిన గాంధీ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు విచ్చేసిన మంత్రి రూపాల దుబ్బాకలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాలు కొనసాగించాలనే ఉద్దేశంతో 150 వ జయంతిని పురస్కరించుకుని గాంధీజి జయంత్యుత్సవాలు దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు దృష్టి సారించి, పచ్చదనాన్ని పరి రక్షించాలన్నారు. చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ, మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అక్కడి నుంచి కార్యకర్తలతో కలిసి, పాద యాత్రగా దుబ్బాక సర్కారు దవాఖానకు విచ్చేశారు. దవాఖాన ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం దుబ్బాక చేనేత కార్మికుల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. చేనేత సహకార సంఘంలో తయారవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలిం చారు. వస్త్రాల తయారీ కోసం వాడే నూలును, కండెలకు దారం చుట్టే రాట్నాన్ని పరి శీలించారు. అనంతరం చేనేత కార్మికులనుద్దేశించి మాట్లాడారు. అక్కడే తనను కలిసి సమస్యలు విన్నవించుకున్న ఆర్టీసీ కార్మికుల నుంచి వినతి పత్రాన్ని స్వీకరించారు.

## గ్రూప్-2 ఫలితాలు విడుదల

- 1027 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తుది ఫలితాల కోసం ఎదురు చూస్తున్న గ్రూప్-2 అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీపి కబురు అందించింది. గ్రూప్-2లో 1027 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. పోస్టులకు ఎంపికైన వారి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో గురువారం రాత్రి పొందుపర్చారు. గ్రూప్-2 ఫలితాల కోసం గురువారం సాయంత్రం కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఫలితాలను ఆమోదించింది. గ్రూప్-2లో 1032 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో 1027 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. 4 పోస్టులకు అవసరమైన ప్రత్యేక అర్హత(స్పెషల్లీ క్వాలిఫైడ్) అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపికచేయలేదు. హైకోర్టు ఆర్డర్స్ మేరకు ఒకపోస్టుకు సంబంధించి అభ్యర్థిని ఎంపిక చేయలేదు. దీంతో మొత్తం గ్రూప్-2లో ప్రకటించిన 1032 పోస్టులకుగానూ 5 పోస్టులకు తప్ప మిగిలిన 1027 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. గ్రూప్-2 పోస్టుల్లో అత్యధికంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ పోస్టులు 284 పోస్టులు, తరువాతి స్థానంలో 259 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులున్నాయి. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టులు 19 ఉండగా.. అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్(ఏసీటీవో) పోస్టులు 156 ఉన్నాయి. మొత్తం 13 రకాల పోస్టులకు సంబంధించి 1027 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు.

## సోయాబీన్ కొనుగోళ్లను 50 శాతానికి పెంచండి

కేంద్రానికి మంత్రి నిరంజన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో సోయాబీన్ కొనుగోళ్ళను 50శాతానికి పెంచాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు లేఖ రాశారు. మద్దతు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆసక్తి పెంచుకుని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్ళు 30.21 శాతం ఏమాత్రం సరిపోదని, దీన్ని 50శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. కేంద్రం అనుకుంటున్న ప్రకారం 58,608 మెట్రిక్ టన్నులకు గానూ ఈ కొనుగోళ్ళను 96,991 మెట్రిక్ టన్నులకు పెంచాలని లేఖ ద్వారా కోరారు.

## యువత రక్తదాతలుగా మారాలి

గవర్నర్ తమిళిసై పిలుపు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో యువత రక్తదాతలుగా మారాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర విభాగం వార్షిక సమావేశంలో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ ద్వారా 2018-19లో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు అందచేసి అభినందించారు. గవర్నర్ మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ సేవలు మానవత్వానికి మారు పేరుగా నిలుస్తున్నాయన్నారు. మాన వీయ కోణం లో సేవలను విస్తరిస్తూ తన గొప్పదనాన్ని ప్రపం చానికి చాటుతోందన్నారు. 150ఏళ్ల చరిత్ర ఉన్న రెడ్ క్రాస్ ఎన్నో రకాల సేవలు అందిస్తు ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1920లోనే నిజాం రెడ్‌క్రాస్ ఏర్పాటైందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రెడ్ క్రాస్ శాఖలు విస్తరించాయన్నారు.

## పొడెం వీరయ్యకు కొత్తగూడెం జిల్లా కమిటీ

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** భద్రాచలం ఎమ్మెల్యే పొడెం వీరయ్యకు కొత్తగూడెం జిల్లా కమిటీ బాధ్యతలు అప్పగిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే బొంతల రాజేష్‌ను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యుఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగ మధు యాదవ్‌ను, హిమాచల్ ప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చత్తర్ సింగ్ ఠాకూర్‌ను ఏఐసీసీ నియమించింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న పార్టీ పదవులను ఏఐసీసీ భర్తీ చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా తెలుగు రాష్ట్రాల్లో కొన్ని పదవులను భర్తీ చేసింది.

## యునానీ వైద్యుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వైద్య, ఆరోగ్య శాఖలోని ఆయూష్ విభాగంలో గల యునానీ వైద్యుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గత ఐదేళ్లుగా యూనానీ వైద్యుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని కాబట్టి వెంటనే పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు.

## షీటీమ్స్ పనితీరు భేష్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** షీటీమ్స్ పనితీరు భేషుగ్గా ఉందని హోం మంత్రి మహ మూద్ అలీ కొనియాడారు. గురువారం హైటెక్ సిటీలోని శిల్పకళావేదికపై షీటీమ్స్ 5వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహి ళల రక్షణలో షీటీమ్స్ ఏ విధంగా విధులు నిర్వర్తిస్తుందోనన్న విషయాన్ని లఘు, ప్రకటన చిత్రాల ద్వారా స్పష్టమైందన్నారు. సీఎం కేసీఆర్ మహిళల భద్రత కోసం ఆలోచించి మంచి పనిచేశారని, అది సత్ఫలితాలనందిస్తోందన్నారు. సేఫ్టీ అండ్ సెక్యూరిటీలో హైదరాబాద్ ప్రథమస్థానంలో ఉందన్నారు. పోలీసు శాఖకు సీఎం కేసీఆర్ ఆది నుంచి ప్రాధాన్యతనిస్తూ వచ్చారన్నారు. నిధులను కేటాయిస్తున్నారన్నారు.

### కృతజ్ఞతలు తెలిపిన పీవీ సింధు, సమంత, మంచులక్ష్మి

షీటీమ్స్‌కు సినీ నటి సమంత కృతజ్ఞతలు తెలిపింది. ట్విట్టర్‌లో ఇదో అద్భుతమని వ్యాఖ్యానించింది. పోకిరీలను నిలువరించడంలో విశేషమైన కృషి చేస్తున్న షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయనున్నామని బుధవారం రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, నటి మంచు లక్ష్మిలు సైతం ట్విట్టర్ ద్వారా షీటీమ్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# తక్కువ ధరకు విక్రయిస్తే నో ఫైన్

- మిగిలిపోయిన మద్యం దుకాణాలకు 382 దరఖాస్తులు
- ఇంకా రెండు రోజుల గడువు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో తక్కువ దరఖాస్తులు వచ్చిన 29 మద్యం దుకాణాలకు మరో దఫా దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అనుమానాస్పద స్థితిలో అతి తక్కువ దరఖాస్తులు వచ్చిన ఈ 29 మద్యం దుకాణాలను గడువులోగా లాటరీలను పూర్తిచేసి వచ్చే నెల 1న తెరిపించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తాజాగా 29 మద్యం దుకాణాలకు 382 దరఖాస్తులురాగా, మరో 2 రోజులపాటు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇప్పటికే దరఖాస్తుల రూపంలో రూ.7.64 కోట్ల రాబడి రాగా, గతంలో 48,784 దరఖాస్తుల్లో రూ. 975.68 కోట్ల రాబడి ఖజానాకు చేరింది. నవంబర్ 1నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి రానుండగా ఇప్పటికే లైసెన్సుల జారీ ప్రక్రియ ఆరంభమైంది. 2019-2020లో వినియోగదారులపై ఎటువంటి ప్రభావం చూపకుండా రూ. 1467 కోట్ల రాబడి అధికంగా వసూలైంది. ఒక్క దరఖాస్తుల రూపంలోనే రూ. 463 కోట్ల రాబడి అదనంగా సమకూరింది. బీర్లపై మద్యం మార్జిన్‌ను రూ. 200కోట్లకు పెంచుకున్న ప్రభుత్వం ఈ మేరకు వ్యాపారులకు భారీ ప్రయోజనాలను వర్తింపజేసింది. స్పెషల్ రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూపంలో రూ. 111కోట్లు వస్తాయని భావిస్తోం ది. స్లాబ్ రేట్లను పెంచుకోవడం ద్వారా మరో రూ. 152 కోట్లు ఖజానాకు అదనంగా సమకూరుతాయని అంచనా వేసుకున్నారు.

సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నూతన పాలసీలో విధానపరమైన నిర్ణయాలను పకడ్బందీ చేయనున్నా రు. ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు మద్యం విక్రయిస్తే ఇదివరకు ఉన్న జరిమానాను పూర్తిగా ఎత్తివేశారు. తద్వారా మద్యం ప్రియులకు మరింత తక్కువ ధరకు మద్యం అందుబాటులోకి వచ్చే అవ కాశం ఉంది.

జీహెచ్ఎంసీలో రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలను నిర్వహించుకునేలా సమయాన్ని పెంచిన ప్రభుత్వం అదే ఒరవడితో వ్యాపారులకూ పలు ప్రయోజనాలను వర్తింప జేసింది. భారీగా వ్యాపారులను ఆకర్షించే లక్ష్యంతో నవంబర్ 1నుంచి 2021 అక్టోబర్ 31వరకు అమలులో ఉండనున్న ఈ పాలసీలో 2216 మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులురాగా, 29 దుకాణాలకు తక్కువగా దరఖాస్తులొచ్చాయి.

వ్యాపారులకు ఊరట కల్గించేలా టెండర్‌తోపాటే సమర్పించే దరావత్తు మొత్తాన్ని (ఈఎండి) రూ. 5 లక్షలనుంచి రూ. 2లక్షలకు తగ్గించడంతోపాటు, లైసెన్సు రుసుములకు గతంలోఉన్న 6 వాయిదాలను 8 వాయిదాలకు పెంచుతూ వ్యాపారులనుంచి పెద్ద మొత్తంలో స్పందన వచ్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

గతంలో నాలుగు స్లాబులను 2011 జనాభా ఆధారంగా 6 స్లాబులకు పెంచడంతోపాటు, గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాలకు దుకాణాల పనివేళలు ఉదయం 10నుంచి రాత్రి 11 గంటలవరకు, మిగిలిన ప్రాంతాల్లో ఉదయం 10నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతించింది.

## నిర్మాత బండ్ల గణేష్‌కు బెయిల్ మంజూరు

**కడప క్రైం, ప్రభన్యూస్:** ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్‌బాబుకు కడప మొబైల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బుధవారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లో అరెస్ట్ అయిన బండ్ల గణేష్‌బాబును కడప కోర్టులో గురువారం హాజరుపరచగా నవంబర్ 4 వరకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అనంతరం బండ్ల గణేష్‌బాబు న్యాయవాది బాధితులతో రాజీయత్నాలు చేయడంతో ఆ ప్రయత్నాలు ఫలితాన్ని ఇచ్చాయి. బాకీ సొమ్ములో సుమారు రూ.4 లక్షలు చెల్లించి, మిగతా సొమ్మును 14నాటికి చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఒప్పందం కుదరడంతో బెయిల్ పిటిషన్‌ను గణేష్ న్యాయవాది కోర్టులో దాఖలు చేశారు. పరిశీలించిన మేజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేశారు. కడప కోర్టులో పది లక్షల చెక్ బౌన్స్‌కు సంబంధించి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కాగా బండ్ల గణేష్‌ను కడప కోర్టులో జూబ్లీహిల్స్ పోలీసులు హాజరు పరిచారు.

## 'విద్యావాలంటీర్లను తొలగించొద్దు'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులను భర్తీ చేస్తున్నందున ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న విద్యా వాలంటీర్లను తొలగిస్తున్నారని తెలంగాణ విద్యా వాలంటీర్ల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం జరుగుతున్నందున ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న విద్యా వాలంటీర్లను తొలగించకుండా ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలని సంఘం నేతలు గురువారం విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## 'బీసీల రాజకీయ రిజర్వేషన్లకు తోడ్పడండి'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వెనుకబడిన తరగతుల వారికి చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించడం కోసం సహకరించాలని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయకు బీసీ సంక్షేమ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. సంఘం తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు సురేష్, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ నేతలు చాపర్తి కుమారస్వామి, భూపేష్‌సాగర్, గజేందర్ తదితరులు గురు వారం బండారు దత్తాత్రేయను కలిసి విజ్ఞప్తి చేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీతోపాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోనూ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని నేతలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

## రజకుల సామూహిక గ్రామబహిష్కరణ

- కర్నూలు జిల్లాలో ఘటన

**గోనెగండ్ల, ప్రభన్యూస్ :** కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామంలో 12 రజకుల కుటుంబాలు గ్రామ బహిష్కరణకు గురయ్యాయి. ఏడేళ్లుగా రజక వృత్తిని వదిలేసి సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. రజక వృత్తినే కొనసాగించాలంటూ అగ్రవర్ణాలు వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. పంచాయితీ పెట్టి మరీ ఆదేశించారు. అయినా రజకులు పట్టువదల్లేదు. దీంతో ఆగ్రహించిన అగ్రవర్ణాలు.. రజకులకు ఎలాంటి సాయం చేయవద్దని హుకుం జారీ చేశారు. ఆ విషయమై గ్రామంలో దండోరా కూడా వేయించారు. దీంతో మూడు రోజులుగా రజకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఇరు వర్గాలతో మాట్లాడామని, రజక వృత్తి చేయాలని కొందరు కోరారని, కానీ తమను గ్రామ బహిష్కరణ చేసినట్టు రజకులు చెబుతున్నారని ఎస్ఐ హనుమంతరెడ్డి వివరణ ఇచ్చారు.

## 'ఉపాధి హామీ' అవార్డులకు సర్వం సిద్ధం

- కమిటీ ముందు తెలంగాణ కలెక్టర్ల ప్రజెంటేషన్

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడంలో అత్యున్నతంగా నిలిచిన జిల్లాలు, రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం త్వరలో అవార్డులను ప్రకటించనుంది. ఆయా జిల్లాల కలెక్టర్లను కమిటీ దేశ రాజధాని ఢిల్లీకి పిలిపించి నివేదికలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వాల్సిందిగా కోరింది. ఈ నెల 21న సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించిన కమిటీ, నేటి వరకు వివిధ రాష్ట్రాల్లో పలు జిల్లాల కలెక్టర్లతో సంప్రదింపులు జరుపుతుంది. అనంతరం ఆ జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అవార్డులకు ఎంపిక చేయనుంది. ఇందులో భాగంగా అవార్డుల కమిటీ గురువారం ఢిల్లీలోని ఇండియన్ హ్యాబిటేట్ సెంటర్‌లో తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, త్రిపుర రాష్ట్రాలలోని జిల్లాల నివేదికలను పరిశీలించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో మొదటి 3 స్థానాల్లో నిలిచిన జిల్లాల పాలనాధికారులను అవార్డుల కమిటీ ఆహ్వానించింది. ఉపాధి హామీ పథకం పనులపై రాజన్న కలెక్టర్ కృష్ణ భాస్కర్, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామి రెడ్డి, నిర్మల్ కలెక్టర్ ప్రశాంతి కమిటీ ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉపాధి హామీ పథకానికి కూలీ చెల్లింపు, పురుషులతో మహిళలకు సమాన కూలీ, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలు వంటి అంశాలను కమిటీ అడిగి తెలుసుకుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ తెలిపారు.

## ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణరెడ్డి



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ మద్య విమోచన ప్రచార కమిటీని ప్రభుత్వం నియ మించింది. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణ రెడ్డిని ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించిన ప్రభుత్వం, సభ్య కార్యదర్శిగా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ కమిషనర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్, గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ సీఈవో, ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఉంటారు. ప్రకాశం జిల్లా కారుమంచి గ్రామంలో 1955లో జన్మించిన లక్ష్మణ రెడ్డి నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో పీజీ చేశారు. 1978-79 మధ్య కాలంలో నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘం కార్యదర్శిగా ఎన్నికైన లక్ష్మణ రెడ్డి 1980లో గుంటూరు జేకేసీ కాలేజీలో అర్థశాస్త్ర అధ్యాపకునిగా చేరారు. అప్పటి నుంచి 2009 వరకు అర్థశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తూ నాలుగేళ్ల ముందు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. 1980లో గుంటూరులో ప్రజాచైతన్య వేదికను ఏర్పాటు చేసి 1987 వరకు పలు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలపై ప్రజలను చైతన్యం చేసే దిశగా సదస్సులు నిర్వహించారు.

## ఆరుగురు ఉన్నతాధికారులకు పదోన్నతి

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురు ఉన్నతాధి కారులకు కేంద్రం కన్ఫర్డ్ ఐఏఎస్ లు గా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు గురువారం కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కన్ఫర్డ్ ఐఏఎస్ లుగా ఎస్.భార్గవి, బిఆర్ అంబేద్కర్, ఏ.సిరి, జే.వెంకట మురళి, ఎస్.రామ సుందర్ రెడ్డి, వి.వీర బ్రహ్మం పదోన్నతి పొందారు. వీరిని ఇండియన్ అడ్మినిస్టేటివ్ సర్వీస్ లోకి తీసుకున్నట్లుగా ఉత్తర్వులు వెలువరించింది. 2018 సంవత్సరానికి గాను వీరిని ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించింది.

# హర్యానా తీర్పు..హంగ్!

## ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అందని ఓటరు నాడి



• బీజేపీ 40, కాంగ్రెస్ 31 చోట్ల విజయ బావుటా • 10 స్థానాలతో సత్తా చాటిన జేజేపీ • 9 చోట్ల బలం చాటుకున్న ఇతరులు • కింగ్‌మేకర్‌గా జేజేపీ చీఫ్ దుష్యంత్ • మద్దతు కోరిన బీజేపీ, కాంగ్రెస్ • స్పష్టత ఇవ్వని దుష్యంత్ చౌతాలా • ఉత్కంఠ కలిగిస్తున్న హర్యానా రాజకీయం

**న్యూఢిల్లీ:** ఎగ్జిట్ పోల్ అంచనాలను హర్యానా ఓటర్లు తల్లకిందులు చేశారు. మరోసారి విజయం పతాకం ఎగురవేయడం ఖాయమని ఆశలు పెట్టుకున్న కమల దళానికి షాకిచ్చారు. అధికారపీఠాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాల నుకున్న కాంగ్రెస్‌కు సీట్లు కట్టబెట్టలేదు. హర్యానా ఓటరు తీర్పు హంగ్ ప్రభుత్వాన్ని అనివార్యం చేసింది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 40, కాంగ్రెస్ 31, జేజేపీ 10, ఐఎన్‌ఎల్‌డీ, అకాళీదల్ కూటమి, ఇతరులు మొత్తం 9 స్థానాలను కైవసం చేసుకుని సత్తాచట్టారు. దీంతో హర్యానాలో హంగ్ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి అనివార్యమైంది. జాట్ల ప్రధాన బలంతో తొలిసారి అసెంబ్లీ బరిలో నిలిచి 10 అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకోవడంతో యువనేత దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) ప్రభుత్వ ఏర్పాటులో ముఖ్యభూమిక పోషించనుంది. దుష్యంత్ చౌతాలా కింగ్‌మేకర్ కానున్నారు. అయితే కాంగ్రెస్, బీజేపీల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలనే విషయంలో జేజేపీ ఇంతవరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దుష్యంత్ చౌతాలా గురువారం మీడియా మాట్లాడారు. ఎవరికి మద్దతివ్వాలి, శాసనసభలో పార్టీ అధ్యక్షునిగా ఎవరిని ఎన్నుకోవాలనే విషయాలను పార్టీ ఎమ్మెల్యేలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టతనిచ్చారు. హంగ్ ట్రెండింగ్ తరుణంలో మాట్లాడిన ఆయన పూర్తి ఫలితాలు వెలువడుకముందే మాట్లాడడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా 40 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ ఊహించని నిరాశ ఎదురైంది.

ఈసారి 75 పైగానే సీట్లు అనే నినాదంతోబరిలోకి దిగిన కషాయదళానికి జాట్ల రూపంలో భారీ దెబ్బతగింది. జాట్ ఓటర్లంతా జేజేపీకి మద్దతిచ్చారు. దీంతో బీజేపీ గెలవాల్సిన పలు చోట్ల జేజేపీ అభ్యర్థులు విజయ బావుటా ఎగురవేశారు.దీంతో తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన జేజేపీ ఏకంగా 10 స్థానాలను గెలుచుకుని ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించబోతోంది.

### జేజేపీ మద్దతుపై బీజేపీ విశ్వాసం

జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా మద్దతుతో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. బీజేపీకే జేజేపీ మద్దతిచ్చే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు

విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. 40 సీట్లు గెలుపొందిన బీజేపీ వైపే ఆయన మద్దతిస్తారని అంటు న్నాయి. అయితే ఈ వార్తలపై దుష్యంత్ చౌతాలా నుంచి ఇంకా ఎలాంటి స్పష్టత వెలువడలేదు. అయితే ఫలితాల ట్రెండ్‌ను గమనిం చిన బీజేపీ అధిష్ఠానం స్వతంత్ర అభ్యర్థులను కాపాడుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిం ది. ఇప్పటికే ఒకరిద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దుతు ప్రకటించారు. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరేందుకు రాష్ట్ర గవర్నర్ కోరేందుకు ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ప్రయత్నించారు. కానీ గవర్నర్‌ను ఆయన కలవలేదు. గవర్నర్‌ను ఎప్పుడు కలవనున్నారనే అంశంపై స్పష్టత రాలేదు. ఫలితాల ట్రెండ్ నేపథ్యంలో సీఎం మనోహర్ లాల్ ఖట్టర్‌ను హుటాహుటిన ఢిల్లీ రావాల్సిందిగా ఆదేశించిందని వార్తలు వచ్చాయి.

### దుష్యంత్ .. 'కింగ్'మేకర్!

దుష్యంత్ చౌతాలా.. హర్యానాలో హంగ్ పరిస్థితులు అనివార్యమవ్వడంతో దేశవ్యాప్తంగా వినిపిస్తున్న పేరిది. జేజేపీ చీఫ్‌గా ఉన్న ఆయన మద్దతు కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నాయి. అవసరమైన ముఖ్యమంత్రి పదవినైనా ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఆఫర్ చేసిందని వార్తలు వెలువడ్డాయి. దీంతో దుష్యంత్ చౌతాలా కింగా లేదా కింగ్‌మేకరా అనే అంశం రాజకీయవర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అయితే ఏ పార్టీకి మద్దతు ఇచ్చే విషయాన్ని దుష్యంత్ చౌతాలా స్పష్టం చేయకపో



వడంతో ఉత్కంఠ నెలకొం ది. హంగ్ ఏర్పడే పరిస్థితులు ఖాయమని ఫలితాల ట్రెండింగ్ సమయంలో మీడియాతో మాట్లాడిన దుష్యంత్ చౌతాలా స్పష్టతని వ్వలేదు. ఎవరికి మద్దతివ్వాలి, సభలో పార్టీ నాయకుడిగా ఎవరిని ఎన్నుకోవాల ని విష యాలను పార్టీ ఎమ్మెల్యేలతో చర్చించిన తర్వాత నిర్ణయం వెలువరిస్తానన్నారు. పూర్తి ఫలితాలు వెల్లడవ్వక ముందే మాట్లాడ డం సబబుకాదని పేర్కొన్నారు.

### మెజారిటీ సాధిస్తాం: కాంగ్రెస్

హంగ్ ఏర్పడిన నేపథ్యంలో హర్యానా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా మీడియాతో మాట్లాడారు. మెజారిటీని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, జేజేపీ, ఐఎన్‌ఎల్‌డీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు కలిసి బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మీడియా ముఖంగా కోరారు. బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ సముచితమైన గౌరవం, స్థానం లభిస్తాయని ఆయన అన్నారు. సమయం ఇస్తే పూర్తిస్థాయి మెజారిటీ సాధిస్తామని ఆయన తెలిపారు.

### బీజేపీకి జాట్ల దెబ్బ..తగ్గిన ఓట్ల షేరు

ఏప్రిల్-మే నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటు షేరు భారీ స్థాయిలో తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో 58 శాతానికి పైగా ఓటు షేరుతో మొత్తం 10 సీట్లను బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో 36.3 శాతం ఓటు షేరును మాత్రమే బీజేపీ గెలుచుకోగలిగింది. ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంలో పనిచేసిన అనేకమంది మంత్రు లు ఓటమిని మూటగట్టుకున్నారు. ఈసారి 75పైగా స్థానాలు పైగా సాధిస్తామనే నినాదంతో బరిలోకి దిగిన బీజేపీ మెజారిటీని కూడా అందుకోలేక పోయింది. హర్యానా ఓటింగ్ తర్వాత ఎన్నికల కమిషన్ గణాంకాలను విడుదల చేసింది. బీజేపీ 36.3 శాతం ఓటు షేరుతో 40 సీట్లను గెలుచుకుంది. బీజేపీ ఓటు షేరు తగ్గడానికి ప్రధాన కారణంగా జాట్ సామాజికవర్గం ఓటర్లు దెబ్బకొట్టడమే. వీరంతా దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీకి మద్దతిచ్చారు. జాటేతరుడైన మనోహర్‌లాల్ ఖట్టర్ పోయినసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఈసారి ఎలాగైన జాట్ వ్యక్తిని సీఎం చేయాలనే ఉద్దేశంతో జాట్ వర్గానికి చెందిన దుష్యంత్ చౌతాలాకు దన్నుగా నిలిచారు.

### కాంగ్రెస్ ఓటు బ్యాంక్ మారలేదు

బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఓటు షేరులో పెద్దగా మార్పులేదు. లోక్‌సభ ఎన్నికల్లో 28.42 శాతం ఓటు బ్యాంకును పొందిన కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో 28.2 శాతం ఓట్ల శాతంతో సరిపుచ్చుకుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను ప్రదర్శించింది. కాంగ్రెస్, బీజేపీలను మినహాయిస్తే ఇతరులు 27.4 శాతం, బీఎస్పీ 4.07 శాతం, ఐఎన్‌ఎల్‌డీ 2.41 శాతం ఓటు షేరును పొందాయి.

### మంత్రులకూ తప్పని ఓటమి

హర్యానా కేబినెట్‌లో ముఖ్యమంత్రి ఖట్టర్ తోపాటు మొత్తం 9 మంది ఉన్నారు. వీరిలో సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, మంత్రి అనిల్ విజ్ మినహా మిగతావారంతా ఓడిపో యారు.కెప్టెన్ అభిమన్యు, ఓపీ ధన్‌కర్, రాంబిలాస్ శర్మ, క్రిషన్ లాల్ పన్వార్, మనీష్ గ్రోవర్, క్రిషన్ కుమార్ బేడీ ఓటమిని చవిచూశారు.

### అంతిమ నిర్ణయం అమిత్ షాదే



మహారాష్ట్ర, హర్యానాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం, స్వేచ్ఛ అధ్యక్షుడు అమిత్ షాకే ఆ పార్టీ అప్పగించింది. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ అమిత్‌షాకు అధికారులు ఇచ్చింది. ఇరు రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధాని మోడీ, అమిత్ షాతోపాటు పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. అయితే ఇరు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకే పార్టీలో నిర్ణయాలు ఉంటాయంటున్నాయి.



## మహారాష్ట్ర, హర్యానా ఫలితాలు
# బీజేపీకి గుణపాఠం
### వ్యతిరేక శక్తులు కలిసొస్తే ఓడించడం సాధ్యం: సీపీఐ

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అధికార భారతీ య జనతా పార్టీకి గుణపాఠం అని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) పేర్కొంది. ప్రజల భావోద్వేగాలతో పబ్బం గడుపుదాం అనుకున్న బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని ఆ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ప్రజల్ని తక్కువ అంచనా వేయొద్దని ఈ ఫలితాలు రుజువు చేశాయని తెలిపింది. అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఈ ఫలితాలు ఒక జవాబుగా నిలిచాయని సీపీఐ స్పష్టం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా ఈ అంశాన్నే ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రం చేసుకుని ప్రతి సభలోనూ ప్రస్తావించారని సీపీఐ గుర్తుచేసింది. అయినా సరే బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించలేక బోల్తాపడిందని ఎద్దేవా చేసింది. ఈ ఫలితాలు భారత ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణిస్తూ, ప్రతిపక్షాల విజయంగా చిత్రీకరించింది. ప్రతిపక్షాలు కలిసికట్టుగా పోరాడితే బీజేపీని ఓడించడం సాధ్యమేనని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని సీపీఐ ప్రకటనలో పేర్కొంది. బీజేపీ పతనం ప్రారంభమైందనడానికి ఈ ఫలితాలు ఒక నిదర్శనమని, దీన్నొక పాఠంగా లెఫ్ట్ పార్టీలు తీసుకుని బీజేపీఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేక శక్తులను ఏకం చేసే ప్రయత్నాలు మొదలు పెట్టాలని సూచించింది.

## జమ్మూకాశ్మీర్లో ఆంక్షలు ఇంకెన్నిరోజులు?
### కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూ కాశ్మీర్‌లో విధించి న ఆంక్షలపై సుప్రీంకోర్టు గురువారం కేంద్రాన్ని ప్రశ్నించింది. జమ్మూ కాశ్మీర్‌లో ఇంకెన్ని రోజులు ఆంక్షలని ప్రశ్నిస్తూ ఇప్పటికే రెండు నెలలుకు పైగా ఆంక్షలు అమలు అవుతున్నా యని దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం కోరింది. జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తులు ధర్మాసనం కోరింది. ధర్మాసనం వ్యాఖ్యలపై స్పందించిన కేంద్రం జమ్మూ కాశ్మీర్లో 90శాతానికిపైగా ఆంక్షలు ఎత్తివేసినట్టు తెలిపింది.

## ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు శిక్షణ



**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ప్రాథమిక స్థాయిలో పనిచేసే ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వైద్యచికిత్సలపై ప్రజల్లో ప్రచారం చేసేవిదంగా ఉన్నత శిక్షణ ఇవ్వాలని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిభారం అధారంగా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. గురువారం ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై సమీక్ష జరిపారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా:శ్రీనివాస్ రావు, పది జిల్లాల సీనియర్ డేటా ప్రోగ్రామింగ్ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. జబ్బులు వచ్చిన తరువాత కంటే రాకుండా ఉండే మార్గాలపై ప్రజలను చైతన్య పరచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను చైతన్యపరిచే ఏ.ఎన్.ఎం లు, ఆశా వర్కర్లు సంఘంలో గౌరవ ప్రదమైన స్థానం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## 'కర్తార్‌పూర్ ఒప్పందం'పై
# భారత్- పాక్ సంతకాలు

• ప్రతిరోజూ 5 వేలమంది యాత్రికులకు అనుమతి
• తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకూ ఏడాది పొడవునా ఓపెన్ • వీసా లేకుండానే సందర్శన • పాక్ సర్వీస్‌ఛార్జ్‌పై భిన్నాభిప్రాయాలు
• నవంబర్ 9న కారిడార్‌ను ప్రారంభించనున్న ఇమ్రాన్‌ఖాన్, మోడీ



**గురుదాస్‌పూర్:** పాకిస్థాన్‌లోని పవిత్ర దర్బార్ సాహిబ్‌ను భారత సిక్కు యాత్రికులు సందర్శించడానికి పాక్‌తో కర్తార్‌పూర్ కారిడార్‌పై భారత్ గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. సరిహద్దు పట్టణమైన గురుదాస్‌పూర్‌లో డేరా బాబా నానక్ సమీపంలో జీరో పాయింట్ వద్ద పాకిస్థాన్ అధికారులు, భారత్ అధికారులు సమావేశమయ్యారు. ఇరుదేశాలు కర్తార్‌పూర్ కారిడార్ ఒప్పందంపై సంతకం చేయడంతో కారిడార్ ప్రారంభానికి కీలకమైన చట్టపరమైన అడ్డంకి తొలగింది. పాకిస్థాన్‌లోని ప్రావిన్స్‌లో నారోవాల్ జిల్లాలో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు నుంచి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్‌తో పంజాబ్‌లోని డేరా బాబా నానక్ మందిరాన్ని ఈ కారిడార్ కలుపుతుంది. సిక్కు మత స్థాపకుడు గురు నానక్ దేవ్ తన జీవితంలో చివరి పద్దెనిమిది సంవత్సరాలు పాకిస్థాన్‌లో ఉన్న దర్బార్ సాహిబ్‌లో గడిపారని సిక్కులు విశ్వసిస్తారు. అన్ని మతాలుకు చెందిన భారతీయ యాత్రికులు, భారతీయ సంతతికి చెందిన వ్యక్తులు కర్తార్‌పూర్ కారిడార్‌ను ఉపయోగించవచ్చు. వీసా రహితంగా ప్రయాణించవచ్చు. యాత్రికులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టును మాత్రమే తీసుకువెళ్లాలని (అంతర్గత భద్రత) సంయుక్త కార్యదర్శి సీఎల్ దాస్ ఒప్పందంపై సంతకాలు అనంతరం తెలిపారు. గురుద్వారా ప్రాంగణంలో విడిది, ప్రసాదం పంపిణీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాకిస్థాన్ అంగీకరించింది. తమవైపు హైవే అండ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనంతో సహా కారిడార్ సకాలంలో ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తయ్యాయని పాక్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ కారిడార్ తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ తెరిచి ఉంటుందని ఆయన తెలిపారు. నోటిఫైడ్ రోజుల్లో తప్ప కారిడార్ ఏడాది పొడవునా తెరిచి ఉంచుతామని, వాటిని కూడా ముందుగానే తెలియజేస్తామన్నారు. కాగా నాలుగు కిలోమీటర్ల సరిహద్దు కారిడార్ ద్వారా గురుద్వార్ దర్బార్ సాహిబ్‌కు భారతీయ యాత్రికులు వీసా రహిత ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో ఒప్పందం కుదుర్చుకునే తేదీగా న్యూఢిల్లీ, ఇస్లామాబాద్ అక్టోబర్ 23ను తొలుత నిర్ణయించాయి.

### గరిష్ఠంగా రూ.11వేలకు అనుమతి

యాత్రికులు పాటించవలసిన నియమ, నిబంధనలు హోం మంత్రిత్వశాఖ జారీ చేసింది. 13 సంవత్సరాలు కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు, 75 సంవత్సరాలు కంటే అధికంగా ఉన్న వృద్ధులును ఒంటరిగా కాకుండా సంరక్షకులతోపాటు ప్రయాణించాలి. కర్తార్‌పూర్‌లోని గురుద్వారాను సందర్శించాలనుకునే యాత్రికులు తమతోపాటు గరిష్ఠంగా 11వేల రూపాయలు, ఏడు కిలోల లగేజీకి మాత్రమే అనుమతిస్తారు. గురుద్వారాను దాటి ముందుకు వెళ్లేందుకు సందర్శకులను అనుమతించరు. కర్తార్‌పూర్ సాహిబ్‌ను మాత్రమే సందర్శనకు అనుమతి ఉంటుంది. ఇతర ఏ ప్రాంతాలకు వెళ్లేందుకు పాక్ అధికారులు అంగీకరించరు. పర్యావరణ అనుకూల పదార్థాలు, గుడ్డ సంచులు తీర్థయాత్రలో యాత్రికులు వాడాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. యాత్రికులుఆన్‌లైన్లో పీఆర్ఏకేఏఎస్‌హె చ్‌పీయూ ఆర్‌బీ 550.ఎంహెచ్‌ఏ.జీఓవీ.ఇన్‌లో ముందుగానే నమోదు చేసుకోవాలి. దరఖాస్తుదారుడు ప్రతిపాదిత ప్రయాణతేదీని ముందుగా తాను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం రిజిస్ట్రేషన్ చేసుకున్నంత మాత్రాన ప్రయాణించే హక్కును పొందినట్టు కాదని హోం మంత్రిత్వశాఖ తెలిపింది. యాత్రికులకు మూడు రోజుల ముందుగానే రిజిస్ట్రేషన్ నిర్ధారణకు సంబంధించి ఎస్ఎంఎస్,ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తారని అధికారులు తెలిపారు. ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ కూడా ఇస్తారని యాత్రికులు ప్యాసింజర్ టెర్మినల్ భవనానికి వచ్చినప్పుడు వారి పాస్‌పోర్టుతోపాటు ఎలక్ట్రానిక్ ఆథరైజేషన్ కూడా తీసుకువెళ్లాలని అధికారులు తెలిపారు. అదేవిధంగా పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో డేరా బాబా నానక్ వద్ద ఉన్న ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్ (పీటీబీ) కాంప్లెక్స్ లోపల ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని అనుమతించరు.

### యాత్రికులకు సాయంత్రం వరకే గడువు

మతపరమైన మొదటి తీర్థయాత్ర నవంబర్ 9న చేపట్టే అవకాశం ఉంది. వీసా లేకుండా ప్రతిరోజూ కనీసం 5వేల మంది యాత్రికులు పవిత్ర స్థలాన్ని సందర్శించేందుకు అనుమతిస్తారు. ఇరుదేశాల ఒప్పందం ప్రకారం గురుద్వార్ దర్బార్ సాహిబ్‌ను సందర్శించిన తరువాత యాత్రికులు అదేరోజు సాయంత్రంలోగా తిరిగి వచ్చేయాల్సి ఉంటుంది. అంటే ఉదయం ప్రయాణించే యాత్రికులు అదేరోజు తిరిగి రావాల్సి ఉంటుంది. కర్తార్‌పూర్ కారిడార్‌కు సంబంధించిన అన్ని సమస్యలపై ఇరుపక్షాలు సమన్వయంతో వ్యవహరిస్తాయని భారత్ పేర్కొంది. అయితే సిక్కు యాత్రికులపై పాకిస్థాన్ సర్వీస్ ఛార్జ్ విధించాలని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్త అవడంతో పవిత్ర క్షేత్రాన్ని సందర్శించాలనుకునే యాత్రికుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించడం ఆలస్యం అవుతోంది. సర్వీస్ ఛార్జ్‌ను వసూలు చేస్తే పాకిస్థాన్‌కు ప్రతి నెల 21కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అయితే పాకిస్థాన్ సర్వీస్ ఛార్జ్ వసూలు చేసే అంశాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అదేవిధంగా కేంద్ర మంత్రి హర్‌స్మిరత్ కౌర్ బాదల్ వ్యతిరేకిస్తున్నారు. సాహిబ్ దర్బార్‌ను సందర్శించాలనుకునే పేద సిక్కుల కలల సాకారానికి ఇది అడ్డంకిగా మారుతుందని ఇరువురు సిక్కు నేతలు భావిస్తున్నారు. గురునానక్ దేవ్ 550వ జయంతి సందర్భంగా మూడు రోజుల ముందు నవంబర్ 9న పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తారని పాక్ విదేశాంగమంత్రి షా మహమూద్ ఖురేషీ తెలిపారు. భారత్‌వైపు కారిడార్‌ను అదేరోజు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభిస్తారని హోం మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. కాగా భారత్‌వైపు కర్తార్‌పూర్ కారిడార్‌కు పునాదిరాయిని గత నవంబర్‌లో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు వేశారు.



కౌన్సిల్ విప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన భానుప్రసాద్‌ను అభినందిస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ తదితరులు

## జగన్ చేతిలో అధికారం ఉన్నా
# దోషులను పట్టుకోలేకపోయారు



**అమరావతి,ఆంధ్రప్రభ:** ముఖ్యమంత్రి పీఠం ఎక్కి ఐదు నెలలు గడుస్తున్నా సొంత బాబాయిని ఎవరు హత్యచేశారో, కోడి కత్తితో దాడి చేయించింది ఎవరో తెలుసుకోలేని వ్యక్తి ప్రజలకు ఏం భరోసా ఇస్తారని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సీఎం జగన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నెల్లూరు జిల్లాకు చెందిన జనసేన పార్టీ నాయకులు , అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, జగన్ రెడ్డి మీద దాడి జరిగితే తాను ఖండించి త్వరగా కోలుకోవాలని ప్రకటన ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థపై నమ్మకం లేదని తెలంగాణ పోలీసులను ఆశ్రయించిన జగన్ రెడ్డి రాష్ట్రంలో ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారని కోడికత్తితో దాడి చేయడానికి ప్రేరేపించిన వ్యక్తిని బయటికి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నవారిని కనిపెట్టలేరా అని ప్రశ్నించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని దారిలోనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి వెళ్తున్నారని తెలిపారు. మహిళాధికారిపై దాడి చేసిన చింతమనేని ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నారో తెలుసుకోవాలని వైసీపీకి సూచించారు. ఒ పత్రిక సంపాదకునిపైన, మహిళాధికారి సరళపై శ్రీధర్ రెడ్డి దాడికి పాల్పడ్డారని ఏదోక రోజు శిక్షపడుతుందన్న విషయాన్ని శ్రీధర్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు.

## చిద్దూకి జైల్లోనే దీపావళి



**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియాకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం రిమాండ్‌ను ఢిల్లీ కోర్టు పొడిగించింది. అక్టోబర్ 30వరకూ పొడిగిస్తూ చిదంబరాన్ని ప్రశ్నించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను అనుమతించింది. సీబీఐ దాఖలు చేసిన ఇదే కేసులో సుప్రీం కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసినా 74 చిదంబరం ఈడీ అదుపులోనే ఉన్నారు. ఐఎన్‌ఎక్స్ స్కామ్ కేసులో ఆగస్టు 21న సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. సీబీఐ, ఈడీ ఒకే ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నాయని అందువల్ల రెండింటికీ ప్రత్యేక రిమాండ్ ఉండరాదని చిదంబరం వాదించారు. తను ఎల్లప్పుడూ ఈడీ ప్రశ్నించడానికి అందుబాటులో ఉన్నాను అని, ఈడీ అధికారులు పిలిచిన నాలుగు తేదీల్లో అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చాను అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 16న చిదంబరాన్ని తీహార్ జైల్లో ప్రశ్నించిన ఈడీ అనంతరం అధికారికంగా ఆయనను అరెస్టు చేస్తున్నట్టు తెలిపింది.




# కోహ్లీకి విశ్రాంతి

## శివం దూబెకు అవకాశం... బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్

**ముంబై :** బంగ్లాదేశ్‌తో జరుగనున్న మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌నుంచి కెప్టెన్ కోహ్లీకి విశ్రాంతి కల్పించారు. భారత్‌లో పర్యటించనున్న బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుతో జరిగే టి20, టెస్టు సిరీస్‌లలో పాల్గొనే భారత జట్లను గురువారం ప్రకటించారు. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటిన ముంబయి యువ బ్యాట్స్‌మెన్ శివం దూబెకు తొలిసారి జాతీయ జట్టులో అవకాశం కల్పించారు. సంజు శాంసన్, లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చాహల్ తిరిగి టి20 జట్టులో స్థానం పొందారు. ముంబయి పేసర్ శార్దూల్ ఠాకూర్‌కు కూడా అవకాశం దక్కింది. కాగా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకుకూడా విశ్రాంతి కల్పించారు. కోహ్లీ స్థానంలో రోహిత్ శర్మ పగ్గాలు చేపట్టనున్నాడు. టెస్టులకు సంబంధించిన జట్టులో మార్పులేమీ లేవు. దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన జట్టునే కొనసాగించనున్నారు. ఢిల్లీ పేసర్ నవదీప్ సయానిని ఫిట్‌నెస్ కారణాలపై జట్టునుంచి తప్పించారు. గాయపడిన జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులో చేరేందుకు సమయం పడుతుందని, భువనేశ్వర్ కుమార్ తదుపరి విండీస్‌తో జరిగే సిరీస్‌కు జట్టును చేరతాడని చీఫ్ సెలెక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్ వెల్లడించాడు. భారత్‌లో పర్యటించే బంగ్లాదేశ్ నవంబర్ 3నుంచి మూడు టి20 మ్యాచ్‌లు, రెండు టెస్టులలో భారత్‌తో తలపడనున్నది.

**టి20 జట్టు :** రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, కె.ఎల్.రాహుల్, సంజు శాంసన్, శ్రేయాస్ అయ్యర్, మనీష్ పాండే, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), వాషింగ్టన్ సుందర్, కృనాల్ పాండ్యా, యజువేంద్ర చాహల్, రాహుల్ చాహర్, దీపక్ చాహర్, ఖలీల్ అహ్మద్, శివం దూబె, శార్దూల్ ఠాకూర్.

**టెస్టు జట్టు :** విరాట్ కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్, చతేశ్వర్ పుజారా, అజింక్య రహానె, హనుమ విహారి, వృద్ధిమాన్ సాహా(వికెట్‌కీపర్), రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మ, శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్.

# ధోనీ, పంత్‌లపై సమదృష్టి



### ఏ ఒక్కరిపైనా ప్రత్యేక అభిమానం ఉండదు
### యువకులకు ప్రోత్సాహంలో తగ్గం: ఎమ్మెస్కే
### దూబె, శాంసన్‌లకు అవకాశంపై వివరణ

**ముంబై:** సెలెక్టర్లకు ఎవరిపై ప్రత్యేక అభిమానం ఉండదని, రిషభ్ పంత్‌ను, దిగ్గజ ఆటగాడు ఎం.ఎస్.ధోనీని సమదృష్టితో పరిశీలిస్తామని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వ్యాఖ్యానించాడు. యువకులను ప్రోత్సహిం చాలన్న సెలక్టర్ల దృక్పథంలో మార్పు ఉండ బోదన్నాడు.



ఈ ఏడాది ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ అనంతరం ధోనీ జట్టు ఎంపిక కు అందుబాటులో లేనందున బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌కు పంత్‌కు ప్రత్యామ్నాయంగా సంజు శాంసన్‌ను ఎంపిక చేశామని వివరిం చాడు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ధోని వారసులను ఎంపిక చేయడంపైనే తాము దృష్టి సారిస్తున్నామని మరోసారి స్పష్టం చేశాడు. ప్రపంచకప్ అనం తరమే తన దృక్ప ధాన్ని స్పష్టం చేశానని, యువ కులకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తే భవిష్యత్తులో వారు ఉపయుక్తంగా ఉంటారని ప్రసాద్ అన్నా డు. పరిమిత ఓవర్ల పోటీలలో రిషభ్ పంత్ మెరుగ్గా రాణిస్తున్నాడని, తమ ఆలోచనలను మీడియా అర్థం చేసుకోవాలని కోరాడు. ధోనీతో మాట్లాడతామని, అతడుకూడా తమను అర్థం చేసుకోగలడన్న ఆశాభావం వ్యక్తంచేశాడు.

జట్టులో పంత్‌కు అవకాశాలు కల్పించడంపై మరోసారి ప్రసాద్ తనను సమర్ధించుకుంటూ ప్రపంచకప్ అనంతరం తమ వ్యూహాలను తేటతెల్లం చేశామని, భారత క్రికెట్ ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకునే సెలక్టర్ల నిర్ణయాలు ఉంటాయన్నాడు. పంత్ కొన్ని మ్యాచ్‌లలో రాణించి ఉండకపోవచ్చని, యువ ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు కల్పించడంద్వారానే వారి లో ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చని, అపుడే సత్ఫలితాలు లభిస్తాయన్నాడు. ధోనీ భవిష్యత్తుపై మాట్లాడుతూ అతడు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొని పూర్వ వైభవం ప్రదర్శిస్తాడా! లేక రిటైర్ అవుతాడా! అన్నది పూర్తిగా ధోనీ వ్యక్తిగతమని, అందులో తాము జోక్యం చేసుకోమన్నాడు.

ధోనీ ఎటువంటి నిర్ణయం తీసుకున్నా దానిని తాము గౌరవిస్తామన్నాడు. భావి జట్టును తీర్చిదిద్దడం పైనే తమ ఆలోచనలన్నీ అని, అది జట్టు ఎంపికలో ప్రస్ఫుటమౌతోందన్నాడు. బంగ్లాతో టి20 సిరీస్‌కు జట్టు ఎంపికపై మాట్లాడుతూ యువ ఆల్‌రౌండర్ శివం దూబె ఎంపికపై వివరణ ఇచ్చాడు. ముందుగా హార్దిక్ పాండ్యా, తమిళనా డు ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌ల పేర్ల ను పరిశీలించామని, ఆ స్థానానికి శివం దూబెనే సరైన ఆటగాడని అతనికి అవకాశం కల్పించా మన్నాడు.



దూబె దూకుడుగా ఆడతాడని, విండీస్ పర్యటనలో ఇండియా-ఎ జట్టులో అతని అతని ప్రతిభను దృష్టిలో ఉంచుకునే అవకాశం ఇచ్చామన్నారు. ఇక కీపర్ బ్యాట్స్‌మన్ సంజు శాంసన్‌కూడా టాపార్డర్‌లో ఉపయుక్తంగా ఉంటాడన్నాడు.

2015లో జింబాబ్వేతో ఒకే టి20 మ్యాచ్ ఆడిన శాంసన్ ఇటీవల విజయ్ హజారె ట్రోఫీలో ఒక డబుల్ సెంచరీ సహా మొత్తం 410 పరుగులు సాధించి రాణించి సెలెక్టర్లను మెప్పించాడు. నాలుగేళ్ల క్రితం భారత జట్టుకు ఎంపికైన శాంసన్ ఆ తరువాత నిలకడ లేమితో స్థానం కోల్పోయాడని, గత ఏడాదిగా దేశవాళీ క్రికెట్‌లో మెరుగ్గా రాణిస్తున్నాడన్నాడు. ఇపుడు అతడు నిలకడగా రాణిస్తున్నాడని, అందుకే జట్టులో చోటు దక్కించుకున్నాడన్నాడు.

# చాంపియన్లకు సాత్విక్- చిరాగ్ షాక్



### క్వార్టర్‌ఫైనల్‌కు సింధు, సైనా..
### ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్





**పారిస్:** భారత పురుషుల బ్యాడ్మింటన్ జోడి సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ప్రపంచ చాంపియన్లకు షాకిచ్చారు. గురువారం ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రిక్వార్టర్స్‌లో భారత జోడి ప్రపంచ చాంపియన్లు మహ్మద్ అషాన్-హెంద్రా సెతియవాన్‌లపై గెలుపొందారు. మహిళల సింగిల్స్‌లో పి.వి.సింధు, సైనా నెహ్వాల్‌కూడా క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఆగస్టులో థాయిలాండ్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న సాత్విక్-చిరాగ్ జోడి 21-18, 18-21, 21-13 స్కోరుతో ప్రపంచ రెండో ర్యాంక్ జోడి, ఈ ఏడాదిసహా మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ డబుల్స్ టైటిల్ సాధించిన ఇండోనేసియా జోడీని మూడు గేమ్‌ల పోరులో 53 నిమిషాలలో నెగ్గారు. తదుపరి రౌండ్‌లో భారత జోడి డెన్మార్క్‌కు చెందిన కిమ్ ఆస్ట్రప్-ఆండెర్స్ స్కారప్‌లను ఢీకొంటారు.

ప్రపంచ చాంపియన్ సింధు గత మూడు టోర్నీలలో త్వరగానే నిష్క్రమించినా, ఇక్కడ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-10, 21-13తో సింగపూర్ క్రీడాకారిణి యో జియా మిన్‌ను 34 నిమిషాల్లో ఓడించింది. ప్రపంచ 6వ ర్యాంకర్ సింధు తరువాతి రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్, చైనీస్ తైపీకి చెందిన తైజు ఇంగ్‌తో తలపడనున్నది.

ఇక లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, ఎనిమిదో సీడ్ సైనా నెహ్వాల్ 21-10, 21-11తో డెన్మార్క్‌కు చెందిన లిన్ హోజ్మార్క్ కార్స్ ఫెల్ట్‌పై సునాయాసంగా గెలుపొందింది. సైనా క్వార్టర్‌ఫైనల్లో కొరియాకు చెందిన ఆన్ సె యంగ్‌తో తలపడుతుంది.

# బబిత, యోగేశ్వర్ ఓటమి

### అచ్చిరాని ఎన్నికలు





**చండీగఢ్:** రెజ్లింగ్ గోదాలు ప్రత్యర్థులను మట్టిగరిపించే రెజ్లర్లు బబిత పోగట్, యోగేశ్వర్ దత్‌లు హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బరిలో తామే మట్టిగరిచారు. గురువారం జరిగిన ఎన్నికల ఫలితాలలో బబిత, యోగేశ్వర్‌లతోపాటు టిక్ టాక్ స్టార్ సోనాలి పోగట్‌కూడా పరాజయంపాలైంది. అధికార జనతా పార్టీ తరపున ఎన్నికలలో పోటీచేసిన వీరికి పరాజయం తప్పలేదు. కాగా హాకీ కెప్టెన్ సందీప్ సింగ్ విజయం బీజేపీకి ఊరట కలిగించే విషయం. చర్కి దాద్రి అసెంబ్లీ పరిధిలో దాద్రినుంచి పోటీచేసిన బబిత అసలు ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. ఈ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి సంబీర్ విజయం సాధించాడు. అతడు సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన సత్పాల్ సంగ్వాన్‌పై 14,272 ఓట్ల తేడాతో గెలుపొందాడు. బరోడా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీకృష్ణహుడా 4,840 ఓట్ల తేడాతో యోగేశ్వర్ దత్‌పై విజయం సాధించాడు. సోనాలి పోగట్‌పై కాంగ్రెస్ నాయకుడు కుల్దీప్ బిష్ణోయ్ 29,471 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. హాకీ ఆటగాడు సందీప్ సింగ్ 5,341 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి మన్‌దీప్ సింగ్ చత్తాపై గెలుపొందాడు. ఈ నలుగురు క్రీడాకారులు ఎన్నికలకు ముందు బీజేపీ పార్టీలో చేరారు.

## హెచ్‌ఎఫ్‌సీ సహయజమాని రానా



**హైదరాబాద్ :** సినీ నటుడు దగ్గుబాటి రానా ఐఎస్ఎల్‌లో పోటీపడుతున్న హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్(హెచ్‌ఎఫ్‌సీ) సహయజమానిగా వ్యవహరించనున్నాడు. ఇప్పటికే వరుణ్ త్రిపురనేని, విజయ్ మద్దూరి ఈ జట్టు యజమానులుగా ఉన్నారు. క్రీడలతో హైదరాబాద్‌కు ఎనలేని అనుబంధముందని, ఆ సాంప్రదాయంలో తానూ పాలుపంచుకుంటున్నందుకు ఆనందంగా ఉందని రానా తెలిపాడు. కమల్‌జిత్ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఈ సీజన్‌లో మెరుగైన ప్రతిభ చూపగలదన్న ఆశాభావం వ్యక్తం చేశాడు. చెన్నై, గోవాలలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో హైదారబాద్ ఆటగాళ్లు ఎన్నో మెళకువలు నేర్చుకున్నారని తెలిపాడు. ఆడిన ఎనిమిది స్నేహ పూర్వక మ్యాచ్‌లలో హైదరాబాద్ ఎఫ్‌సీ గెలుపొందడం గమనార్హమన్నాడు.

## అబుదాబి టి10లో యువరాజ్

**దుబాయ్ :** ఐసీసీ అనుమతి లభించిన అబుదాభి టి10 టోర్నీలో భారత ధనాధన్ బ్యాట్స్‌మెన్ యువరాజ్ సింగ్ ఆడనున్నాడు. యువరాజ్ మరాఠా అరేబియన్స్ దిగ్గజ ఆటగాడిగా పాల్గొననున్నాడు. గత జూన్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తరువాత యువరాజ్ ఆడనున్న పరిమిత ఓవర్ల రెండో టోర్నీ ఇది. ఈ టోర్నీ నవంబర్ 14న ఆరంభం కానున్నది. 2007 టి20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్‌లను భారత్ గెలుచుకోవడంలో యువరాజ్ పాత్ర మరువలేనిది. ప్రపంచంలో నిర్వహించే పరిమిత ఓవర్ల టోర్నీలో ఆడాలన్నది యువరాజ్ ఆశయం. అయితే వర్తమాన క్రీడాకారులను విదేశీ లీగ్‌లలో ఆడేందుకు బీసీసీఐ అనుమతించడంలేదు. అందుకే యువరాజ్ రిటైర్మెంట్ తీసుకున్నాడన్న సమాచారం. రిటైర్మెంట్ తీసుకున్న తరువాత యువరాజ్ తొలిగా కెనడాలో జులై-ఆగస్టులో నిర్వహించిన గ్లోబల్ టి20 లీగ్‌లో టొరంటో నేషనల్స్ జట్టు సారథిగా పాల్గొన్నాడు. కాగా మరాఠా అరేబియన్స్‌కు జింబాబ్వే మాజీ కెప్టెన్ ఆండీ ఫ్లవర్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.



## చెస్ క్రీడాకారిణి సరయుకు మంత్రి అభినందనలు

**హైదరాబాద్ (ఆంధ్రప్రభ క్రీడాప్రతినిధి):** ఇటీవల ముంబైలో జరిగిన యూత్ వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్-13 విభాగంలో ఎనిమిదో స్థానంలో నిలిచిన తెలంగాణ క్రీడాకారిణి సరయును రాష్ట్ర క్రీడలు, పర్యాటక-సాంస్కృతిక మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. గురువారం సరయు పరకాల శాసనసభ్యుడు ధర్మారెడ్డితో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారులకు ఇతోధిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ధర్మారెడ్డి, సరయు తండ్రి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# దిగ్గజాల టైటిల్ పోరు

### విజయ్ హజారె ట్రోఫీ ఫైనల్



**బెంగళూరు :** శుక్రవారం జరుగనున్న విజయ్ హజారె ట్రోఫీ ఫైనల్లో జాతీయ ఆటగాళ్లు మయాంక్ అగర్వాల్, ఆర్.అశ్విన్, కె.ఎల్.రాహుల్‌పైనే అందరి చూపు. సమ ఉజ్జీలుగా ఉన్న కర్ణాటక, తమిళనాడు టైటిల్‌కోసం ఆది వారం ఇక్కడ తలపడనున్నాయి. మనీష్ పాండే నేతృత్వం లోని కర్ణాటక జట్టు నాకౌట్ పోటీలలో సంపూర్ణ విజయాలను నమోదు చేయగా, మరోవైపు తమిళనాడు వర్షం బారిన పడిన పోటీల్లో నిబంధనల కారణంగా అదృష్టంకొద్దీ ఫైనల్ స్థానం సంపాదించగలిగింది. క్వార్టర్‌ఫైనల్లో పంజాబ్, సెమీస్‌లో ఎం.షారుఖ్‌ఖాన్ చలవతో తమిళనాడు బయట పడింది. ఇరు జట్లు బలమైన బ్యాటింగ్ లైనప్, మెరుగైన బౌలర్లను కలిగివున్నాయి. అయినా అశ్విన్ చేరికతో తమి ళనాడు బౌలింగ్ మరింత మెరుగుపడింది. ఇరుజట్లు బ్యాటింగ్‌లో బలీయంగా ఉండడంతో శుక్రవారం ఏ జట్టు బౌలర్లు రాణిస్తారో ఆ జట్టుదే విజయం.

సొంత మైదానంలో ఆడనుండడం కర్ణాటకకు కలిసొచ్చే అంశం. వారి ఓపెనర్లు రాహుల్(546), దేవదత్ పడిక్కల్ (598) ఈ ట్రోఫీలో బ్యాటింగ్‌లో రాణించారు. కెప్టెన్ మనీష్ పాండేకూడా ఈ చాంపియన్‌షిప్‌లో బ్యాట్‌తో మెరుపులు మెరిపిస్తున్నాడు. ఇక మిడిలార్డర్‌లో కరుణ్ నాయర్ ఉండనే ఉన్నాడు. వీరంతా రాణిస్తే ట్రోఫీ కర్ణాటకదే అనడంలో సందేహం లేదు. ఇక తమిళనాడు బ్యాటింగ్ ఆర్డర్‌కూడా బలీయంగానే ఉంది. బాబా అపరాజిత్(480), అభినవ్ ముకుంద్(440), మురళీ విజయ్ ఫైనల్లోనూ రాణించాలని అభిలషిస్తున్నారు. లీగ్ మ్యాచ్‌లలో మెరుగైన ఫినిషింగ్‌తో మెరిసిన కెప్టెన్ దినేష్ కార్తీక్ ఫైనల్లోనూ మెరుపు మెరిపించాలని ఆశిస్తున్నాడు. ఆల్‌రౌండర్ విజయ్ శంకర్, యువ బ్యాట్స్‌మెన్ షారుఖ్‌ఖాన్ మరోసారి భారీ స్కోర్లు సాధించాలని ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

బౌలింగ్‌లో కర్ణాకకు వి.కౌశిక్ రూపంలో కొత్త ఆటగాడు లభించాడు. అతడు సెమీస్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి ఛత్తీస్‌గఢ్‌పై విజయంలో ప్రధానపాత్ర పోషించాడు. ఇక అనుభవజ్ఞుడు అభిమన్యు మిథున్, ప్రసిధ్‌కృష్ణ స్పిన్నర్లు కె.గౌతమ్, శ్రేయాస్ గోపాల్, ప్రవీణ్ దూబెలతో వారి బౌలింగ్ విభాగం పటిష్టంగానే ఉంది. అదృష్టంతో ఇక్కడిదాకా వచ్చిన తమిళనాడును సత్తాచూపి నిలువరిం చాలని కర్ణాటక పట్టుదలతో ఉంది. ఇక బౌండరీలు చిన్నవిగా ఉండే చినస్వామి స్టేడియంలో చెత్తబంతులు సిక్సర్లు, ఫోర్లకు వెళతాయని తమిళనాడు స్పిన్నర్లు అశ్విన్, మురుగన్ అశ్విన్‌లకు బాగా తెలుసు. కర్ణాటక బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయాలంటే తమిళ స్పిన్నర్లు నియంత్రణతో బంతులు వేయాలి. పేసర్లు నటరాజన్, ఎం.మహ్మద్, విఘ్నేష్‌లు ఆరంభంలో వికెట్లు పడగొడితే స్పిన్నర్ల పని సులువ వుతుంది. గత రెండు సీజన్లల్లో లీగ్ దశలో తడబడిన తమిళనాడు ఈసారి ఎదురులేని జట్టుగా ఫైనల్‌కు చేరుకుంది. గత ఏడాది అంతగా రాణించని కర్ణాటకకూడా టైటిల్‌తో ప్రతిభ చాటాలని ఆశిస్తున్నది.

**జట్లు :** కర్ణాటక - మనీష్ పాండే(కెప్టెన్), కె.ఎల్.రాహుల్, దేవదత్ పడిక్కల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్, పవన్ దేశ్‌పాండే, కె.గౌతమ్, శ్రేయాస్ గోపాల్, ఎస్‌శరత్(వికెట్‌కీపర్), అభిమన్యు మిథున్, వి.కౌశిక్, ప్రసిధ్ కృష్ణ రోణిత్ మోరె, ప్రవీణ్ దూబె, జె.సుచిత్, అభిషేక్ రెడ్డి.

తమిళనాడు - దినేష్ కార్తీక్(కెప్టెన్), అభినవ్ ముకుంద్, మురళీ విజయ్, బి.అపరాజిత్, విజయ్ శంకర్, ఎం.ఎస్‌వాసింగ్టన్ సుందర్, ఎం.షారుఖ్‌ఖాన్, ఆర్.అశ్విన్, ఎం.మహ్మద్, టి.నటరాజన్, కె.విఘ్నేష్, ఎం.అశ్విన్, ఎన్.జగదీశన్(వికెట్‌కీపర్), అభిషేక్ తన్వర్, సి.హరి నిశాంత్, జె.కౌశిక్.

## గుణశేఖరన్‌కు మరో స్వర్ణం

**ఉహాన్(చైనా) :** చైనా తొలిసారి నిర్వహిస్తున్న ప్రపంచ మిలటరీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత దివ్యాంగ అథ్లెట్ ఆనందన్ గుణశేఖరన్ మూడో స్వర్ణం సాధించాడు. జావెలిన్ త్రోలో శివపాల్ సింగ్ భారత్‌కు మరో స్వర్ణం అందించాడు. దివ్యాంగ పురుషుల 100 మీ. పరుగు, ఐటీ1 విభాగం 400మీ. అంశాల్లో స్వర్ణాలు సాధించిన గుణశేఖరన్ 200మీ. ఐటీ1 విభాగంలోనూ అగ్రస్థానంలో నిలిచాడు. గుణశేఖరన్ 24.31 సెకండ్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానం పొందగా, కొలంబియాకు చెందిన ఫజార్డొ (26.11 సె.), పెరూకు చెందిన కాసా జోస్ (27.33సె.)కు రజత, కాంస్యాలు దక్కాయి.

## ముంబై సిటీ ఎఫ్‌సీ బోణీ




**కొచ్చి :** ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ బోణీ చేసింది. గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబైఎఫ్‌సీ 1-0 స్కోరుతో కేరళ బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. చివరి క్షణాలలో అమినె చెర్మితి చేసిన గోల్‌తో ముంబై జట్టు విజయాన్నందుకుంది. ప్రథమార్ధంలో ఇరు జట్లకు లభించిన పలు అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాయి. 84వ నిమిషంలో చెర్మితి చేసిన గోల్‌తో ముంబై గట్టెక్కింది. ఈ విజయంతో ముంబైకి మూడు పాయింట్లు దక్కాయి.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

lifepage2012@gmail.com

ఆంధ్రప్రభ లైఫ్

శుక్రవారం 25 అక్టోబర్ 2019




# రాజరికం...చాలా ఇరుకు!

సాధారణంగా పాలకులు తమకు నచ్చినట్టుగా ఉంటారు... ప్రజలకు స్వేచ్ఛ ఉండదని అనుకుంటాం. కానీ ఇంగ్లండు రాజవంశీయులను చూస్తే మాత్రం దీనికి భిన్నంగా ఉంటుంది పరిస్థితి. నాటి డయానా నుండి నేటి ఆమె కోడలు డచెస్ మేఘన్ వరకు...మాకూ కాస్త సొంత జీవితం కావాలని వేడుకుంటున్నట్టుగానే ఉంది పరిస్థితి. ప్రిన్స్ హ్యారీ ఆయన భార్య మేఘన్‌లు తమపై తీసిన ఒక డాక్యుమెంటరీలో తమ మనసులోని మాటలు చాలా మాట్లాడారు. మాతృత్వం, మానసిక ఆరోగ్యం, దుఃఖం, మీడియా వెంటాడటం...మొదలైన అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఎబిసి టెలివిజన్ నెట్‌వర్క్ కోసం...గుడ్‌మార్నింగ్ అమెరికా కార్యక్రమ సహయాంకర్ రాబిన్ రాబర్ట్స్, ఐటివి న్యూస్ ఎట్ టెన్... యాంకర్ టామ్ బ్రాడ్‌బి ఇంకా కొంతమంది టివీ కార్యక్రమాల రూపకల్పన బృందం 'హ్యారీ అండ్ మేఘన్: యాన్ ఆఫ్రికన్ జర్నీ' పేరుతో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. వివిధ అంశాలపై హ్యారీ, మేఘన్‌లు మాట్లాడుతున్న మాటలు, చేస్తున్న కామెంట్లు వారి రాచరికపు పరిధిని దాటిపోతున్నాయని అమెరికా టాబ్లాయిడ్స్ హోరెత్తుతున్న నేపథ్యంలో...సోషల్ మీడియాలో నెటిజన్లు 'ఉయ్ లవ్ యు మేఘన్' అనే హ్యాష్ ట్యాగ్‌తో ఈ రాజవంశపు జంటకు తమ మద్దతుని ప్రకటించారు. ఎబిసి టెలివిజన్ నెట్‌వర్క్ లో ప్రసారమైన 'హ్యారీ అండ్ మేఘన్: యాన్ ఆఫ్రికన్ జర్నీ' లో వారిరువురు వెల్లడించిన అభిప్రాయాలు...రాజరికపు మూసధోరణికి భిన్నంగా సాధారణ ప్రజానీకానికి వారిని చేరువ చేసేలా ఉన్నాయి.

☞ మేఘన్ ఈ పర్యటనలో తన జాతీయత గురించి మాట్లాడారు. దక్షిణ ఆఫ్రికాలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా చెప్పబడే కేప్‌టౌన్లో న్యాంగా అనే పట్టణంలో ఆడపిల్లలను ఉద్దేశించి మాట్లాడారామె. నేను రాజకుటుంబంలో ఒక సభ్యురాలిని అయినప్పటికీ ఇక్కడ ఒక తల్లిగా ఒక భార్యగా ఒక స్త్రీగా, మీ సోదరిగా మాట్లాడుతున్నానన్నారు. తన తండ్రి శ్వేతజాతీయుడని, తన తల్లి ఆఫ్రికన్ అమెరికన్ అనే విషయాన్ని సైతం గుర్తుచేసుకున్నారు.

☞ మేఘన్, హ్యారీలు తల్లిదండ్రులు అయ్యాక తమ అయిదునెలల కుమారుడు ఆర్చీతో కలిసి చేసిన మొట్టమొదటి అధికారిక పర్యటన ఇది. కేప్ టౌన్ లోని ఆర్చ్‌బిషప్ దేశ్‌మాండ్ టుటు, ఆయన కుమార్తె థాండెకాలకు తమ కుమారుని చూపించారు. మేఘన్ ఇంటర్వ్యూ ఇస్తున్నపుడు హ్యారీ ఒక మంచి తండ్రిగా కుమారునికి సేవలు చేస్తూ, ఆడిస్తూ కనిపించారు. 'నేను ఎల్లప్పుడూ నా కుటుంబానికి అండగా ఉంటూ వచ్చాను...ఇప్పుడు నేను ప్రత్యేకంగా చూసుకోవడానికి నాకో కుటుంబం ఉంది.' అన్నారు. తన తల్లి డయానా మరణం ఒక మానని గాయమన్నారు. ఈ కుటుంబ సభ్యునిగా ప్రతిసందర్భంలో కెమెరాని గమనించానని, క్లిక్ అనే శబ్దాన్ని విన్నానని, ఫ్లాష్ వెలుగుని చూశానని అన్నారు. ఇలాంటప్పుడు తాను గతంలోకి వెళ్లిపోతానని, తల్లి మరణం గుర్తుకు వస్తుందని చెప్పుకొచ్చారు హ్యారీ. కొన్ని బ్రిటీష్ టాబ్లయిడ్స్‌పై తను మేఘన్ చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్టుగా హ్యారీ ఇంతకుముందే ప్రకటించి ఉన్నారు.

☞ మాతృత్వం గురించి మేఘన్ మాట్లాడిన మాటలు వింటున్నవారిని ఆలోచింపచేసేవిగా, బాధని కలిగించేవిగా ఉన్నాయి. కొత్తగా పెళ్లయిన అమ్మాయిగా, గర్భిణిగా, తల్లిగా....అన్ని ఒక మహిళకు ప్రత్యేక సందర్భాలు. ఇవన్నీ మీడియాకు పనికొచ్చే విషయాలు...కానీ తన స్థితిని తెలుసుకోకుండానే తనని కెమెరాలు వెంటాడటం గురించి మాట్లారామె. హ్యారీ భార్యగా మారాక...తనని ఎంతగా ఎన్ని విధాలుగా పరిశీలిస్తారో తాను ఊహించలేదంటారామె.



☞ హ్యారీకి అతని అన్న విలియమ్స్‌తో విభేదాలున్నాయని బ్రిటీష్ టాబ్లాయిడ్స్ కథనాలు రాస్తున్నాయి. అన్నదమ్ములవి రెండు భిన్నమైన దారులని, తమ తల్లి మరణం గురించి కూడా ఇద్దరు భిన్నంగా మాట్లాడుతున్నారని...అక్కడి మీడియా అంటున్న నేపథ్యంలో హ్యారీ....అన్నతో తనకున్న బంధం గురించి మాట్లాడుతూ...కొన్నిసార్లు కొన్ని ఒత్తిళ్లమధ్య ఇలాంటివి మామూలేనని...ఏదిఏమైనా అతను తనకు సోదరుడని, ఎప్పటికీ సోదరుడేనని అన్నారు.



సాధారణంగా పండుగలకు మనమంతా కొత్త దుస్తులు కొని ధరిస్తూ ఉంటాం. అది ఎప్పుడూ జరిగేదే. కానీ దీపావళికి మాత్రం...కాంతులకు కొత్త దుస్తులు ధరింపచేసి ఆనందించవచ్చు. నూనెపోసి ఒత్తి వెలిగిస్తే చాలు...కాంతి తాను బంగారు దీపపు సమ్మెల్లో వెలుగుతున్నానా...లేదా మట్టి ప్రమిదలో వెలుగుతున్నానా...అనేది చూడకుండా కాంతులు విరజిమ్ముతుంది. ఫ్యాషన్ దుస్తులు వేసిన పాపాయిలా.... డిజైనర్ ప్రమిదలు, కొవ్వొత్తులు, కుండలు వంటివాటిలో వెలిగించిన దీపం...మరింత అందమైన రంగుల కాంతులతో విరబూస్తుంది. ఇక్కడ కనబడుతున్న దివ్వెలన్నీ అలాంటివే. ఆన్‌లైన్‌లో దొరుకుతున్న వీటిని ఆత్మీయులకు బహుమతులుగా పంపితే....ఈ దీపావళికి ప్రేమానుబంధాలు సైతం వెలుగుతాయి. ఆర్టిఫిషియల్ ఫ్లవర్ డెకరేషన్‌తో కూడిన దివ్వెల హోల్డర్లు, ఇంటికి డెకరేటివ్ కళాకృతిలా ఉన్న అక్రిలిక్ మూడు లేయర్ల ఫ్లోటింగ్ కుందన్ దియా, ముత్యాల వర్క్ చేసిన ఫ్లోటింగ్ దియాలు, మల్టీ కలర్ అరోమా డిజైనర్ కాండిల్స్...ఇవన్నీ కాంతులకు ప్రత్యేక అలంకరణలే.



# కాంతులకు కొత్త దుస్తులేద్దాం!

డిజైనర్ దీపాలు





# ఆకుపచ్చ బహుమతి!

స్వీట్లు, డ్రైఫ్రూట్స్, నట్స్, డిజైనర్ దీపాలు...దీపావళికి చాలా ఎక్కువగా ఇచ్చిపుచ్చుకునే బహుమతులు ఇవన్నీ. ఈ వరుసలో చక్కని మొక్కలు కూడా ఉన్నాయి. అవును పండుగ ఏదైనా కాలుష్యరహితంగా చేసుకోవాలని ఆశిస్తున్న నేటి తరుణంలో...గో గ్రీన్ నినాదానికి ఊతం ఇచ్చేలా మొక్కలను బహుమతులుగా ఇవ్వవచ్చు. ఆన్‌లైన్‌లో ఇలా బహుమతిగా ఇవ్వదగిన మొక్కలు అనేకం లభిస్తున్నాయి. వీటిలో చాలాఅందమైన పూలమొక్కలు, గాలిని శుభ్రం చేసేవి, యాంటీ పొల్యుటెంట్లుగా పనిచేసేవి, అదృష్టాన్ని తెచ్చేవిగా చెప్పబడుతున్నవి...ఇలా ఎన్నో రకాలున్నాయి. నాసావారు గాలిని శుభ్రం చేస్తుందని చెబుతున్న, చైనా వాస్తు ప్రకారం అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతున్న మనీ ప్లాంట్ సైతం వీటిలో ఉంది. దీనిని అదృష్టాన్ని తెచ్చే మొక్కగా భావిస్తుంటారు. ఇంట్లో, బాల్కనీలో, టెర్రస్‌పైన ఎక్కడ ఉంచినా ఇవి అలంకరణ వస్తువులుగా కూడా భాసిస్తాయనటంలో సందేహం లేదు. ఈ దీపావళికి మొక్కలను బహుమతులుగా ఇచ్చిపుచ్చుకుంటే ఆరోగ్య శుభాన్ని, పర్యావరణహితాన్ని ఇచ్చే ఓ చక్కని అందమైన బహుమతిని ఇచ్చినట్టే మరి.















మనమంతా... ఏం తింటున్నాం, ఎలాంటి పోషకాలు మన శరీరంలోకి వెళుతున్నాయి, వాటివలన మనకు ఎంత ప్రయోజనం కలుగుతుంది, అనే విషయాలను చాలా బాగా పట్టించుకుంటాం. కానీ అంత శ్రద్ధ ఆహారం తీసుకునే సమయాల పట్ల ఉండదు. కానీ ఏం తింటున్నాం... అనేది ఎంత ముఖ్యమో, ఎప్పుడు తింటున్నాం అనేది కూడా అంతే ముఖ్యమంటున్నారు పలువురు ఆహార ఆరోగ్య నిపుణులు.

# నిద్రకు ముందు... పొట్ట నింపకండి!

## ఏడింటిలోపు తింటే ఎన్నో లాభాలు



మంచి ఆహారమే తీసుకుంటున్నా...గ్యాస్ అజీర్తి లాంటి సమస్యలు వెంటాడుతున్నాయని బాధపడుతుంటారు కొందరు. ఇలాంటివారు తాము ఆహారాన్ని సరైన సమయంలోనే తీసుకుంటున్నారా లేదా అనేది సరిచూసుకోవాలి. ఎందుకంటే ఆహారం విషయంలో పోషకాలే కాదు..వేళలు సైతం చాలా ముఖ్యం. రాత్రులు ఏడుకంటే ముందు ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన అద్భుతాలు జరుగుతాయట. రాత్రులు తగ్గించి తినడమే కాకుండా త్వరగా తినటం మన ఆరోగ్యానికి చాలా మంచిదని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పోషకాహార నిపుణులు ఎంతోకాలంగా చెబుతూనే ఉన్నారు.

మనం ఏ సమయంలో భోజనం చేస్తున్నాం అనేది మన ఆరోగ్యం, నిద్ర, శరీర బరువు, మెటబాలిక్ రేటు అన్నింటిపై ప్రభావాన్ని చూపుతుంది.

### బరువు తగ్గించే చిట్కా

బరువు తగ్గాలని అనుకునేవారంతా రకరకాల మార్గాల్లో ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఆరునుండి ఏడులోపల భోజనం చేయటం వలన మనం తీసుకునే భోజనం పరిమాణం చాలావరకు తగ్గుతుంది. ఈ సమయంలో భోజనం చేయటం వలన...భోజనం కోసం ఎక్కువ సమయం కేటాయించలేరు. దాంతో తక్కువ కేలరీలను మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. 'రాత్రి త్వరగా భోజనం చేయటం వలన తెల్లవారేవరకు ఎక్కువ సమయం ఏమీ తినకుండా ఉండే వీలున్నందున శరీరంలో కొవ్వుశాతం తగ్గుతుంది. శరీరం నిల్వ ఉన్న కొవ్వుని శక్తి కోసం వినియోగించుకోవటం వలన అలా జరుగుతుంది. ఆహారం సరిగ్గా జీర్ణం కావటం అనేది శరీర బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది.' అంటారు డాక్టర్ రూపాలీ దత్తా అనే క్లినికల్ న్యూట్రిషనిస్ట్. మన శరీరంలోపలి పనితీరు సూర్యుని గమనంతో అనుసంధానమై ఉంటుందని అంటారు. రాత్రులు ఆలస్యంగా ఆహారం తీసుకోవటం వలన అది పూర్తి స్థాయిలో జీర్ణం కాక పేగుల్లో మిగిలిపోయే అవకాశం ఉంది. త్వరగా తినటం వలన శరీరం ఆహారాన్ని పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దీనివలన కొవ్వు నిల్వలు పెరగకుండా ఉంటాయి.

### మంచి నిద్రకు మార్గం

సరిగ్గా నిద్రపోయే వేళకు ముందు గబగబా తినేసి వెంటనే నిద్రపోవాలనుకుంటారు కొందరు. దీనివలన అజీర్తి, గుండెమంట లాంటి సమస్యలు పెరిగి నిద్రకు ఆటంకంగా మారతాయి. మనం కడుపునిండా తిన్నామంటే...మన శరీరం దానిని నిద్రించే వేళగా గుర్తించదు. అది పనిచేయడమే కాకుండా...నిద్రకు భంగం కలిగిస్తుంది. రాత్రులు త్వరగా ఆహారం తీసుకోవటం వలన నిద్ర సరిగ్గా పట్టడమే కాకుండా ఉదయం తాజాగా నిద్రలేవగలుగుతారు.

### హృదయానికి హాయి

రాత్రులు త్వరగా తినటం అనేది మన గుండె ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. మధుమేహం, థైరాయిడ్, పిసిఓడి, కార్డియోవాస్క్యులర్ వ్యాధులున్నవారిని రాత్రులు తక్కువగా తినమని, అది కూడా త్వరగా తినమని సూచిస్తుంటామని మెహర్ రాజపుత్ అనే న్యూట్రిషనిస్ట్ చెబుతున్నారు. సాధారణంగా మన భారతీయులు తీసుకునే ఆహారంలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది.

ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని రాత్రులు ఆలస్యంగా భుజించడం వలన శరీరంలో నీరు నిలువ ఉండటం, పొట్ట ఉబ్బరంలతో పాటు రక్తపోటు పెరిగే అవకాశాలు సైతం ఎక్కువగా ఉంటాయి. రాత్రులు ఉప్పు, పిండి పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవటం వలన గుండె, రక్తనాళాలను రిస్క్‌లో పెట్టినట్లవుతుందంటున్నారు మెహర్. బిపి ఉన్నవారు ఓట్స్, బ్రౌన్ రైస్, బ్రాన్ చపాతీ (గోధుమ పొట్టుతో తయారు చేసినవి) వంటివి తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

### నిద్రలో బిపి తగ్గాలంటే...

రాత్రులు భోజనం ఆలస్యంగా చేసేవారు బిపికి సంబంధించి 'నాన్-డిప్పర్ హైపర్‌టెన్షన్ అనే సమస్యకు గురవుతారు. ఈ సమస్య ఉన్నపుడు నిద్రలో తగ్గాల్సిన స్థాయిలో బిపి తగ్గదు. మనం నిద్రలో ఉన్నపుడు పదిశాతం బిపి తగ్గితేనే మన శరీరానికి తగిన స్థాయిలో విశ్రాంతి లభిస్తుంది. బిపి తగ్గని స్థితి అలాగే కొనసాగితే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం సైతం కొనసాగుతుంది. కొన్నిసార్లు స్ట్రోక్ కూడా రావచ్చు. రాత్రి భోజనానికి, నిద్రకు మధ్య విరామ సమయాన్ని పెంచడం వలన ఇలాంటి రిస్క్‌లను తగ్గించుకోవచ్చు.

### రాత్రులు ఆకలి వేయకుండా...

అయితే త్వరగా భోజనం చేయటం వలన నిద్రకు ముందు తిరిగి ఆకలి వేయవచ్చు. ఇలాంటప్పుడు కేలరీలు, పిండిపదార్థాలు తక్కువగా ఉండి, ప్రొటీన్లు ఎక్కువగా వున్న ఆహారం తీసుకోవచ్చు. అయితే కొన్ని జాగ్రత్తలతో పగటిపూట ఆహారం తీసుకుంటే అర్ధరాత్రి ఆకలి వేయకుండా ఉంటుంది. ఉదయం ఆరునుండి సాయంత్రం ఏడువరకు నాలుగు నుండి ఆరుసార్లు ఆహారాన్ని తీసుకోవాలి. మధ్యాహ్నం వరకు తీసుకునే ఆహారం ఎక్కువ మోతాదుల్లో ఉండేలా చూసుకోవాలి. ఇలా చేయటం వలన రోజంతా శరీరం పని చేయడానికి తగిన ఇంధనం శరీరానికి సమకూరుతుంది. దీనివలన అర్ధరాత్రి ఆకలి వేయదు. కొన్నిరోజులపాటు పాటిస్తే...ఈ భోజనవిధానం అలవాటవుతుంది.



# దినఫలాలు

**మేష రాశి**
కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఎంత కష్టించినా ఫలితం ఉండదు. వ్యయప్రయాసలు. కుటుంబ సభ్యులతో వివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహం. దైవదర్శనాలు.

**వృషభ రాశి**
చేపట్టిన వ్యవహారాలు విజయవంతమవుతాయి. విందువినోదాలు. భూవివాదాలు పరిష్కారం. బంధువుల నుంచి శుభవార్తలు వింటారు. వ్యాపార,ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. వాహనయోగం.

**మిథున రాశి**
కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తలు వింటారు. దైవదర్శనాలు. వాహన, గృహయోగాలు. కీలక నిర్ణయాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ప్రోత్సాహం. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. వస్తులాభాలు.

**కర్కాటక రాశి**
బంధువిరోధాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. ధనవ్యయం. కుటుంబంలో కొద్దిపాటి సమస్యలు. వ్యాపార లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగులకు ఒత్తిడులు. ఆకస్మిక ప్రయాణాలు.

**సింహ రాశి**
పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు. రుణాలు చేస్తారు. మిత్రులు, కుటుంబ సభ్యులతో అకారణంగా తగాదాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలలో ఒడిదుడుకులు. ఉద్యోగాలలో కొన్ని మార్పులు.

**కన్యా రాశి**
పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యత, విందువినోదాలు. వాహనయోగం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొత్త ఆశలు.

**తుల రాశి**
ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. శ్రమాధిక్యం. పనుల్లో ఆటంకాలు. ఆరోగ్య సమస్యలు. ఆస్తి వివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. సోదరుల నుంచి ఒత్తిళ్లు.

**వృశ్చిక రాశి**
దూరపు బంధువులతో ఉత్సాహంగా గడుపుతారు. భూములు, వాహనాలు కొంటారు. పోటీపరీక్షల్లో విజయం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు. విందువినోదాలు.

**ధనూ రాశి**
కుటుంబ సభ్యులతో వివాదాలు. రాబడికి మించి ఖర్చులు. దూరప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మకర రాశి**
పలుకుబడి పెరుగుతుంది. వస్తు, వస్త్ర లాభాలు. పాతబాకీలు వసూలవుతాయి. తీర్థ యాత్రలు చేస్తారు. ముఖ్యమైన పనులు విజయ వంతంగా సాగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో వాతావరణం ఉత్సాహవంతంగా ఉంటుంది.

**కుంభ రాశి**
వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆర్థిక ప్రగతి. ఇంటర్వ్యూలు అందుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు. దూరపు బంధువుల కలయిక.

**మీన రాశి**
కుటుంబ సభ్యులతో తగాదాలు. ఆలోచనలు కలసిరావు. పనులు వాయిదా వేస్తారు. ఆలయాలు సందర్శిస్తారు. అనారోగ్యం. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి



# లోకం, లోకేశ్వరుడు...

**జీవజగత్తుల స్థితులను సమతుల్యంగా నడిపిస్తున్న ఆత్మే భగవంతుడు! ఈ ఆత్మ, దేహంలో శబ్దమయంగా 'నేను' 'నేను' అంటున్నది కనుక దైవానికి మొదటి పేరు 'నేను'! భగవద్గీతనిండా కృష్ణ పరమాత్మ నోట పలికిన నేను, ఈ నేనే! అందుకనే వ్యాసుల వారు ఎక్కడా శ్రీకృష్ణ ఉవాచ అనకుండా 'భగవాన్ ఉవాచ' అన్నారు!**

చైతన్యమూ లోకమూ అనంతాలే! ఆదీ, అంత్యము ఎరుగనిది ఈ మహాసృష్టి! కాలం వలెనే ఇది ఆగనిది. అలుపెరుగనిది.

నిశ్శబ్దంలోంచి శబ్దం;
యోగంలోంచి యుగం;
నిస్వనం నుండీ నాదం;
నిష్క్రియ నుండీ క్రియ;
అచేతన నుండీ చేతన;
జననం నుండీ మరణం;
మరణం నుండీ జననం;
జననం నుండీ మనసు;
మనసు నుండి ఆలోచన;
ఆలోచన నుండి కర్మ;
కర్మల వలన వాసనలు;

వాసనల నుండీ మూల వాసనలు.... ఎట్లా మరల, మరల ఏర్పడి, వేర్పడి, మళ్లీ మూలంలో కలుస్తూ, అనేకంగా కనిపిస్తున్నదో అదంతా, లోకమే! ఈ లోకం జడ చైతన్యాల కలబోతగా ప్రత్యక్షంగా ఉన్నది. సమష్టిగా కనిపిస్తున్న ఈ లోకానికి సంక్షిప్త రూపమే మానవుడు. 'మా' అంటే కాదు. 'నవ' అంటే క్రొత్త! అంటే మానవుడు క్రొత్తవాడు కాదు. సనాతనుడు సనూతనుడై సంచరిస్తున్నాడు. అంతే!

కనుక జీవుడు - జగత్తు బింబ-ప్రతిబింబ భావంతో సృష్టిని రసప్లావితం చేస్తున్నారు. రసము అంటే ఈశ్వరుడే! అంటే అవి ఈశ్వర చైతన్యాన్ని అనేక క్షేత్రాలలో ప్రవహింపచేస్తున్నవి.

లోకమును వీడి రసము లేదు.

రసమెరుగని లోకము లేదు!!

ఇక జగదీశ్వరుడు ఎవరు?

జీవజగత్తుల స్థితులను సమతుల్యంగా నడిపిస్తున్న ఆత్మే భగవంతుడు! ఈ ఆత్మ, దేహంలో శబ్దమయంగా 'నేను' 'నేను' అంటున్నది కనుక దైవానికి మొదటి పేరు 'నేను'!

భగవద్గీతనిండా కృష్ణపరమాత్మ నోట పలికిన నేను, ఈ నేనే!

అందుకనే వ్యాసుల వారు ఎక్కడా శ్రీకృష్ణఉవాచ అనకుండా 'భగవాన్ ఉవాచ' అన్నారు!

ఇన్ని కారణాల వలన లోకం, లోకేశ్వరుడు, జీవుడుడ కలిపి ఒక అద్భుత త్రిపుటి ఏర్పడింది. ఈ మూడిటి యందు ఓంకారం అంతర్వాహినిగా, నిస్తంద్రమంద్ర నిస్వన నాదంగా, ఊపిరిగా, ప్రాణంగా, వాయువుగా, ఆయువుగా, చైతన్యంగా కదులుతూ, కదిలిస్తూనే ఉన్నది.

కనుక కదులుతున్న దేహమంతా ఓంకారనాదమయమే.

21,600 సార్లు జరుగుతున్న ప్రాణాయామమంతా ఓంకార ప్రసారమే!

'అ' 'ఉ' 'మ' అనబడే ప్రణవాంతర్గతమైన నాదబిందువులే మూడు అవస్థలకు సంకేతాలు!

శూన్యం నుండీ ప్రారంభమై, పూర్ణం వైపు సాగినా,

పూర్ణం నుండీ శూన్యం వైపు జరిగినా,

ఓంకారమే ఈ సృష్టిని అవహించిన చైతన్యభూమిక!

అది శూన్యపూర్ణాల కలయిక! జడచైతన్యాలను జాగృతం చేయగల మహాప్రేరక శక్తి, చోదక శక్తి!

ప్రణవధ్యానంతో ఇంద్రియాలు, మనసు నెమ్మదిస్తయ్. ఇదే నిగ్రహం.

ప్రశాంత, ప్రసన్న స్థితిలో 'ఆత్మ' మనిషిని సాక్షీభూత స్థితికి చేరుస్తుంది.

కప్పగెంతులు ఆగి, కళ్లగంతలు వీడి, స్వస్వరూప అనుసంధానం సహజంగా జరిగిపోతుంది.

మనిషి జీవన్ముక్తువుతాడు!

అపుడు దేహం సైతం ఆత్మగా శోభిల్లుతుంది!

ఇదే మాండూక్యోపనిషత్ సారం.



వి.యస్.ఆర్.మూర్తి
9440603499

# చింతన




## విశ్వరూప స్మరణే విస్మయకారకం

**తచ్చ సంస్మృత్య సంస్మృత్య**
**రూపమత్యద్భుతం హరేః।**
**విస్మయో మే మహాన్ రాజన్**
**హృష్యామి చ పునఃపునః॥**

**తాత్పర్యం**
ఓ రాజా! అత్యద్భుతమైన శ్రీకృష్ణభగవానుని రూపమును స్మరించిన కొలది నేను అత్యంత విస్మయము నొందుచు మరల మరల ఆనందమును అనుభవించుచున్నాను.

**భాష్యం**
ఈ శ్లోకమును బట్టి సంజయుడు కూడా శ్రీకృష్ణుని విశ్వరూపమును చూసినట్లు అర్థమగుచున్నది. అటువంటి రూపమును ఇంతకు ముందు ఎవరూ చూసి ఉండలేదు. అనగా అర్జునునికి చూపించినప్పుడు, వేరే కొంత మంది గొప్ప భక్తులు కూడా చూశారని అర్థమగుచున్నది. వ్యాసదేవుడు శ్రీకృష్ణుని గొప్పభక్తుడే కాక భగవంతుని అవతారము కూడా. అందువలన ఆయన కూడా విశ్వరూపాన్ని దర్శించి తన శిష్యుడైన సంజయునికి కూడా చూపించెను. ఆ విశ్వరూపాన్ని తలచుకుని సంజయుడు మరల మరల ఆనంద పరవశుడగుచున్నాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యధాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

# అన్నదానాల్లో సాయినాథుడు




సాయిబాబా అన్నదానాలు చేసేవారు. చేయండని ప్రోత్సహించేవారు. అన్నదానాలు కొన్ని ప్రత్యేకంగా ఉంటాయి. అవి సంతర్పణ, పండగ సమయాలలో, వివాహాది శుభకార్యాలప్పుడు వాటిలో భాగంగా జరిగేవి. అన్నదానం చేసేప్పుడు బాబా తమ ఇంటికి వస్తే బాగుండునని భక్తులు కోరుకునేవారు. ఆ సమయంలో తమ ఇంటికి వచ్చి ఆశీర్వదించమని కూడా వారు బాబాను కోరేవారు. భౌతికంగా ఒకటి రెండు ప్రదేశాలకు తప్ప వెళ్ళని సాయి ఆ భక్తుల కోర్కెలను తీర్చేవారు. కాళ్లు ద్వారకామాయి నుంచి కదిలించకుండానే. అది సాయి చరిత్రలోని విశేషాల్లో ఒకటి.

### సాధువు రూపంలో

ఒకసారి బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్ అనే సాయి భక్తుడు దహనులో జరిగే ఉద్యాపన కార్యక్రమానికి సాయిబాబాను ఆహ్వానిస్తూ బాపు సాహెబ్‌కు ఉత్తరం పంపాడు. మరో ఇద్దరితో పాటు హాజరవుతానని జోగ్ చేత ఉత్తరం రాయించాడు సాయి. అంతకు ముందు పరిచయమైన ఒక బెంగాలీ సాధువు ఉద్యాపన రోజు ఉదయమే దేవ్‌ను కలసి 'తాను మరిద్దరు భోజనానికి రావచ్చునా' అని అడిగాడు. దేవ్ అంగీకరించాడు. మధ్యాహ్నం బెంగాలీ సాధువు, మరో ఇద్దరితో

వచ్చి దేవ్ చేసిన ఉద్యాపనంలో పాల్గొని భోజనం చేసి తాంబూలం స్వీకరించి వెళ్లిపోయాడు. సాయిబాబా కోసం నిరీక్షించిన దేవ్‌కు నిరాశే మిగిలింది. సాయి వస్తానని మాట ఇచ్చిరాలేదని జోగ్‌కు ఉత్తరం రాశాడు దేవ్. తర్వాత సాయి తెలిపిన మీదట బెంగాలీ సాధువుగా, మరి ఇద్దరితోను వచ్చి భోజనం చేసినది సాయియే అని దేవ్ గ్రహించాడు. సాయినాథుని గుర్తు పట్టలేకపోయినందుకు చింతించాడు. సాయి ఇచ్చిన మాట తప్పనివారు. సాయినిగుర్తు పట్టకపోతే అది రమ్మన్నవారి పొరపాటు.

### ఫకీరుగా

జి.కె.రేగె తన మామగారైన నారాయణరావు పరూల్కర్ వలన సాయి భక్తుడయ్యాడు. రేగె తహసీల్దారుగా పనిచేసేవాడు. ఆయన మూడవ కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. ఆ వివాహానికి వచ్చి, వధూవరులను ఆశీర్వదించవలసిందిగా ఆయన సాయిని కోరారు.

**'నేను స్వయంగా వివాహానికి హాజరవుతాను'** అని సాయి వర్తమానం పంపారు. అంటే ఆ పెండ్లి పెద్దలు సాయి కోసం నిరీక్షించాలి. ఏ రూపంలో వస్తాడో, ఏ సమయంలో వస్తాడో చూడాలి. పందిట్లో పెళ్లవుతున్నది. సాయి జాడ లేదు. వివాహ వేడుక జరుగుతున్న సమయంలో ఒక కవరు అందింది. ఆ కవరులో ఊదీ పొట్లం, దానిని వధూవరుల నుదుటిపై పెట్టాలనే సందేశం ఉంది. ఊదీ రావటం అంటే స్వయంగా సాయి వచ్చినట్లే. వధూవరుల నుదుటిపై ఊదీని పెట్టారు పెళ్లి పెద్దలు.

అంతేకాదు అదే రోజు ఒక ఫకీరు రేగె మామగారైన నారాయణ రావు పరూల్కర్ వద్దకు వచ్చాడు. ఆ ఫకీరు ఆయనను ఒక పైసా అడిగాడు. అయితే నారాయణరావు ఇవ్వలేదు. ఆ ఫకీరు వెళ్లిపోయాడు. అతను వెళ్లిన తరువాత నారాయణరావుకు ఆలోచన వచ్చింది. ఆయనే సాయిబాబాయేమోనని. అలా సందేహం రావటం సహజమే. దానికి కారణం లోగడ చంద్రాబాయి బోర్కర్ అనే సాయి భక్తురాలి వద్దకు ఒక ఫకీరు వచ్చి వెల్లుల్లి పచ్చడి అడిగాడు. ఆ సమయంలో బోర్కర్ చాతుర్మాస్య దీక్ష చేస్తోంది. ఆ విషయమే ఫకీరుకు చెప్పింది. ఆ ఫకీరు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిపోయిన తరువాత ఆమెకు అనుమానం వచ్చింది. ఆయన సాయిబాబా అయి ఉండవచ్చుని. ఇది గుర్తున్న నారాయణరావు వెంటనే తన అల్లుడు రేగె వద్దకు వెళ్లి ఫకీరు పైసా అడగటం గురించి చెప్పాడు. ఆ ఫకీరు ఎవరో కాదు సాయియే అని రేగె నమ్మకం. అంతకు ముందు వచ్చిన ఫకీరు సాయియే అయితే మళ్ళీ తమ వద్దకు రావాలని రేగె సాయిని తలచుకుని ప్రార్థించాడు. మరునాడు మరో ఫకీరు వచ్చి పైసా అడిగాడు, రేగె సంతోషంగా సమర్పించాడు. నారాయణరావు ఆ ఫకీరును భోజనం చేసి వెళ్లమని అడిగాడు. అయితే ఆ ఫకీరు భోజనం చేయలేదు.

ముళ్లపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్



**దేవతలు, మునులు గోమతిని పఠించి, ఉత్తమగతులను పొందారు. గో మంత్ర జపం వల్ల సంపదలు, విజయం, వృద్ధి, ఉత్తమ సంతానం సాధించగలుగుతారు. ఉత్తమ వంశంలో జన్మించి తన పేరు మీద వంశాన్ని లోక ప్రసిద్ధి చేసిన మహోన్నతుడైన రఘువు జన్మించినది దిలీపుని గోసేవ వల్లనే**

బరమగతి కోరువారలు పాదముష్టి
యష్టి వాక్చిత్తముల గోవునఖి భవింప
కుండ వలయు
నివ్విద్యబద్మోద్భవుండు
సెప్పెనది యాత్మ పావన శిష్ట సేవ్య
(అను 3-91)

'నీకు నపత్య
శతంబుల
నేకంబుల గలవు
వానికేకా కృతి దుః
ఖాకులత సంభవింపదు
శోకింపకు.................'
(అను 3-85)

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206



మూరెడు, బారెడు... కొలతేల?
ప్రగతి మార్గపు హద్దులేల?
ప్రకృతి కలిగించే శారీరక, మానసిక
తాపాన్ని...

పాపమంటే ఎలా?...
ఆ సహజ తాపాన్ని, సక్రమ
సద్వినియోగానికి నియంత్రించాలి

శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి




దీపావళి పండుగకు కేవలం కొద్దిరోజులు మాత్రమే మిగిలి ఉంది. మీ ప్రియమైన వారి భవిష్యత్తుకు భరోసా అందిస్తూనే సంతోషాన్ని వ్యాప్తి చేయాలని మీరు కోరుకుంటున్నారా? ఈ నేపథ్యంలో వాయు కాలుష్యం వల్ల జరిగే అనర్థాల నుంచి గట్టెక్కడానికి ఆరోగ్య బీమా గురించి తెలుసుకుందాం..



# దీపావళి కాలుష్యం, ప్రమాదాలకు...
# ఆరోగ్య బీమా ధీమా!

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్ (సీఓపీడీ) కేసుల పరంగా అంతర్జాతీయంగా ర్యాంకింగ్స్‌లో మొదటిస్థానంలో ఉన్న ఇండియా ఆస్తమా కేసుల పరంగా రెండో స్థానంలో ఉంది. గ్లోబల్ బర్డెన్ డిసీజ్ అధ్యయనం 2016 ప్రకారం 93.5 మిలియన్ల మంది రోగులు ఇప్పుడు భారతదేశంలో ఆస్తమా సీఓపీడీతో బాధపడుతున్నారు. పెరుగుతున్న నగరీకరణ, సరైన మౌలిక వసతులు లేకపోవడం, కాలుష్యస్థాయి పెరుగుతుండటం వంటివి ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. ఆస్తమాటిక్ రోగులలో స్ట్రోక్, న్యూమోనియా, గాస్ట్రో ఈసోఫగల్ ఇన్‌ఫెక్షన్ ఇతర తీవ్రమైన సమస్యలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయి. భారతదేశవ్యాప్తంగా అక్టోబర్ నెల పండుగ సీజన్ ఆరంభానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ వేడుకల కారణంగా గాలి నాణ్యత మరింత ఇబ్బందికరంగా మారడంతో పాటుగా తీవ్రమైన ఆస్తమా లేదా బ్రాంకిటిస్ బారిన పడేందుకు అవకాశమూ కల్పిస్తుంది. దీనికి తోడు అలర్జీలు, వాతావరణం మార్పు, శీతాకాల ఆరంభానికి కూడా ఇది సమయం కావడంతో పాటుగా రోగులు ఆరోగ్యంగా ఉండటం కాస్త కష్టంగా ఉంటుంది. పండుగకు సిద్ధంకావడంలో భాగంగా ఇల్లు శుభ్రపరుచుకోవడం, రంగులు వేయడం, దులపడం వంటి అంశాలు ఆస్తమా రోగులు మరింత ఇబ్బందిపడేందుకు దోహదపడతాయి.

కాలుష్యస్థాయి తగ్గించుకోవడంతో పాటుగా ఆరోగ్యకరమైన వాతావరణం నిర్మించే దిశగా సుప్రీంకోర్టు గత సంవత్సరం సంప్రదాయ దీపావళి టపాసులు కాల్చడాన్ని నిషేధించింది. కేవలం పర్యావరణ అనుకూల అతితక్కువ ఉద్గారాలు వెలువరించే టపాసులు మాత్రమే కాల్చడానికి అనుమతించింది.

అయినప్పటికీ దేశ రాజధానితో పాటుగా చుట్టుపక్కల రాష్ట్రాలైన హర్యానా, పంజాబ్‌లలో గాలి నాణ్యత అతి స్వల్పంగా ఉంది. అక్కడ పంట పండిన తరవాత వ్యర్థాలను తగులపెట్టడంతో పాటుగా ఈ సంవత్సరం దసారా సమయంలో టపాసులు కాల్చడం కూడా కారణం.




దీపావళి పండుగకు కేవలం కొద్దిరోజులు మాత్రమే మిగిలి ఉంది. మీ ప్రియమైన వారి భవిష్యత్తుకు భరోసా అందిస్తూనే సంతోషాన్ని వ్యాప్తి చేయాలని మీరు కోరుకుంటున్నారా? మేము ఆరోగ్య బీమా గురించి మాట్లాడుతున్నాం.

ఆస్తమా రోగుల కోసం ఆరోగ్య బీమా కొనుగోలు చేయకమునుపు ప్రతి ఒక్కరూ ఈ ఐదు అంశాలను గమనించాలి.

### 1. కవరేజి గురించి తెలుసుకోండి

ఆస్తమాతో బాధపడేవారికి వైద్య ఖర్చులను కవర్‌చేసేలా ఆరోగ్య బీమా కవరేజి ఉండాలి. అనుభవజ్ఞుడైన కోచ్ నిరంతరం వినియోగదారులతో అనుసంధానించబడి ఉండటంతో పాటుగా ఆస్తమా రోగి స్థితి మెరుగుపడే సలహాలిస్తూనే హాస్పిటలైజేషన్ ఖర్చులేవైనా ఉంటే వాటిని కవర్ చేసేలా తోడ్పడాలి. పరిస్థితికి తగ్గ ఆరోగ్య బీమా పాలసీలు సంపూర్ణమైన కవరేజి అందిస్తాయి. అందువల్ల ఆరోగ్యబీమా కొనుగోలుకు ముందు మీరు మీ బడ్జెట్‌కు అనుగుణంగా ఏ పాలసీ సరిపోతుందో తెలుసుకోవాలి.

### 2. జేబులో నుండి అయ్యే ఖర్చులను గమనించాలి

ఆరోగ్య బీమాలో కొన్ని రకాల వైద్య ఖర్చులకు బీమా లభించదు. సహ చెల్లింపులు, మినహాయింపులు, ఉపపరిమితులు, చెల్లింపులు లేని వస్తువులు ఉంటాయి. సహచెల్లింపు అనేది నిర్దిష్టమైన శాతంలో ఉండే నిర్వహణ ఖర్చు, ఇది క్లెయిమ్ చేసుకున్న ప్రతీసారి వినియోగదారుడు చెల్లించాల్సి ఉంటుంది. డిడక్టబుల్స్ అంటే కవరేజిలో ఉన్న సేవలకు ఇన్సూరర్ చెల్లింపులకు ముందు చెల్లించాల్సిన మొత్తాలు, నాన్ పేయబుల్ కాస్ట్ అంటే బీమా కంపెనీ చెల్లింపు జరుపని ఖర్చు, ఉపపరిమితి అంటే పాలసీ కవరేజిలో నిర్దిష్టమైన అంశాలకు చెల్లించే మొత్తం వంటివి వస్తాయి. అందువల్ల ఈ ఖర్చులను గురించి ఆరోగ్య బీమా పాలసీ కొనుగోలుకు ముందు తెలుసుకోవడం మంచిది.

### 3. డ్రగ్స్, డాక్టర్ ఓపీడీ కన్సల్టేషన్ కవర్ అవుతాయా పరీక్షించాలి

తమకు లభిస్తోన్న అవకాశాల నుండి ఎంచుకునేటప్పుడు ఈ సమాచారం తెలుసుకోవాలి. ఆస్తమాను అత్యుత్తమంగా కవర్ చేస్తుందో లేదో తెలుసుకోవాలి. ప్లాన్స్‌లో మీ ప్రాధాన్యతలను ఎంచుకున్న తర్వాత బీమా కంపెనీకి కాల్ చేసి డాక్టర్ ఫీజులు, మందులు, హాస్పిటల్ చార్జీలు వంటివి తెలుసుకోవాలి. ఈ ప్లాన్ కింద సంపూర్ణంగా కవర్ అవుతున్నాయా లేదా అని గమనించాలి. చక్కటి ఆరోగ్యం కలిగిన బీమా ప్రణాళికలో పలు పరీక్ష ఖర్చులను కవర్ చేయడంతో పాటుగా డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు, మందుల ఖర్చు వంటి వాటిని హాస్పిటల్‌లో చేరనప్పటికీ అందిస్తాయి.

### 4. క్లిష్టత లేని చికిత్స, రికవరీ

అనారోగ్యం మీ ఆర్థిక స్థితిపై ప్రభావం చూపడమే కాదు భావోద్వేగాల పరంగా కూడా ప్రభావం చూపుతుంది. ఆస్తమా, ఓ వ్యక్తిని తీవ్రంగా ఇబ్బంది పెట్టడమే కాదు. ఆర్థిక ఒత్తిడి కారణంగా డిప్రెషన్‌లోకి కూడా చేరిపోవచ్చు. ఈ డిప్రెషన్ సాధారణంగా రికవరీ ప్రాసెస్‌పై కూడా ప్రభావం చూపవచ్చు. సరైన ఆరోగ్య బీమా, అన్ని రకాల ఆస్తమా సంబంధిత ఖర్చులను తీర్చడం వల్ల రోగి తన ఆరోగ్యంపై దృష్టిసారించవచ్చు. బీమా కంపెనీ బ్రాండ్‌తో మీరు సౌకర్యవంతంగా ఉన్నారా లేదా అన్నది దయచేసి గమనించుకోండి. అలాగే క్లెయిమ్ చెల్లింపులు, టర్న్ ఎ రౌండ్ సమయాల రికార్డును కూడా గమనించండి.

### 5. ఇతర కవరేజి సేవలను పరిశీలించండి

అర్హత కలిగిన హెల్త్ కోచ్ సేవలను అందించే ఉత్పత్తులు కూడా ఉన్నాయి. ఈ హెల్త్ కోచ్‌లు ఆస్తమా రోగులు అతను/ ఆమె స్థితిని చక్కగా నిర్వహించేందుకు సహాయపడటంతో పాటుగా ట్రీట్‌మెంట్ ప్రొటోకాల్‌కు అతను/ ఆమె కట్టుబడి ఉండేలా చేస్తారు. హెల్త్ కోచ్‌తో సంబంధం ఫ్యామిలీ డాక్టర్‌తో సంబంధం లాగానే ఉంటుంది. వీరు వ్యక్తిగత శ్రద్ధను చూపుతారు. ఈ హెల్త్ కోచ్ జీవితానికి క్రమశిక్షణ అందించడంతో పాటుగా ఆస్తమా రోగుల కండీషన్ పట్ల జాగ్రత్త వహించగలరు.

మొత్తం మీద ఆరోగ్య బీమా ప్రణాళికలో పెట్టుబడి పెట్టే ముందు స్మార్ట్ డిసిషన్ తీసుకోవడం ముఖ్యం. మీ ఆరోగ్యం, అనారోగ్యంలో సైతం భాగస్వామిగా ఉండేలా ఉండే పాలసీలో దయచేసి పెట్టుబడి పెట్టండి. అతి తక్కువ హాస్పిటలైజేషన్‌తో ఆరోగ్యం చక్కగా నిర్వహిస్తాయన్న భరోసాను పొందండి. ఈ తరహా పాలసీలు మాత్రమే సంపూర్ణమైన ఆర్థిక భద్రతను అందించగలవు. అంతేకాదు మీతో పాటుగా మరీ ముఖ్యంగా మీ కుటుంబానికి మనశ్శాంతి అందించగలవు.

అనూరాధా శ్రీరామ్, చీఫ్ ఆక్చ్యురీ
ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్

వచ్చేనాలుగేళ్లలో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడికి

## జాన్సన్ అండ్ జాన్సన్ రెడీ

2030 నాటికి హెచ్ఐవి, క్షయవ్యాధి(టీబీ)లను అంతమొందించడంలో ప్రపంచ ప్రయత్నాలను వేగవంతం చేయడానికి రాబోయే నాలుగేళ్లలో ప్రపంచస్థాయి పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు వాటి ఫలితాలు అందించే కార్యక్రమాలకు 500 మిలియన్ డాలర్లకు పైగా మొత్తాన్ని వెచ్చించేందుకు కట్టుబడి ఉన్నట్టు జాన్సన్ అండ్ జాన్సన్ ప్రకటించింది.ప్రపంచంలోని అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ సంస్థలలో ఒకటిగా జాన్సన్ అండ్ జాన్సన్ నిలిచింది.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది ప్రజల ఆరోగ్యాన్ని, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు, వ్యూహాత్మక భాగస్వాములతో కలిసి పనిచేస్తోంది. ''అంటువ్యాధిని తొలగించే చారిత్రాత్మక సవాలును ఏ ఒక్క సంస్థ కూడా ఒంటరిగా ఎదుర్కోలేదు'' అని జాన్సన్ అండ్ జాన్సన్ ఎండీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ వైస్ చైర్మన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఎండి పాల్ స్టోఫెల్స్ అన్నారు. '' మా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, మా ఉత్తమ శాస్త్రవేత్తలను ఏకం చేయడం ద్వారా హెచ్ఐవి, టిబిలలో దశాబ్దాల అనుభవాన్ని అందించడం ద్వారా, ప్రపంచ ప్రయత్నానికి గణనీయమైన సహకారాన్ని అందించగలమని మేము ఆశాభావంతో ఉన్నాం'' అని అన్నారు.

హెచ్ఐవి, టిబి రంగాల్లో ఫార్మాస్యూటికల్ కంపెనీలు రూపొందించుకున్న బలమైన ట్రాక్ రికార్డుతో జాన్సన్ అండ్ జాన్సన్ ప్రస్తుతం అమలు చేస్తున్న హెల్త్ ఫర్ హ్యూమానిటీ 2020 లక్ష్యాలను పెట్టుకుంది. జాన్సన్ అండ్ జాన్సన్ రేపటి తరం మందులు, వాక్సీన్ల ఆవిష్కరణ, అభివృద్ధి, పంపిణీలను వేగవంతం చేయడానికి గాను ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా తన ప్రపంచస్థాయి పరిశోధకుల బృందాన్ని కూడా వినియోగిస్తుంది.

వినూత్న ఆవిష్కరణలో ఈ పెట్టుబడి హెచ్ఐవి,టిబిలలో ప్రభావితమైన మిలియన్ల మంది ప్రజల రోజువారి జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీర్ఘకాలంలో ఆరోగ్యరంగంలో దేశ పెట్టుబడుల సామర్థ్యాన్ని పెంచుతుంది. అలా చేయడం ద్వారా ఈ ప్రయత్నాలు ఇతర అంతర్జాతీయ కార్యక్రమాలతో మిళితం చేసినప్పుడు ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి ఆశయం మూడు లక్ష్యాల సాధనకు అవి తోడ్పాటును ఇవ్వగలుగుతాయి.

## 15 నెలల్లో 4.5 లక్షల ఇళ్లు

### ప్రాప్‌టైగర్ నివేదిక

రియల్ ఎస్టేట్ డెవలపర్స్ దాదాపు 4.5 లక్షల హౌసింగ్ యూనిట్లను అందుబాటులోకి తెచ్చింది. వచ్చే 15నెలల వ్యవధిలో వీటిని డెలివరీ చేయనున్నట్టు ప్రాప్‌టైగర్ డాట్ కామ్ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. కొత్త ప్రభుత్వం ఈ రంగంలో ప్రోత్సహించడానికి నిర్ణయించిన నేపథ్యంలో గత కొన్ని నెలలుగా చురుకుగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 2022 వరకు అందరికీ ఇళ్లు నినాదాన్ని సార్థకం చేయడానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గృహరుణాల మీద వేసే వడ్డీ మీద పన్ను మినహాయింపు ఇచ్చింది. సంవత్సరానికి 1.5 నుంచి 3.5 లక్షల వరకు పెంచింది. అయితే యూనిట్ ధర 45లక్షలకు మించని సందర్భాల్లోనే ఇది వర్తిస్తుంది.

ఈ రిపోర్టు ప్రకారం దేశంలోని తొమ్మిది ప్రాపర్టీ మార్కెట్లు 7.95 లక్షల హౌసింగ్ యూనిట్లను 2019 అక్టోబర్ నుంచి 2020 డిసెంబర్ మధ్య విడుదల చేయాలని నిర్ణయించాయి.

# అధిక ఇంట్రెస్ట్ వచ్చే ఆన్‌లైన్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు



ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇంట్రెస్ట్ రేట్లు గత సంవత్సరకాలంలో బాగా పడిపోయాయి. బ్యాంకులు దాదాపు 8శాతం మించి ఇవ్వడం లేదు. అంతకంటే ఎక్కువగా ఇచ్చే బ్యాంకులు లేవు. అయితే బ్యాంకులు కాకుండా ఇతర ఆర్థిక సంస్థల గూర్చి ఆరా తీస్తే ఇక్కడ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వల్ల వచ్చే ఇంట్రెస్ట్ రేట్ ఎక్కువగా ఉంది. బ్యాంకుల్లో ఎస్‌బిఐ ఒక్కటే మంచి ఇంట్రెస్ట్ ఇస్తుంది. పెట్టుబడిదారులు షార్ట్,మీడియం టర్మ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెడితే ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

### బజాజ్ ఫైనాన్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్స్ ఆన్‌లైన్

బజాజ్ ఫైనాన్స్ ఆన్‌లైన్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లకు ఆహ్వానిస్తుంది. నెఫ్ట్, ఆర్టిజిఎస్ ద్వారా డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేయొచ్చు. 12 నుంచి 23 నెలల కాలంలో డిపాజిట్ చేస్తే ఇంట్రెస్ట్ రేట్ 8శాతం వరకు వస్తుంది. అదే 24 నుంచి 35 నెలల వరకు అయితే ఇంట్రెస్ట్ రేట్ 8.05శాతం వరకు ఉంటుంది. అదే 36 నెలలు అయితే 8.35శాతం వరకు ఉంటుంది. బ్యాంకులతో పోలిస్తే ఈ ఆర్థిక సంస్థల నుంచి తీసుకుంటున్న ఇంట్రెస్ట్ రేట్ తక్కువేమి కాదు. బ్యాంకులు రాను రాను ఇంట్రెస్ట్ రేట్‌లు తగ్గిస్తున్న నేపథ్యంలో ఇది మంచి అవకాశం అని చెప్పొచ్చు. పెట్టుబడిదారులు మీడియం టర్మ్ ఇన్వెస్ట్ చేయొచ్చు. డిపాజిట్లకు ట్రిపుల్ ఎ రేటింగ్ వచ్చింది. అంటే ఈ డిపాజిట్లు సురక్షితమైనవి అన్నమాట.

### మహీంద్రా ఫైనాన్స్

మహీంద్రా ఫైనాన్స్ కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను ఆన్‌లైన్ ఆహ్వానిస్తుంది. ఇక్కడ ఇంట్రెస్ట్ రేట్ 8.70 ఉంది. 33నెలల డిపాజిట్ చేస్తే 9.33శాతం వస్తుంది.

ఇది ఆకర్షణీయమైంది. నాలుగునెలల వ్యవధి వరకు డిపాజిట్ చేసినప్పటికీ ఇంట్రెస్ట్ రేట్ 8.70శాతం వరకు వస్తుంది. గరిష్టంగా 9.40 వరకు వస్తుంది. ఈ డిపాజిట్లు కోటిరూపాయల లోపు వరకు పెట్టొచ్చు. వీటికి కూడా ట్రిపుల్ ఎ రేటింగ్ వస్తుంది. ఇవి కూడా సురక్షితమైనవి.

### ఎస్ బ్యాంక్

ఎస్ బ్యాంక్ కూడా ఆకర్షణీయ ఇంట్రెస్ట్ రేట్ ఇస్తుంది. 12 నెలల డిపాజిట్ అయితే ఇంట్రెస్ట్ రేట్ 7.85శాతం వరకు ఉంది. ఇది ఏ మాత్రం నష్టదాయకం కాదు. చాలా మటుకు ప్రభుత్వానికి చెందిన బ్యాంకులు తక్కువ ఇంట్రెస్ట్‌లు ఇస్తున్నాయి. 8.08శాతం వరకు ఉంది. మీరు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. తొమ్మిదినెలల నుంచి సంవత్సరం వరకు డిపాజిట్ చేసుకోవచ్చు. 7.15శాతం వరకు ఇంట్రెస్ట్ రేట్ ఉంటుంది.

### ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్

ఫిక్స్‌డ్ డిపాజిట్ల కోసం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌కి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక సంవత్సరం డిపాజిట్ కొరకు ఈ బ్యాంకు ఇంట్రెస్ట్ రేట్ 8శాతం వరకు ఇస్తుంది. 2 నుంచి 5 ఏళ్ల వరకు అయితే డిపాజిట్లకు 7.5 శాతం వరకు ఇంట్రెస్ట్ వస్తుంది.

# పంటబీమాతో రైతుకు రిలీఫ్




ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. భారతదేశం కూడా ఏ మాత్రం తీసిపోకుండా ఉంది. మనదేశంలోని సగభాగం వరదలతో ముంచెత్తుతుండగా, మరో సగభాగం మాత్రం తీవ్ర కరువు తాకిడికి గురవుతుంది. ఇటువంటి పరిస్థితులు వ్యవసాయ రంగం మీదతీవ్ర ప్రభావం చూపుతుంది. మన దేశ ఆర్థిక రంగంలో వ్యవసాయం అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది.

ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఎక్కువగా నష్టపోయేది మాత్రం రైతులు. వాళ్లు అన్ని విధాల ప్రయత్నాలు చేసినప్పటికీ ఆదాయం మాత్రం శూన్యం. ఎందుకంటే వరదలు వచ్చినప్పుడు పంట నష్టం తీవ్రంగా ఉంటుంది. ఆయా రాష్ట్రప్రభుత్వాలు నష్టపోయిన రైతులకు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయి. సహాయక నిధి నుంచి ఈ ఉపశమన చర్యలు చేపడుతుంది. పంట నష్టపోయినప్పుడు ఆయా ప్రభుత్వాలు ఇచ్చే ఉపశమనం రైతులకు ఏ మాత్రం ఊరట కలిగించదు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) పంట బీమా పథకం మరింత ఉపశమనం కలిగిస్తుంది. రాష్ట్రప్రభుత్వం ఇచ్చే ఉపశమనచర్యలు సరిపోనప్పుడు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ పథకం వల్ల మరింత ప్రయోజనాన్ని పొందొచ్చు.

### క్లెయిమ్ ప్రాసెస్

పిఎంఎఫ్‌బివై క్రింద రైతులకు తాత్కాలిక భృతి అందించవచ్చు. వరదల వల్ల లేదా కరువు వల్ల నష్టం జరిగితే బీమా యూనిట్ల కంటే 50శాతం ఎక్కువగా నమోదైతే మాత్రం అప్పటికప్పుడు 25శాతం పొందొచ్చు. మిగతాది మాత్రం చివరిపంట వచ్చిన తర్వాతే రాష్ట్రప్రభుత్వం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. క్లెయిమ్ ప్రాసెస్ సులభతరమైంది. 21 రోజుల్లోపు పంట బీమా సబ్సిడీ ఇవ్వాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్లెయిమ్‌లు కూడా రైతులకు వ్యక్తిగతంగా ఇవ్వాలి. కొండచరియలు విరిగిపడినప్పుడు, నీళ్లలో మునిగిపోయినప్పుడు, వడగళ్లవాన, పిడుగుపడినప్పుడు లేదా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు రైతులు బీమా కంపెనీలకు తెలియజేయాల్సి ఉంటుంది. వైపరీత్యం జరిగిన 48 గంటల్లోపు బీమా సంస్థకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

### నమోదు

ఈ పథకం క్రింద ప్రయోజనాలు పొందాలంటే రైతు దగ్గరలోని బ్యాంకు లేదా కామన్ సర్వీస్ సెంటర్‌కి వెళ్లి పథకంలో నమోదు కావాలి. నామమాత్రపు ప్రీమియం కట్టాలి. ఖరీఫ్ సీజన్‌లో బీమాలో రెండు శాతం ఉంటుంది. రబీ సీజన్‌లో మాత్రం 1.5శాతం ఉంటుంది. ఈ వివరాలతో పాటు తమ భూమి, బ్యాంకు డాక్యుమెంట్స్ సమర్పించాలి. ఈ వివరాలు ఉన్న పంటను గుర్తించినట్లయితే ప్రీమియం కట్టాలి. వ్యవసాయ శాఖలోని తాలూకా, జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారు.

పంటబీమా అనేది అత్యంత ప్రధానమైంది. నష్ట తీవ్రతను తగ్గించడానికి దీన్ని సాధనంగా మార్చవచ్చు. ప్రభుత్వం, ఇన్సూరెన్స్ కంపెనీలు పంట బీమా మీద వివిధ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రయోజనాలు తెలుసుకోవడం వల్ల వాతావరణంలో ముప్పు పొంచి ఉన్నప్పటికీ పెద్దగా ఆందోళన చెందాల్సిన పనిలేదు.

ఆశిశ్ అగర్వాల్
హెడ్
బజాజ్ అలియెంజ్ జనరల్ ఇన్సూరెన్స్ అగ్రి బిజినెస్

# ఆ ఒక్కటీ అడగొద్దు!


కాజల్ అగర్వాల్

అందాల భామ కాజల్ అగర్వాల్ ఆ ఒక్కటీ అడగొద్దు! అని అంటోంది. ఇంతకీ ఆ ఒక్కటీ ఏంటన్న జిజ్ఞాస ఎవరికైనా తలెత్తుతుంది. ఇక అసలు విషయంలోకి వెళితే...ఇటు తెలుగు, అటు తమిళ చిత్రాలతో ఆమె బిజీ బిజీగా ఉంటోంది. తాజాగా కమల్‌హాసన్ సరసన ఆమె నటిస్తున్న చిరం భారతీయుడు-2. చాలా ఏళ్ల క్రితం వచ్చిన భారతీయుడు చిత్రానికి ఇది సీక్వెల్. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణను జరుపుకుంటోంది. ఈ చిత్రంలో ఆమె నటిస్తున్న పాత్ర ఎలా ఉంటుందోనని అందరూ అనుకుంటున్నారు. గతంలో వచ్చిన భారతీయుడు చిత్రంలో కమల్ ద్విపాత్రాభినయంలో అద్వితీయమైన నటనను కనబరిచిన సంగతి తెలిసిందే. అందులో సేనాపతిగా వృద్ధుడి పాత్రలో అసమాన నటనను కనబరిచారన్న పేరొచ్చింది కూడా. అప్పట్లో 70 ఏళ్ల వృద్ధుడిగా కమల్ కనిపిస్తే...తాజా సీక్వెల్‌లో 90 ఏళ్ల వృద్ధుడిగా మరింత వయసు పైబడిన వ్యక్తిగా కనిపించబోతున్నారట. ఇదిలావుండగా....భారతీయుడులో కమల్ పోషించిన వృద్ధ పాత్రసరసన నటి సుకన్య కూడా వృద్ధ పాత్రలో కనిపించింది. ఇన్నేళ్ల తర్వాత రూపొందుతున్న భారతీయుడు 2లో కమల్ పోషించే వృద్ధ పాత్ర సరసన కాజల్ అగర్వాల్ కూడా వృద్ధ పాత్రలో నటిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే కాజల్ వృద్ధ పాత్ర చేస్తున్నట్లు అటు చిత్రబృందం కానీ...ఇటు కాజల్ కానీ ఎలాంటి స్పష్టత నియ్యలేదు. అయినప్పటికీ కాజల్ వృద్ధ పాత్ర గురించి కోకొల్లల వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాజల్ స్పందిస్తూ....తను తాను రక్షించుకునే రక్షణ కళలు తెలిసిన అమ్మాయిగా నటిస్తున్నా. అయితే పాత్ర వయసు గురించి చెప్పను. ఆ ఒక్కటి మాత్రం అడగొద్దు. నవంబర్‌లో తైవాన్‌లో షూటింగ్ జరగనుంది. అందులో నేను కూడా పాల్గొంటా అని చెప్పుకొచ్చింది.

# క్రేజీ ట్రీట్‌కు సన్నద్ధం


సరిలేరు నీకెవ్వరు


అలా వైకుంఠపురములో


కమ్మరాజ్యంలో కడప రెడ్లు

ఈ రోజుల్లో సినిమాలు నిర్మాణంలో ఉండగానే అటు పరిశ్రమ, ట్రేడ్ వర్గాల్లోనూ...ఇటు ప్రేక్షకాభిమానుల్లోనూ అంచనాలను పెంచాలన్న ఉద్దేశ్యంతో చిత్రబృందాలు పోస్టర్లు, ట్రైలర్లు, టీజర్లను విడుదల చేస్తున్న వైనం చూస్తున్నదే. వీటికి ఎలాంటి ఆదరణ లభించిందన్న విషయం వెంటనే తేటతెల్లమవుతుండటంతో సినీ వర్గీయులు ఆసక్తిని కలిగించేలా వాటిని రూపొందిస్తున్నారు. తాజాగా మహేష్‌బాబు నటిస్తున్న సరిలేరు నీకెవ్వరు చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే విడుదలచేసిన పోస్టర్స్ ప్రేక్షకాభిమానులను ఎంతగానో అలరించాయి. దీపావళి సందర్భంగా ట్రీట్‌కు సిద్ధం కండి అంటూ దర్శకుడు అనిల్ రావిపూడి ఇటీవల సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. బహుశా ఈ చిత్రం పాటనో...లేక ట్రైలర్‌నో ఆ రోజున విడుదల చేస్తారన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. అలాగే సంక్రాంతి సందర్భంగా విడుదల కాబోయే మరో భారీ చిత్రం అలా వైకుంఠపురములో... త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రం పాటను లేదా ట్రైలర్‌ను నవంబర్ 7న విడుదల చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం కూడా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇక సంచలన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ కూడా తాను రూపొందిస్తున్న తాజా చిత్రం కమ్మరాజ్యంలో కడప రెడ్లు. టైటిల్ ప్రకటించిన రోజు నుంచే చర్చకు దారితీసిన ఈ చిత్రం ట్రైలర్‌ను ఈ నెల 27న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ ట్రైలర్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి ప్రేక్షకాభిమానుల్లో నెలకొంది. ఇలా ప్రచార చిత్రాలతో ఈ భారీ సినిమాలు సందడి చేయబోతుండటం ఓ విశేషం.

# క్లాసిక్ రీమేక్ తారలు సిద్ధం..?


అనుష్క శర్మ


కృతి సనన్

అమితాబ్ క్లాసిక్ హిట్ మూవీ సత్తే పే సత్తా రీమేక్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ చిత్ర వార్తలు కొన్నాళ్లుగా వస్తున్నా, అడుగు ముందుకు పడలేదు. తాజాగా ఈ చిత్ర ప్రధాన పాత్రధారుల ఎంపిక ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. హీరోగా హృతిక్ రోషన్ పేరు గతంలోనే వినిపించగా...ఇప్పుడు నాయికలుగా అనుష్క శర్మ, కృతి సనన్‌ను తీసుకున్నారట. దర్శకురాలు ఫరా ఖాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. మరో దర్శకుడు రోహిత్ శెట్టి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. రోహిత్ శెట్టి అక్షయ్ కుమార్‌తో సూర్యవంశీ సినిమా రూపొందిస్తుండటంతో అక్కడ తీరిక లేకుండా ఉండటం వల్ల సత్తే పే సత్తా పనులు ఆలస్యమవుతూ వచ్చాయి. అమితాబ్ చిత్రాన్ని హృతిక్ రీమేక్ చేయడం ఇది రెండో సారి. గతంలో బిగ్ బీ అగ్నిపథ్ పునర్నిర్మాణ సినిమాలో హృతిక్ నటించారు. ఆ సినిమా విజయవంతమైంది. త్వరలో సత్తే పే సత్తా కసరత్తులు ప్రారంభం కానున్నాయి. 1982లో ప్రేక్షకుల ముందుకొచ్చిన సత్తే పే సత్తా ఆంగ్ల చిత్రం సెవన్ బ్రైడ్స్ అండ్ సెవన్ బ్రదర్స్ ఆధారంగా రూపొందింది.


హృతిక్ రోషన్

# నాని సమర్పణలో హిట్



ఓ వైపు హీరోగా నటిస్తూనే నాని నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. ప్రతిభావంతులైన కొత్తవాళ్లను ప్రోత్సహించడంతో పాట అభిరుచి కలిగిన చిత్రాలను నిర్మించాలన్న తలంపుతో ఆయన నిర్మాత అవతారం ఎత్తారు. తొలి ప్రయత్నంలోనే ఆయన తీసిన అ చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణతో పాటు అవార్డులు వరించాయి. కాగా వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో రూపొందనున్న నూతన చిత్రం హిట్ పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో జరిగాయి. ఫలక్‌నుమాదాస్ చిత్రంలో హీరోగా నటించిన విశ్వక్‌సేన్ ఇందులో కథానాయకుడిగా నటిస్తుండగా...రుహానీశర్మ కథానాయికగా సందడి చేయబోతోంది. శైలేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను తెలియజేస్తామని చిత్రబృందం ప్రకటించింది. నాని సమర్పణలో ప్రశాంతి త్రిపిర్‌నేని నిర్మించే ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతాన్ని, ఎస్.మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు.

# పత్రికలు పంచాక పెళ్లి వద్దన్నాడట..!


సల్మాన్

కొన్నేళ్లుగా దేశంలో చర్చనీయమైన అంశాల్లో సల్మాన్ ఖాన్ పెళ్లి ఒకటి. ఎప్పుడో ఒకసారి ఆయన పెళ్లి ప్రస్తావన రావడం అనుకోని కారణాలతో అది ఆగిపోవడం జరుగుతూ వచ్చింది. కొంతకాలం చూసీ చూసీ, జరగని విషయాలకు సల్మాన్ పెళ్లికి పోలిక చెప్పడం సరదా అయిపోయింది. అసలు సల్మాన్‌కు పెళ్లి ఆలోచన ఉందా, ఉండేదా, ఉంటుందా అనే సందేహాలు జవాబులు లేని ప్రశ్నలయ్యాయి. నేను దీనికి సమాధానం చెబుతా అంటూ నిర్మాత సాజిద్‌నడియావాలా ముందుకొచ్చారు. ఇప్పుడుందో లేదో గానీ ఒకప్పుడు ఉండేదని సాజిద్ అన్నారు. ఈయనెవరంటే హౌస్‌ఫుల్ 4 చిత్ర నిర్మాత. మీటూలో దొరికి హౌస్‌ఫుల్ 4 సినిమా దర్శకత్వం నుంచి తప్పుకున్నారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఓ ముఖాముఖిలో పాల్గొన్న సాజిద్...ఒకప్పుడు సల్మాన్ పెళ్లికి సిద్ధమయ్యాడని తెలిపారు. ఆయన వెల్లడించిన ప్రకారం...సల్మాన్‌కు ఓ సంబంధం చూశాం. అప్పటికే ఓ అమ్మాయితో సల్మాన్ స్నేహం చేస్తున్నారు. పెళ్లి పనులు వేగంగా జరిగాయి. పెళ్లి పత్రికలు కూడా పంచారు. మరో ఐదారు రోజుల్లో వివాహం అనగా...సల్మాన్ నా దగ్గరకొచ్చి నాకీ పెళ్లి ఇష్టం లేదు, పెళ్లి చేసుకునే ఆలోచన ఇప్పుడు లేదన్నారు. అని వివరించారు. దబాంగ్ 3 ప్రచార కార్యక్రమాల్లో సల్మాన్ స్పందిస్తూ....నాకు పెళ్లి ఆలోచన ఇప్పట్లో లేదు గానీ ఇద్దరు ముగ్గురు పిల్లల్ని పెంచుకోవాలని ఉంది. అయితే పెళ్లి కాకుండా పిల్లలు రారు కాబట్టి, పిల్లలను తెచ్చుకునే ప్రయత్నం చేస్తాను. అని నవ్వుతూ చెప్పారు.

# సస్పెన్స్ థ్రిల్లర్ కథతో...



సందీప్, శివ, విశ్వాస్, ఠాగూర్, సాన్య, జోయా ప్రధాన పాత్రల్లో ఘంటాడి కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. జికె మిరాకిల్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సస్పెన్స థ్రిల్లర్ కథతో రూపొందనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు ఘంటాడి కృష్ణ మాట్లాడుతూ...గతంలో వచ్చిన 6 టీన్స్ సినిమాను పోలి ఉండే చిత్రమిది. సంగీత ప్రధానంగా సాగుతూ...సస్పెన్స్‌తో ఉంటుంది. అన్ని రకాల వాణిజ్య అంశాలుంటాయి. నటీనటులు కొత్తవారిని తీసుకున్నాం. అన్నారు. నిర్మాత సురేష్ రెడ్డి మాట్లాడుతూ...సంగీత దర్శకుడిగా ఘంటాడి కృష్ణ ప్రేక్షకులకు తెలుసు. ఇప్పుడు దర్శకుడిగా మీ ముందుకు మంచి కథతో వస్తున్నారు అన్నారు.అప్పారావు, కాదంబరి కిరణ్, రమేష్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ - శివ సర్వాని, కెమెరా - జగదీశ్, ఫైట్స్ - రియల్ సతీష్

# మహానటి తర్వాత జాతిరత్నాలు


నవీన్ పొలిశెట్టి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ

'మహానటి' నిర్మించిన స్వప్న సినిమాస్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం జాతిరత్నాలు. ఈ సినిమా ద్వారా నాగ్ అశ్విన్ నిర్మాతగా మారుతున్నారు. నవీన్ పొలిశెట్టి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణప్రధాన పాత్రధారులు. అనుదీప్ కెవి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. నటులు ముగ్గురు ఖైదీ దుస్తుల్లో కనిపిస్తున్నారు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' సినిమాతో హీరోగా నటించిన నవీన్ పొలిశెట్టి ఇందులో హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే మూడొంతులు చిత్రీకరణ పూర్తయింది. రధన్ సంగీతం, సిద్ధాన్ మనోహర్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. నరేష్, బ్రహ్మాజీ, తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, మిర్చి కిరణ్, గిరిబాబు, మహేష్ తదిరులు నటిస్తున్నారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076